
# శంకరాచార్యుల వారి

# జ్ఞాన సందేశాలు

రచన : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



# శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు



రచన & ప్రచురణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

మొదటి ముద్రణ : అక్టోబరు, 2025
ప్రతులు : 2,000


వెల : రూ.100/-

పుస్తకముల కొరకు :-
**తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94901 71853, 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.70/- |
| 9) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 10) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 11) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 12)పంచకోశాలు | - | రూ.60/- |
| 13) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 14) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 15) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



# ధ్యానం చేసే పద్ధతి
# శ్వాస మీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతోన్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమక్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీమండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండలశుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.

## ::1::

మానవులు వారి జీవితంలో జరిగే ఎన్నో సంఘటనల వల్ల బాధ పడతారు. ముఖ్యంగా మరణించిన వారి గురించి విపరీతంగా బాధపడతారు. ఎందుచేతంటే వాళ్ళకి సత్యం తెలియదు. అందుకే శంకరాచార్యుల వారు మానవులు బాధపడే వాటి విషయంలో ఉన్నటువంటి అసలు సత్యాన్ని బోధించారు. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**“యావత్కాలం భవేత్ కర్మ తావత్ తిష్టతి జంతవః**
**తస్మిన్ క్షీణే వినశ్యంతి తత్ర కా పరివేదన ఙఙ”**

తాత్పర్యం:- **“ప్రపంచంలో తమ కర్మ బంధము ఎంతవరకు ఉంటుందో! అంతవరకే ప్రాణులు జీవిస్తాయి, ఆ కర్మ బంధం వీడిపోగానే మరణిస్తాయి. అందుచేత జనన మరణాలు రెండూ కూడా జీవుని ధర్మం అని తెలుసుకోవాలి, దానికి బాధపడడం, భయపడం ఎందుకు?”**

అందుకే జ్ఞానం లేకపోతే దుఃఖమే అంటారు పత్రి గారు.

మానవుడు జన్మిస్తాడు, మరణిస్తాడు. జన్మించడం ఎంత సహజమో, మరణించడం కూడా అంతే సహజం. సృష్టిలో ఉన్న ఏర్పాటు ఇది. తప్పనిసరిగా జరుగుతూనే ఉంటుంది, దానికి ఎందుకు ఏడుస్తావు? అన్నారు. కాని అలా జరిగినపుడు చాలామంది తాము చేయవలసిన పనులు మానేసి జీవితాంతం ఏడుస్తూ కూర్చుంటారు. భార్య పోయినా, భర్త పోయినా, పిల్లలు పోయినా, బంధువులు పోయినా, బాధపడుతూ కూర్చుంటారు. కారణం జ్ఞానం లేకపోవడమే.

శంకరాచార్యులవారు ఇంకా ఏమన్నారంటే? ప్రతి ఒక్కళ్ళు కర్మ బంధాన్ని అనుసరించే జీవిస్తూ ఉంటారు. ఈ సృష్టిలో కర్మ బంధం ఎంతవరకు ఉంటుందో అంతవరకే ప్రాణం ఉన్న ప్రతి జీవి అంటే మానవులే కాదు, జంతువులే కాదు, సమస్త ప్రాణులూ జీవిస్తాయి. కర్మ బంధం వీడిపోగానే

మరణిస్తాయి. ఈ జనన మరణాలు అన్నవి జీవించి ఉన్నవారి ధర్మం. అందుచేత బాధపడవలసిన అవసరం లేదు అన్నారు శంకరాచార్యుల వారు.

కొంతమంది ఏమంటారంటే? నా భర్త ఇప్పటిదాకా ఉన్నాడు, ఆయన వల్ల నేను ఎన్నో సౌకర్యాలు పొందాను, లాభాలు పొందాను, ఇప్పుడు ఆయన దూరం అయితే నా పరిస్థితి ఏమిటి? బాధ పడకుండా ఎలా ఉండగలను? అంటారు. కాని ఈ మాటలు అజ్ఞానంలో ఉన్నవారికి వస్తాయి.

ఎందుకంటే ప్రతి ఒక్కరూ పూర్ణాత్మ నుంచి కానీ, మూలాత్మ నుంచి కానీ విడువడిన అంశాత్మలే. అంటే అందరూ ఆత్మలే కానీ దేహాలు కాదు. ఆత్మలైన మీరు మీ లక్ష్యసాధన కోసం ఒక శరీరంలో ప్రవేశపెట్టబడ్డారు, అంటే కర్మ చక్రంలో ప్రవేశించారు అంటే జనన మరణాల చక్రంలో ప్రవేశించారు. ఈ చావు, పుట్టుకల చక్రంలో నుంచి, అంటే కర్మ బంధంలో నుంచి బయట పడాలి అంటే పూర్ణాత్మ మీకు నిర్దేశించినటువంటి లక్ష్యాన్ని చేరుకోవాలి, ఆ లక్ష్యమే సత్యలోకానికి చేరుకోవడం.

అప్పటిదాకా చావు, పుట్టుకలు తప్పవు. అలాగే కొన్ని అనుభవాల కోసం మీ జీవితాన్ని మీరే నిర్ణయించు కుంటారు. ఆ జన్మలో ఎన్ని సంవత్సరాలు జీవించాలో? ఎంత కాలం ఉండాలో? ఎవరితో ఉండాలో? ఎంతమంది పిల్లలతో ఉండాలో? అవన్నీ మీరే నిర్ణయించుకుంటారు. భర్తను నిర్ణయించు కోవడానికి, భార్యను నిర్ణయించుకోవడానికి, ఎక్కడ జీవించాలో? ఏ మతంలో? ఏ కులంలో? అన్నీ కూడా మీరే నిర్ణయించుకుంటారు. కానీ కర్మ బంధంలో చిక్కుకోవడం వల్ల, చేసిన కర్మలను బట్టే జీవితాన్ని ఎంచుకోవాల్సి వస్తుంది. మీరు ఎంచుకున్న కర్మలను బట్టి ఒకసారి మంచి జీవితం రావచ్చు, ఒక్కోసారి చాలా దుఃఖకరమైన జీవితం కూడా రావచ్చు, అది మీ చేతిలో ఉండదు.

అందుచేత కర్మ చేస్తే ఖచ్చితంగా దాని ఫలితం అనుభవించాలి. అలాంటి కర్మ బంధంలో చిక్కుకున్న వాళ్ళు ఆ కర్మ బంధం ఎంతవరకు

ఉంటుందో అంతవరకే జీవిస్తారు, కర్మ బంధం తొలగిపోతే మరణిస్తారు. అందుచేత ఈ జనన మరణాలు అన్నవి జీవించి ఉన్న వారి ధర్మం, దాని గురించి ఎందుకు బాధపడతావు? అని శంకరాచార్యులవారు చెపుతున్నారు.

ఈ విషయమే శ్రీకృష్ణులవారు కూడా గీతలో చెప్పారు.

**శ్లో॥ అశోచ్యా నన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషచే ।**
**గతాసూ నగతాసూంశ్చ నానుశోచన్తి పండితాం ॥ (భ.గీ.2-11)**

తా:- ఓ అర్జునా! నీవు శోకించ తగనివారిని గూర్చి శోకిస్తున్నావు. పైగా తెలివైన వాడిలా మాటలను కూడా పలుకుతున్నావు. పండితులు అంటే జ్ఞానం ఉన్నవారు మరణించిన వారి గురించి గాని, జీవించి ఉన్నవారి గురించి కానీ ఎప్పుడు దుఃఖించరు.

అందుచేత కనీసం ఇప్పటి నుంచైనా జాగ్రత్తపడు. తప్పులూ, పాపాలూ చేయకు, అధర్మంగా వ్యవహరించుకు, సృష్టి విరుద్ధంగా ప్రవర్తించకు, జ్ఞానాన్ని పెంచుకో! పత్రి గారు, బుద్ధుడు లాంటివారు బోధించినటువంటి "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చెయ్యి. తీవ్ర సాధన చేసినప్పుడు ఖచ్చితంగా నీకు జ్ఞానం వస్తుంది, ఇవన్నీ అర్థమవుతాయి. నువ్వు దేహం అనుకుంటున్నావు, స్త్రీ అనుకుంటున్నావు, పురుషుడు అనుకుంటున్నావు, ధనవంతుడు, పేదవాడు అనుకుంటున్నావు. కాని నువ్వు అవి ఏమీ కావు, నువ్వు ఆత్మవు. సత్యం తెలుసుకో ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయో? అర్థం చేసుకో. ఎందుకు బాధపడతావు? బాధ పడవద్దు అని శంకరాచార్య వారు చెప్పారు.

శంకరాచార్యుల వారు ఇంకా ఏమన్నారంటే జ్ఞానం లేక మీరు బాధపడుతున్నారు అని చెప్పడమే కాదు, సృష్టిలో ఉన్న సత్యాన్ని బోధించి బాధపడవద్దు అని చెప్పడం జరిగింది. అందుకే తెలుసుకోండి మీకు ఎంత జ్ఞానం ఉంటే మీరు దుఃఖం నుంచి అంత బయట పడతారు అన్నారు.

ఆయన ఇంకా ఏమన్నారంటే?

**"ఋణానుబంధ రూపేణా పశుపత్ని సుతాలయః**

**ఋణక్షయే క్షయం యాంతి కాతత్ర పరివేదనా"**

తా:- **"గత జన్మ ఋణానుబంధం ఉన్నంతవరకే భార్య, భర్త, సంతానం, ఇల్లు, పశువులు ఉంటాయి. ఆ బంధం తీరగానే ఇవన్నీ నశించి పోతాయి. అందుకు బాధపడడం ఎందుకు?"** అంటున్నారు శంకరాచార్యుల వారు.

ఈ పట్టణాల్లో ఉండే వాళ్ళు ఈ పశువులు పెంచడం లాంటివి చెయ్యరు. కానీ పూర్వకాలం ఏ రాజ్యంలో అయినా సరే పల్లెటూరు వాతావరణం ఉండేది. పశువులు కూడా ఒక సంపదే. బాగా పూర్వకాలంలో ఏ రాజు దగ్గర పశు సంపద ఎక్కువ ఉంటుందో వారి దగ్గర అంత సంపద ఉన్నట్లు లెక్కేసేవారు.

మీరు మహాభారతంలో చూడండి విరాటరాజు దగ్గర ఎన్నో పశువులు ఉండేవి. పాండవులు అక్కడ ఉన్నారని కౌరవులకు తెలిసింది. వాళ్ళని బయట పెట్టడానికి కౌరవులంతా వెళ్లి రెండు వర్గాలుగా విడిపోయి ఆ విరాట రాజు యొక్క పశువుల్ని తోలుకుపోతున్నారు. వాటిని కాపాడడానికి పాండవులు బయటికి వస్తారన్న సంగతి వాళ్ళకి తెలుసు. అలాగే అర్జునుడు వచ్చాడు.

కౌరవులను ఎదుర్కునే శక్తి ఒక్క పాండవులకే ఉంది కానీ ఎవరికీ లేదు. విరాటరాజుకి కూడా లేదు. అర్జునుడు అజ్ఞాతవాసం అయిపోయిందని

లెక్క చూసుకున్నాడు. అప్పుడు విల్లు పట్టుకొని ఆ పశువులను కాపాడడానికి వెళ్ళాడు. అంటే పశువులను, గోవులను కూడా సంపద కింద లెక్కవేసేవారు. అందుకే శంకరాచార్యులవారు  అలా పేర్కొనడం జరిగింది.

అంటే బంధం తీరగానే అన్నీ దూరమైపోతాయి. దానికి బాధపడడం ఎందుకు? అంటున్నారు.

అందుచేత ఏవైనా సరే, ఎవరికైనా సరే ఆ ఋణానుబంధం ఉన్నంత వరకే  ఉంటాయని తెలుసుకోవాలి. అంటే దీని అర్థం ఏవీ శాశ్వతం కాదు అని తెలుసుకోవాలి. కానీ అందరూ ఎలా జీవిస్తున్నారంటే పిల్లలు, భర్త, భార్య శాశ్వతం అన్నట్టుగానే జీవిస్తున్నారు. అందుకే దుఃఖం. కాని ఎవరు శాశ్వతం కాదు అని మీకు అర్థమయితే, ఎంతవరకు  ఋణం ఉంటుందో అంతవరకే అందరూ ఉంటారని అర్థం చేసుకుని వారు దూరమైనా దుఃఖపడరు.

శాశ్వతం అనుకున్నవారంతా  ఎన్నో రకాలుగా మీకు దూరం అవుతారు. సహజంగా మీరు చనిపోతేనే దూరం అవుతారు అని అనుకుంటారు. దూరం అవ్వడానికి చనిపోవడం ఒక్కటే అక్కర్లేదు. చాలా సంసారాల్లో చూడండి గొడవలు పడి దూరంగా ఉండేవాళ్ళు వున్నారు. వేరే కాపురాలు పెట్టుకున్న వాళ్ళు ఉన్నారు, ఇంకా కొన్ని సంసారాల్లో ఒక ఇంట్లోనే ఉంటూ గొడవలు పడి నెలలు తరబడి మాట్లాడుకోకుండా  ఉండేవాళ్ళు ఉన్నారు.

ఇంకా కొంతమంది సంపాదించడం కోసం సంవత్సరాలు తరబడి విదేశాలకో, ఇతర ప్రదేశాలకో వెళ్లి ఉండట్లేదా? దూరం అవ్వట్లేదా? అలాగే పిల్లలు కూడా విదేశాలకి వెళ్ళిపోయి సంబంధం లేకుండా జీవిస్తూ ఉండేవాళ్ళు ఎంతో మంది ఉన్నారు.

అందుకే శంకరాచార్యులు వారు గత జన్మ ఋణానుబంధం ఉన్నంతవరకే ఈ సంతానం, భార్య, భర్త, ఇల్లు, పశువులు ఉంటాయి అన్నారు. చూడండి  ఇప్పుడు యుద్ధాల్లో, భూకంపాల్లో, సునామీల్లో దూరమైన వారు,

ఇళ్ళు కోల్పోయిన వారు ఎంతమందిలేరు. దానికి బాధపడడం ఎందుకు? అంటున్నారు శంకరాచార్యుల వారు.

మానవులు జ్ఞానం లేక ఎన్నో విషయాలకి బాధపడుతూ ఉంటారు. జ్ఞానము అంటే కనిపించని వాటి గురించి తెలుసుకోవడమే. మీకు ఎవరికైనా గత జన్మ ఋణానుబంధం కనిపిస్తుందా? ఆ భర్త, భార్య ఎంతవరకు ఉంటారో మీకు తెలుసా? పోనీ ఎంతవరకు ఉంటారో తెలియదు, కానీ ఎప్పుడో ఒకప్పుడు దూరం అవ్వాల్సిందే అన్న విషయమైనా మీరు గ్రహిస్తే దూరమైనప్పుడు దుఃఖపడరు.

నువ్వు చేయవలసిన పని వుంటే నువ్వు వెళ్ళాలనుకున్నా వెళ్ళవు, నువ్వు చేయవలసిన పని అయిపోతే ఉండాలనుకున్నా ఉండవు. పత్రిగారి విషయంలో అదే జరిగింది. ఆయన 2095 దాకా ప్లాన్ చేసుకొచ్చారు. ఆయన చేసిన కృషి వల్ల అనుకున్న పని చాలా తొందరగా పూర్తి అయింది. అందుచేత తొందరగా నిష్క్రమించవలసి వచ్చింది. ఎవరైనా సరే అలాగే ఋణానుబంధం తీరిపోతే దూరమైపోతారు.

అందుకే ఇవన్నీ తాత్కాలికమైనవే. వీటితో ఎప్పుడో ఒకప్పుడు నాకు రుణం తీరిపోతుంది, అవి నాకు దూరం అవుతాయి అనే ఎరుకతో మీరు జీవించాలి. గుర్తుపెట్టుకోండి శాశ్వతమని జీవిస్తే కనుక అంతులేని దుఃఖానికి మీరు లోనవుతారు. అంతేకాదు ఆ దుఃఖంలో మీరు చేయవలసిన పని కూడా చేయకుండా దుఃఖపడుతూ కూర్చుంటారు.

భూమిమీద ఎన్నో సాధించాలని, ఎంతో జ్ఞానం సంపాదించాలని, ఎన్నో అనుభవాలు పొందాలని వచ్చి పొందకపోతే ఇంకా జన్మలు తీసుకుంటారు. బుద్ధి ఉపయోగించినవాడు 400 జన్మలకే సాధించవలసింది సాధిస్తాడు. బుద్ధి ఉపయోగించనివాడు 1000 జన్మలు కూడా తీసుకోవచ్చు. ఇక్కడ పూర్తి అయిపోవాలనేమీ లేదు. అది నీ వివేకాన్ని బట్టి ఉంటుంది.

నువ్వు నిర్ణయించుకో ఏమి కంగారు లేదు. చక్కగా భార్య బిడ్డలతో బాగా గడుపు, రోజూ సినిమాకి వెళ్ళు, ఫైవ్ స్టార్ హోటల్ కి వెళ్లి బాగా తిను, సముద్రంలో ఎన్ని రకాల జీవులు ఉన్నాయో వాటిన్నిటిని శుభ్రంగా తిని ఎంజాయ్ చెయ్యి, భూమిమీద ఎన్ని రకాల పక్షులు ఉన్నాయో అన్నిటిని తిను, ఎన్ని రకాల జంతువులు ఉన్నాయో అన్నీ తిను, సూపర్ మార్కెట్ కి వెళ్తే అన్నీ ఉంటాయి. సంపాదించుకుని చక్కగా తెచ్చుకొని కుటుంబం అంతా తినండి. ఏదో ఒక జన్మ, రెండు జన్మలు ఇక్కడ తిన్నందుకు నరకం అనుభవిస్తారు. అది అయిపోయిన తర్వాత మళ్ళీ తింటూ ఉండండి. ఇంకో జన్మలో జీవితాన్ని ఎంజాయ్ చేయండి. అలా అనుకునే వాళ్ళు ఎంతో మంది ఉంటారు.

ఏది ఏమైనా జీవితం అన్నది దుఃఖభరితం, దీంట్లోనుంచి తొందరగా బయట పడాలి, ఇలాంటివి ఇంతకుముందు ఎన్నో అనుభవించాను, ఇంకేం అనుభవిస్తాను! అని బుద్ధి ఉన్నవాడు తెలుసుకుంటాడు. నాకు కావాల్సింది ఎంజాయ్మెంట్ కాదు, ఎన్లైటన్మెంట్ అని గ్రహిస్తాడు. ఎంజాయ్మెంట్ కోసం చూసేవాడు అజ్ఞాని, బుద్ధి లేనివాడు. ఎన్లైటన్మెంట్ కోసం ప్రయత్నించేవాడు బుద్ధి ఉన్నవాడు, జ్ఞాని.

పత్రిగారు చెప్తే ఆక్షేపణగా ఉంటుంది మనకి. ఒక రొట్టె ముక్కా, ఆవకాయ తొక్క సరిపోదా? అంటారు. దాని అర్థం ఎందుకురా నాయనా వీటి మీద మమకారం! ఉంటే ఎంజాయ్ చెయ్యి, దానికోసం ఎందుకు తపన పడతావు? తాపత్రయ పడతావు? లేదని ఎందుకు బాధపడతావు? వాడెవడో తింటే నీకెందుకు? ఎన్లైటన్మెంట్ కోసం కృషి చేయి. ఇదే ఆఖరి జన్మ చేసుకో అన్నారు.

ప్రతి ఒక్కరు ఇది తెలుసుకోవాలి.

::3::

ఆది శంకరాచార్యుల వారు ఎంత గొప్ప స్థితికి ఎదిగారో, ఎంత మందిని ప్రభావితం చేయగలిగారో మన అందరికీ తెలుసు. భారతదేశంలో హిందూ మతం పోయి బౌద్ధం ప్రభలంగా ఉన్న రోజులలో భారతదేశంలో ఆయన జన్మించి హిందూ మతం యొక్క ప్రాముఖ్యతను, అద్వైత సిద్ధాంతాన్ని ఎంతో విపులంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా మూడుసార్లు కాలినడకన ప్రయాణించి ఇంచుమించు అందరినీ తన శిష్యులుగా చేసుకున్నారు. తన ఆశయాలు సుస్థిరంగా భారతదేశంలో ఉండాలనే ఉద్దేశంతో నాలుగు చోట్ల పీఠాలు కూడా స్థాపించారు.

శంకరాచార్యుల వారు భూమి మీదకి రావడం, భారతదేశంలో బౌద్ధం లేకుండా చేసి హిందూ మతాన్ని స్థాపించడం అన్నది ప్రకృతి యొక్క నిర్ణయం క్రిందే మనం చెప్పుకోవచ్చు. ఎందుచేతనంటే ఈ సృష్టిలో ఏది జరిగిన ప్రకృతి నిర్ణయం ప్రకారమే జరుగుతూ ఉంటుంది. లోకంలో హిందూ మతం అంతరించిపోయింది. అందుచేత హిందూ మత ప్రాశస్త్యాన్ని, అద్వైత సిద్ధాంతం యొక్క గొప్పతనాన్ని మళ్ళీ ప్రవేశపెట్టడానికి ప్రకృతే శంకరాచార్యుల వారిని భూమి మీదకి పంపించింది అని అర్థం చేసుకోవాలి.

అంత గొప్పవాడు అయినటువంటి శంకరాచార్యుల వారి యొక్క సందేశాలు ఎంత గొప్పగా ఉంటాయో మనం తెలుసుకోవచ్చు. మనకి పత్రి గారు ఏమని చెప్పారంటే? ఒక మానవ జన్మలోకి ప్రవేశించిన తర్వాత జన్మలేని స్థితికి చేరుకోవాలి అంటే సుమారు నాలుగు, ఐదు వందల జన్మలు పడుతుంది. అంటే ఒక మానవుడు పూర్ణత్వం పొందాలన్నా, పూర్ణజ్ఞానాన్ని పొందాలన్నా, అన్ని రకాల అనుభవాలు సంపాదించుకోవాలన్నా అన్ని జన్మలు అవసరం.

అంతేకాదు ఇన్ని ప్రాంతాలు ఉండాలి, ఇన్ని మతాలు ఉండాలి, ఇన్ని కులాలు ఉండాలి, ఇన్ని రకాలైనటువంటి జీవితాలు ఉండాలి. అంతేకాదు

ముఖ్యంగా పరిపూర్ణ జ్ఞానం పొందాలి అంటే స్త్రీజన్మ అవసరమే, పురుషజన్మ అవసరమే. మరి స్త్రీ జన్మ తీసుకుని ఎన్నో నేర్చుకుంటారు, పురుష జన్మ తీసుకుని ఎన్నో నేర్చుకుంటారు. అందుచేత స్త్రీ ఎప్పుడూ స్త్రీ కాదు, పురుషుడు ఎప్పుడూ పురుషుడు కాదు అని తెలుసుకోవాలి .

అందుకే శంకరాచార్యుల వారు భూమి మీదకి వచ్చి అంతరించి పోయిన హిందూ మతాన్ని మళ్ళీ స్థాపించడం జరిగింది. హిందూ మతంలో ఉన్నటువంటి ఈ ఆధ్యాత్మిక గ్రంథాలు, ఉపనిషత్తులు, వేదాలు, భగవద్గీత, పురాణాలు ఏ మతంలోనూ లేవు. వీటిని అర్థం చేసుకున్నా, అవగాహన చేసుకున్నా, సమస్తమూ తెలుసుకున్న వారు అవుతారు. ఇది అవగాహన లేనివారు ఈ మతం అంతరించిపోతుంది, ఆ మతం పెరిగి పోతుంది, లేకపోతే ఇంకో మతం పెరుగుతుంది అంటారు.

కానీ భూమి మీద ఏ మతము అంతరించదు, అన్ని రకాల మతాలు ఉంటాయి, అందరూ ఉంటారు. ప్రతి ఒక్కరూ అన్ని మతాలలోనూ జన్మిస్తారు, ఏ మతం ద్వారా ఏమి నేర్చుకోవాలో అది నేర్చుకుంటారు.

పత్రి గారినే తీసుకోండి ఆయన ఏమన్నారంటే నేను 2500 సంవత్సరాల క్రితం బుద్ధుడు యొక్క శిష్యుడు ఆనందుడిగా ఉండేవాడిని, అప్పుడు నాది బౌద్ధమతము. తర్వాత అమెరికాలో బెంజిమెన్ ఫ్రాంక్లిన్ క్రిస్టియన్‌గా జన్మించాను, ఆ తరువాత ఒరిస్సాలో జన్మించి జన్మజన్మంతా ధ్యానమే చేశాను. ఆ తర్వాత హైదరాబాదులో హజ్రత్ ఇనాయత్ ఖాన్ ముస్లిం సూఫీ మాస్టర్‌గా జన్మించాను, ఇప్పుడు సుభాష్‌గా బ్రాహ్మణ కులంలో హిందువుగా జన్మించాను. ఇప్పుడు నా కులం ఏది? నా మతం ఏది? చెప్పండి అన్నారు. అందుచేత ప్రతీ ఒక్కరికి అన్ని రకాల జన్మలు ఉంటాయి. అందుచేత ఎవరూ తక్కువ కాదు, ఎవరూ ఎక్కువ కాదు. అందరూ సమానమే.

ఇవాళ మీరు హిందువు అయినంత మాత్రాన మీరు శాశ్వతంగా

హిందువు కాదు. ఇవాళ మీరు పురుషుడైనంత మాత్రాన శాశ్వతంగా పురుషుడు కాదు. ఇవాళ ధనవంతులు అయినంత మాత్రాన శాశ్వతంగా ధనవంతులు కాదు. సేవకుడు అయినంత మాత్రాన శాశ్వతంగా సేవకుడు కాదు. రాజుగా అధికారము, భోగము వెలగబోసిన వాడు కూడా మరల పేదవాడిగా, కూలీగా అనుభవాలు సంపాదించవలసిందే.

అందుచేత పత్రి గారు మనకి స్పష్టంగా చెప్పారు. అందరూ ఒకటే అంతా నేనే, నేనే అంతా అని తెలుసుకునేదాకా జన్మలు తీసుకుంటూనే ఉండాలన్నారు. ఇప్పుడు మనమంతా ఆ ప్రయత్నమే చేస్తున్నాం, ఇవన్నీ తెలుసుకోవడానికి ఎంతో ఆసక్తిని చూపిస్తున్నాం. తెల్లవారుజామున మూడు గంటలకే లేచి స్నానాలు చేసి ధ్యానం చేస్తున్నాం, ఈ సందేశాలన్నీ ఆసక్తిగా వింటున్నాం అంటే కారణం అదే.

ఇవన్నీ మీరు తెలుసుకుంటున్నప్పుడు అర్థం చేసుకోవాలి. ఇది ప్రకృతి నాకు కల్పించిన అవకాశం అని శ్రద్ధగా ఈ జ్ఞానం అంతా వింటూ, సేకరించు కుంటూ, అది అనుభవంలోకి తెచ్చుకోవాలి. అప్పుడు మీకు సృష్టిలో కొత్త అనుభవాలు, కొత్త జ్ఞానం సంపాదించుకునే అనుకూలమైన జన్మ లభిస్తుంది. ఒకవేళ మీరు నిర్లక్ష్యం చేసినా, అశ్రద్ధ చేసినా, వినీ విననట్టు ఊరుకున్నా దానిని సంపాదించుకోవడానికి మళ్ళీ మళ్ళీ జన్మలు తీసుకోవాలి. అదే ఇప్పుడు మీరు సంపాదించుకుంటే మీకు ఇంక ఈ రకమైన జన్మలు అవసరం లేదు.

చాలామందికి ఇది తెలియక ఏవేవో పనులు చేస్తూ, దాంతో తృప్తి పడిపోతారు. మీరు చేసే ఈ పనుల వల్ల మీ జ్ఞానం ఎంత వరకు పెరుగుతుంది అన్నది కూడా ఆలోచించాలి. ప్రకృతి సృష్టి యొక్క జ్ఞానాన్ని అందించడానికి ఒక్కరినో, ఇద్దరినో పంపించదు, శంకరాచార్యులు లాంటి వారిని అలా పంపిస్తూనే ఉంటుంది.

ఒకరు నిష్క్రమించినా మరి కొంతమంది భూమి మీద ఉద్భవిస్తూనే

ఉంటారు. ఈ జ్ఞానం వాళ్ళ ద్వారా అందుతూనే ఉంటుంది. కొంచెం తెలివైన వాళ్ళు ఈ జ్ఞానం ఎవరి వల్ల మనకు అందుతుంది అన్నది గ్రహించి, వాళ్లను అనుసరించి, వాళ్ల ద్వారా ఎంత జ్ఞానం సంపాదించుకోగలరో అంతా సంపాదించుకుంటారు.

లేకపోయినా నష్టమేమీ లేదు జన్మలు పెరుగుతాయి అంతే. కాని అది తెలివి తక్కువతనం. ప్రకృతి వాడికి అన్ని అవకాశాలు కల్పించింది కానీ వాడు ఉపయోగించుకోలేదు. కాని జన్మలు తగ్గించుకునే వాడు తెలివైనవాడు. ఈ వంక పెట్టి, ఆ వంక పెట్టి, కుటుంబం అంటూ, నేను ఆ పని చేస్తున్నాను, ఈ పని చేస్తున్నాను అంటూ ఉపయోగించుకోడు. వాడికంటే మూర్ఖుడు ఇంకెవరూ ఉండరు. దాన్ని ఉపయోగించుకున్న వాడికంటే విజ్ఞుడు ఇంకెవరూ ఉండరు.

అందుకే భీమవరం మూడు రోజుల క్లాసులు ఎప్పుడైనా ఒక్కసారి పాల్గొనండి. తర్వాత ఆంధ్ర, కర్ణాటక ఇండియా మొత్తం అన్ని రాష్ట్రాలు తిరగండి. ఎక్కడైనా మీకు అలాంటి జ్ఞానం పొందే అవకాశం, అలాంటి సాధన చేసుకునే అవకాశం దొరికితే దాన్ని అనుసరించవచ్చు. మీకు జ్ఞానం ఎక్కడ ఉంటుందో అక్కడ సంపాదించు కోండి. అందరికీ స్వేచ్ఛ ఉంది, అది ప్రకృతి మీకు కల్పించినటువంటి అద్భుతమైన అవకాశం.

ఈ సందేశాలు అన్నీ కూడా నా దగ్గరికి ఎలా వచ్చాయో నాకు అర్థం కాదు. మరి ఒక్కొక్క సందేశం తీసుకుని అమ్మ కానీ, నేను కానీ అనంతంగా ఎలా వివరిస్తున్నాము! మేము అంతకుముందు చదువుకున్నామా? చేసామా? ఎక్కడి నుంచి వస్తున్నాయి ఇవన్నీ? ఇప్పుడు ఈ జ్ఞానం లోకంలో అందరికీ అవసరం. అందుచేత ఈ రకంగా మా ద్వారా మీ అందరికీ అందుతుంది. పత్రి గారు ఇచ్చినటువంటి ఈ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం తీవ్రంగా చేయడానికి భీమవరం క్లాసులు ఎంతగానో ఉపయోగపడతాయి. అందుచేత ఈ అవకాశాన్ని ఉపయోగించుకోండి.

::4::

**"ఆత్మజ్ఞాని అయిన ముని మానవ శరీరంతో కూడి ఉన్నప్పటికీ, ఆకాశం లాగా శరీరానికి సహజమైన గుణాలు ఏవీ అంటకుండా జీవిస్తాడు. అతనికి లోక విషయాలన్నీ పరిపూర్ణంగా తెలిసినప్పటికీ, ఏమీ తెలియని వానిలా నిస్సంగుడై సంచరిస్తాడు".**

సాధకుడు అయినా, ముని అయినా, యోగాన్ని అభ్యసించే వాళ్ళు అయినా, ఈ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేసేవాళ్ళు అయినా, ఎవరైనా సరే వారు చేసే సాధన వల్ల నెమ్మది నెమ్మదిగా ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవాలి. ఈ ఆత్మజ్ఞానం పొందిన వాళ్ళు మనకి బాగా ప్రాక్టికల్‌గా కావాలంటే మొన్నటి దాకా ఉన్నటువంటి పత్రి గారిని మనం ఉదాహరణగా తీసుకోవచ్చు.

వారికి శరీరం ఉంటుంది, శరీరం ఉన్నా సరే శారీరక సంబంధమైన గుణాలు ఏవీ అంటకుండా జీవిస్తారు. ఎలాగంటే? ఆకాశానికి మీరు ఏదైనా అంటించాలని చూస్తే అంటే రంగులు గాని, ఏదైనా సరే అంటవు. మబ్బులు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి, ఆకాశానికి మాత్రం అంటుకోవు. ఆకాశానికి అంటితే ఆ మబ్బు అక్కడే ఉండిపోతుంది. అంటదు కాబట్టే కాస్త గాలేస్తే అది వెళ్ళిపోతూ ఉంటుంది, తొలిగిపోతుంది.

అలాగే ఆత్మజ్ఞానం పొందినవారికి అందరిలాగే శరీరం ఉంటుంది కానీ వేటినీ అంటించుకోరు. ఒక రకంగా చెప్పాలంటే సాక్షీభూతంగా ఉండిపోతారు. తెలిసినా తెలియనట్టు ఉంటారు, విన్నా విననట్టు ఉంటారు, తనకు సంబంధం లేనట్టు ఉంటారు. అన్నిటిలో దూరరు, అన్నిటిలో వేలు పెట్టరు, విన్నా విననట్టు ఉంటారు, తెలుసుకున్నా తెలియనట్టుగా ఉంటారు.

మీరు చూడండి మనం రైల్లో ప్రయాణం చేసేటప్పుడు చుట్టూ కొంతమంది ఉంటారు. వాళ్ళూ వాళ్ళూ మాట్లాడుకుంటూ ఉంటారు. వాళ్ళు మాట్లాడుతూ ఉంటే కొన్ని విషయాలు మీకు ఆసక్తి కలిగిస్తూ ఉంటాయి,

వాళ్ళు మాట్లాడే దాంట్లో కొన్ని తేడాలు కూడా ఉంటే ఉండొచ్చు. అరే ఈ విషయం వాళ్ళకి తెలియదనుకుంటా, అనవసరంగా తప్పు అభిప్రాయంలో ఉన్నారు అని, వాళ్ళ తప్పులు సరిచేస్తే బాగుంటుంది అని వాళ్ళ సంభాషణలో కలుగచేసుకుంటారు.

ఇక్కడ శంకరాచార్యుల వారు ఏమంటున్నారంటే? అది మనకు అనవసరం. వాళ్ళు మనల్ని అడిగితే మనం చెప్పొచ్చు కాని వాళ్ళేమి అడగలేదు, వాళ్ళ దాంట్లో మనం ఎందుకు దూరాలి? వాళ్ళ సంభాషణలో మనం ఎందుకు కలుగచేసుకోవాలి? మీరు అడగొచ్చు మరి మేము ధ్యానం గురించి వాళ్ళకి చెప్పాలా? వద్దా? అని. మీకు తెలిసున్నటువంటి ఈ ధ్యానాన్ని వాళ్ళకి తెలియదు కాబట్టి చెప్పండి కానీ వారు ఆసక్తి చూపించకపోతే ఊరుకోండి.

మీకు ఏదో ఫంక్షన్ ఉంటుంది. ఫంక్షన్ కి వెళ్ళాలని వెళ్ళం కానీ ఒకసారి కనిపించాలని చెప్పి వెళ్తాం. వెళ్ళినప్పుడు మీ ప్రక్కవాళ్ళు గాని, ఎదరవాళ్ళు గాని ఏదో మాట్లాడుకుంటారు, మీరు మాత్రం ఊరికే వింటూ ఉండడమే, అది మీకు సంబంధం లేదు. మీ స్నేహితుల ఇంటికి వెళ్ళినా, మీ పుట్టింటికి వెళ్ళినా ఎన్నాళ్ళైందో కనబడి అని అందరితోటి మాట్లాడాలి అనిపిస్తుంది. కానీ ఆత్మజ్ఞాని అన్నిటిలోనూ తల దూర్చడు. ఎదుటి వాళ్ళు ఏదైనా అడిగితే అంతమట్టుకు ముక్తసరిగా సమాధానం చెప్తాడు.

అలాగే దగ్గర బంధువులు కానీ, స్నేహితులు కానీ, మీరు ధ్యానం లోకి రాకముందు పరిచయమైన వాళ్ళు కానీ మీకు కనిపించినప్పుడు వాళ్ళు మిమ్మల్ని పలకరించి ఏదో మాట్లాడుతూ ఉంటారు, ఏదో అడుగుతూ ఉంటారు. ఆ రకమైన మాటలు మీరు మాట్లాడుతూ ఉంటే వాళ్ళు మీతో ఎంతసేపైనా మాట్లాడతారు. వాళ్ళ పిల్లల గురించి, మీ పిల్లల గురించి, వాళ్ళ చదువుల గురించి, మీ ఇంట్లో జరిగేవి, ఆ ఇంట్లో జరిగేవి ఇవన్నీ బాగానే మాట్లాడుతూ ఉంటారు. కానీ మీరు సడన్గా ఈ ధ్యానం టాపిక్ ఎత్తండి! అంటే నువ్వు

ధ్యానం చేస్తున్నావా? ధ్యానం అంటే ఏమిటో తెలుసా? ధ్యానం గురించి చెప్పమంటావా? అంటే వాళ్ళు వెంటనే కామ్ అయిపోతారు, వాళ్ళ ముఖాలు పూర్తిగా మారిపోతాయి. వాళ్ళకి అనుగుణమైన సంభాషణ చేస్తేనే వాళ్ళు మాట్లాడతారు లేకపోతే మాట్లాడరు. మీరు ఇంకా అదే మాట్లాడుతుంటే అమ్మా వెళ్ళివస్తాను అంటారు.

అందుచేత మీకు ఈసారి వాళ్ళ మాటలు బోర్ అనిపిస్తే ఈ టాపిక్ ఎత్తండి. వాళ్ళకి మార్నింగ్ చెప్పినటువంటి క్లాస్ చెప్పండి. ఈసారి ఎంతసేపు ఉంటారో చూడండి మీరు. నేను మన ధ్యానుల ఇళ్ళకి వెళ్తూ ఉంటాను. ఆడవాళ్ళు మన ధ్యానులు అయినప్పుడు వాళ్ళు వాళ్ళ భర్తను పరిచయం చేస్తారు. ఇంక వాళ్ళ ముఖాలు మారిపోతాయి. ఏదో ఇంక కాదనలేక వస్తారు, కూర్చుంటారు.

అసలు ఆవిడ చేసే ధ్యానమే ఆయనకి ఇష్టం ఉండదు. చాలామంది నేనే ఆవిడని చెడగొడుతున్నాను అనుకుంటారు. నా వల్లే తన పెళ్ళాం ఇలా తయారైందని తిట్టుకుంటారు. పెళ్ళాం అంటే ఇష్టమే కానీ ఆ పని చేస్తున్నందుకు ఇష్టం ఉండదు. అందుచేత అయిష్టంగానే పలకరిస్తారు, నాకు వాళ్ళ ముఖ కవళికలు తెలుసు.

అలాంటి వాళ్ళతో ఏం చేస్తానంటే ఆయన వ్యాపారం చేస్తూ ఉంటే వ్యాపారం గురించి, ఉద్యోగం చేస్తూ ఉంటే ఉద్యోగం గురించి టాపిక్ ఎత్తుకుంటాను, అప్పుడు కాసేపు కూర్చొని నాతో మాట్లాడతారు. నేను ధ్యానం గురించి మాట్లాడితే వారు నెమ్మదిగా అక్కడి నుంచి వెళ్ళిపోతారు.

అలాగే కొంతమంది భర్తలు చేస్తారు, భార్యలు చేయరు. వాళ్ళకి నా మీద ఎంతో కోపం ఉంటుంది. ఈయన రోజూ పొద్దునే చెడగొడుతున్నాడు అని పైకి అనరు కానీ తిట్టుకుంటారు. ఏదేమైనా ఆత్మజ్ఞాని ఈ మానవ శరీరం ఉన్నప్పటికీ ఆకాశం ఎలా ఏదీ అంటించుకోదో, అలాగే శరీరానికి

సహజమైన గుణాలు ఏవీ అంటకుండా జీవిస్తాడు. మీరు ఒక్కసారి ఆ రకంగా జీవిస్తున్నారా? లేదా? అని మిమ్మల్ని మీరు పరీక్షించుకోండి. అలాంటి సందర్భాలు ఎదురైనా కూడా అలా జీవించగలగాలి. అప్పుడే మీరు ఎంతో ఎదిగినట్టు లెక్క.

ఎవరు ఏమనుకున్నా మీకు అనవసరం. ఆత్మజ్ఞాని ఎంతసేపు తాను చేసేది సరైందా? కాదా? అన్నదే చూసుకుంటాడు కానీ, ఇతరుల గురించి కానీ, ఇతరులు ఏమనుకుంటారో అని కానీ, ఏదీ చేయడు, ఆ స్థితికి మీరు వెళ్ళగలగాలి. అప్పుడు మీరు జ్ఞానవంతులు అవుతున్నట్టు లెక్క.

ఇంకా శంకరాచార్యుల వారు ఏమంటున్నారంటే? ఆత్మజ్ఞానికి శరీరానికి సంబంధించిన తమోగుణం, రజోగుణం, సాత్విక గుణాలు ఏవి ఉండవు, అంటే ఈ గుణాలకి అతీతుడు అయిపోతూ ఉంటాడు. సాధన చేసే కొద్దీ, మనసు శుద్ధి అయ్యే కొద్దీ, ఈ గుణాలకి అతీతుడు అయిపోతాడు, అవ్వాలి కూడా. లేకపోతే భీమవరం సంవత్సరాలు సంవత్సరాలు వచ్చి ఏమిటి ఉపయోగం? మార్నింగ్ రెండున్నర గంటలు కూర్చుని ఏమిటి ఉపయోగం? ఇంకా చుట్టుప్రక్కల జరిగే విషయాలన్నీ లోపల పెట్టుకొని వాటినే ప్రస్తావిస్తూ ఉంటే ఏమిటి ఉపయోగం?

అందుచేత ఆత్మజ్ఞాని లోక విషయాలన్నీ పరిపూర్ణంగా తెలిసినప్పటికీ ఏమీ తెలియని వాని లాగే నిస్సంగుడై అంటే అంటించుకోని వాడై సంచరిస్తూ ఉంటాడు, ఆ స్థితికి మీరు ఎదగాలి.

రోజూ మీరు ఎన్నో పనులు చేస్తూ ఉంటారు. బాగోదేమో! వాళ్ళు ఏమనుకుంటారో! వీళ్ళు ఏమనుకుంటారో! అనుకుంటారు, అదే చాలా తప్పు. నువ్వు ఎంత చేయగలవో అంత మటుకే చెయ్యి, ఎంత ఖర్చు పెట్టగలవో అంత మట్టుకే ఖర్చు పెట్టు, ఇతరుల గురించి ఆలోచించకు. మీరు ధ్యానంలోకి వచ్చినా సంసారాన్ని వదిలిపెట్టలేదు, పిల్లల్నేమి వదిలిపెట్టలేదు, బాధ్యతలేమి

వదిలిపెట్టలేదు, అన్నీ చూసుకుంటూనే ఉంటారు, కానీ మీ పరిస్థితిని బట్టి మీరు అనుకున్నట్టు మీరు చేసుకుంటూ ఉండండి. ఎవరు ఏమనుకున్నా మీకు అనవసరం, వాటిని మీరు పట్టించుకోకండి.

వాళ్ళ విమర్శలు, వాళ్ళ ప్రశంసలు, వాళ్ళ గొప్పలు, వింటున్నా విననట్టు ఉండాలి, అనకుండా ఉండరు, అది లోక సహజం. మీరు ఏం చేస్తున్నా అంటారు, మంచి చేస్తే మంచి చేశాడు అంటారు, చెడ్డ చేస్తే చెడ్డ చేశాడు అంటారు, ఏమి చేయకపోతే ఏమీ చేయట్లేదు అంటారు, అది లోక సహజం. అందుచేత మీ పని మీరు చేసుకోవడం ఉత్తమం.

మెల్లిగా మీరు ఈ రకంగా జీవిస్తూ ఉంటే సాక్షీభూత స్థితికి వెళ్ళిపోతారు, అదే పరిపూర్ణ స్థితి. అది దైవం యొక్క లక్షణం, దైవం సాక్షీభూతుడు, ఆయనకి అన్నీ తెలుసు కాని తెలియని వాడిలా ఉంటాడు. అన్నిటి మీద అవగాహన ఉంటుంది, కాని ఏమీ లేనట్టుగా ఉంటాడు, మీరు ఆ స్థితికి ఎదగాలి. అపార జ్ఞాన సంపన్నుడైనటువంటి దైవం యొక్క లక్షణం సాక్షీభూత తత్వం.

అందుచేత మీ ప్రవర్తన ఎలా ఉంది అన్నదాన్ని మీరు బేరీజు వేసుకుంటూ ఉండాలి. ఏమైనా ఇంకా తేడా అనిపించినప్పుడు దాన్ని సరిచేసుకోవాలి, ఇంకా నా సాధన సరిపోలేదు అని తెలుసుకొని సాధన ఇంకా పెంచుకోవాలి. ఇక్కడ ఎంత సాధన చేసినా ఈ మాయా ప్రభావం వల్ల మళ్లీ మామూలు స్థితికి వచ్చేస్తూ ఉంటారు, అందుచేత నిరంతర సాధన తప్పదు. లేకపోతే 4,5 వందల జన్మలు అవసరం ఏముంది చెప్పండి?

ఇప్పుడు మీరు సంసారంలో నిర్వాణం పొందే ప్రయత్నం చేస్తున్నారు. అందుచేత ఉన్నంతలో ఎంత వీలైతే అంత మీ సాధన చేస్తూ, సంసారంలో జీవిస్తూ, సాటి వారితో ఆ రకంగా మెలగగలిగితే ఖచ్చితంగా మీకు మరు జన్మ అన్నది అనుకూలమైన జన్మ వస్తుంది. మీకు ఈ మమకారాలు ఉండవు,

సంసారంలో ఉన్నా దేన్నీ పట్టించుకోరు, మీ పనులు మీరు సహజంగా చేసుకుంటారు. అలాంటి అనుకూలమైన జన్మ మీకు లభిస్తుంది. అంతేకాదు ఈ జన్మలో కూడా మీ పట్టుదలను బట్టి మెల్లి మెల్లిగా ప్రకృతి సహకారం మీకు లభిస్తుంది, మీ వ్యతిరేక పరిస్థితులు అనుకూలమైన పరిస్థితులుగా మారుతూ ఉంటాయి.

మీరు చూడండి వివేకానందుడు వివాహం చేసుకోలేదు, శంకరాచార్యుల వారు చేసుకోలేదు, రమణ మహర్షి కూడా అంతే.

వారంతా ఆ స్థాయికి ఎదిగినవారు, చివరి జన్మల్లోకి వచ్చిన వారు. అలాంటి వారు చాలా తక్కువ ఉంటారు. ఎందుచేతనంటే ఆ పూర్ణాత్మలు కొత్తగా ఆత్మల్ని అలా సృష్టిస్తూనే ఉంటాయి. వారంతా మళ్ళీ ప్రారంభ జన్మల నుంచి మొదలెడుతూ ఉంటారు. అలాంటి వాళ్ళు ఎంతో మంది ఉంటారు. అందుచేత సృష్టిలో అన్ని రకాల వాళ్ళూ ఉండడం సహజం.

పత్రిగారు ఒక సందర్భంగా ఏమన్నారంటే? ఆయనలాంటి వాళ్ళు, బుద్ధుడు లాంటి వాళ్ళు, రమణ మహర్షి లాంటి వాళ్ళు, సత్య సాయిబాబా లాంటి వాళ్ళంతా చేసే కృషి వల్ల శాకాహారుల శాతం మారుతుంది కానీ పూర్తి మార్పు ఎప్పుడూ రాదన్నారు. అందుచేత ఇది నిరంతరం కొనసాగుతూ ఉంటుంది. పత్రిగారి లాంటి వాళ్ళు నిష్క్రమిస్తూ ఉంటారు, మళ్ళీ కొత్తవాళ్ళు కొంతమంది బయలుదేరుతారు, ఇదే ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఇది యుగ యుగాలుగా జరుగుతూనే ఉంది, జరుగుతూనే ఉంటుంది.

అందుచేత గుర్తుపెట్టుకోండి ఆకాశానికి ఏవీ కూడా ఎలా అంటవో! ఆత్మజ్ఞాని మానవ శరీరంతో ఉన్నా ఈ గుణాలు ఏవీ అంటకుండా జీవిస్తాడు. అలాగే లోకంలో జరిగే విషయాలు తెలిసున్నా తెలియనట్టుగా నిస్సంగుడిగా సంచరిస్తాడు అని శంకరాచార్యులవారు చెప్పడం జరిగింది.

::5::

**"బాహ్యమందు శాశ్వతం కానటువంటివి ఏవి భ్రాంతిని కొల్పుతూ ఉంటాయో, వాటి యందు సుఖాన్ని కాంక్షించే గుణాన్ని విడిచిపెట్టి, ఆత్మ సుఖమునందే నిలిచినవాడై తృప్తి పొందుతూ ఉండాలి. అలాంటివాడు కుండ యందలి దీపం వలె తనలోనే ప్రకాశిస్తూ ఉంటాడు".**

మనం గమనించినట్లయితే బాహ్యంలో కనిపించేవి ఏవైనా సరే శాశ్వతం కావు. కానీ లోకంలో ఉన్నటువంటి మానవులకు వాటి మీదే భ్రాంతి ఉంటుంది. అవి పొందాలని, అవి అనుభవించాలని ఆ ప్రయత్నమే చేస్తూ ఉంటారు. ఎందుచేతనంటే అవన్నీ సుఖాన్ని ఇస్తాయి, అందుకే ఆ సుఖం అనుభవించాలనే తపన పడుతూ ఉంటారు.

మానవుడికి ఐదు ఇంద్రియాలు ఇవ్వబడ్డాయి. సహజంగా మానవుడు మనసు ఆధీనంలో ఉండడం వల్ల ఆ ఇంద్రియాల ద్వారా ఆ సుఖాన్ని పొందడానికి తాపత్రయ పడుతూ ఉంటాడు. గురువులు ఎన్ని చెప్పినా సుఖభ్రాంతి పోదు, సుఖపడడానికి డబ్బు సంపాదిస్తారు, ఆ సుఖాలు సమకూర్చుకుంటూ ఉంటారు, శక్తి మేరకు ఎన్ని రకాలుగా అనుభవించాలో అన్ని రకాలుగా అనుభవిస్తూ ఉంటారు.

శంకరాచార్యులవారు ఏం చెప్పారంటే? ఆ సుఖాన్ని పొందాలనే గుణాన్ని వదిలి పెట్టమంటున్నారు. ఇంద్రియ సుఖాల మీద ఉన్న భ్రాంతి వదిలి పెడితే ఆత్మ సుఖం పొందగలుగుతారు. కాని అది అంత తేలిక కాదు, ఎందుకంటే మనసుకున్న అలవాటు మాన్పించడం చాలా కష్టం. మనసు చావడానికైనా సిద్ధపడుతుంది కానీ తన భ్రాంతి మటుకు వదలదు, వద్దు అనుకుంటే అది వినదు, ఏదైనా మీ మాట వింటుంది కానీ, మనసు వినదు. మనసు యొక్క ఆ కాంక్ష పోవాలి అంటే మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గించాలి, అంతకన్నా వేరే దారి లేదు.

శంకరాచార్యుల వారు చెప్పినట్టు ఆచరించగలగాలి అంటే ఖచ్చితంగా మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గించాలి. దానికి రెండు పనులు చేయాలి, ఒకటి ఆహార నియమాలు పాటించాలి అంటే సాత్వికమైన శాకాహారం తీసుకోవాలి, రెండు "శ్వాస మీద ధ్యాస" ధ్యానాన్ని తీవ్రంగా చేయాలి. ఇది తప్ప ఇంక దేని వల్లా మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గదు, మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గకపోతే ఈ శాశ్వతం కానటువంటి వాటి మీద అంటే ప్రపంచంలో ఉన్న వాటి మీద భ్రాంతి పోదు.

వాటికి బానిస అయిపోతారు, వాటి కోసం చేయకూడని పనులు చేస్తారు, తప్పులు, పాపాలు చేస్తారు, అధర్మంగా వ్యవహరిస్తారు, చివరికి కష్టాలు తెచ్చుకుంటారు. వీళ్ళకి ఆత్మ సుఖం యొక్క గొప్పతనం తెలియదు. ఆత్మ సుఖం యొక్క గొప్పతనం ఎప్పుడు తెలుస్తుంది అంటే మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గిపోయినప్పుడే తెలుస్తుంది. ఆ ఆత్మ సుఖం యొక్క రుచి తెలిసినవారు ఈ ప్రాపంచిక వస్తువులపై ఉన్నటువంటి వ్యామోహం పూర్తిగా వదిలేస్తారు.

రమణ మహర్షిని, షిరిడి బాబాని మనం తీసుకుంటే వాళ్ళు అనుభవించాలంటే అనుభవించొచ్చు. ఎంతో మంది శిష్యగణం ఉన్నారు. ఏది కావాలంటే అది సమకూర్చుకోగల అవకాశం ఉంది. అయినా సరే ఆత్మ సుఖం యొక్క గొప్పతనం వాళ్ళు తెలుసుకున్నారు కాబట్టి ఈ శాశ్వతం కానటువంటి వాటి వల్ల వచ్చే సుఖం చాలా అల్పము అన్న సంగతి వాళ్ళకి తెలుసు. నిజంగా జనం వాళ్ళని పిచ్చోళ్ళు అనుకుంటారు, అయినా సరే వారు దాన్నేమీ పట్టించుకోరు. అసలైన సుఖాన్ని అనుభవించిన తర్వాత అల్పమైన, అశాశ్వతమైన సుఖం అనవసరం.

అందుకే ఎవరైనా సరే ఎన్ని పొందినా, ఎంత పొందినా, ఇంకా ఇంకా అంటూనే ఉంటారు. అన్ని రకాల మధురమైన పదార్థాలు భుజిస్తారు,

తృప్తి తీరా భుజిస్తారు, మళ్ళీ సాయంకాలం అయ్యేసరికి మళ్ళీ కావాలంటారు, మళ్ళీ భుజిస్తారు, మర్నాడు మళ్ళీ కావాలంటారు. వారు కోరుకున్నవి పొందు తారు, మంచి ఇల్లు కట్టాలనుకుంటారు, కడతారు, డెకరేషన్ చేయించాల నుకుంటారు, చేయిస్తారు, ఏసీలు పెట్టాలనుకుంటారు, పెడతారు. అక్కడికీ తృప్తి ఉండదు.

అంతకన్నా ఇంకా గొప్పది ఏదైనా ఉంటే మళ్ళీ అలాంటిది కావాలనుకుంటారు. కారు కొనాలనుకుంటారు కొంటారు, పోనీ దానితో తృప్తి పడతారా అంటే అంతకన్నా మంచి మోడలేదో కనపడుతుంది మళ్ళీ అది కావాలనుకుంటారు. ఇలాగ ఈ శాశ్వతం కానటువంటి వాటి వల్ల పొందే ఆ సుఖం ఎంత పొందినా ఇంకా ఇంకా అనేటువంటి భ్రాంతిలో ఉంటారు. అది వదిలిపెట్టు నాయనా, ఆత్మ సుఖం మీదే నీ దృష్టి పెట్టు, అది పొందడానికి ప్రయత్నించమంటారు శంకరాచార్యుల వారు.

నిజంగా మనమంతా కూడా ఆ ప్రయత్నమే చేస్తున్నాం. కానీ అది అంత తేలికేం కాదు. పట్టుదలగా, దీక్షగా కృషి చేస్తే, కష్టపడితే కానీ ఆ స్థితి సాధించలేరు. చాలామంది నేను చాలా కాలం నుంచి ధ్యానం చేస్తున్నాను, గంటలు గంటలు ధ్యానం చేస్తున్నాను, తీవ్రంగా చేస్తున్నాను అని అనుకోవచ్చు కానీ, ఈ శాశ్వతం కానటువంటి వాటి మీద భ్రాంతి పోయిందా? లేదా? అన్నది మీరు గమనించుకోండి. వాటి మీద మీకు భ్రాంతి లేకపోతే, తగ్గిపోతే మీ సాధనలో మీరు పురోగతి సాధిస్తున్నట్టు లెక్క.

సాధనలో నేను ఎదుగుతున్నానా? లేదా?సాధన ఫలితం నేను పొందుతున్నానా? లేదా? అన్నది తెలుసుకోవడానికి అశాశ్వతమైన వాటి మీద వ్యామోహం పోయిందా? లేదా ఇంకా ఉందా? అన్నదే లెక్క. అంతేగానీ ఎన్ని సంవత్సరాల నుంచి చేస్తున్నారు అన్నది లెక్క కాదు. మీరు వినే దాంట్లో, విశ్లేషణ చేసుకుంటే దాంట్లో ఎన్నో ముఖ్యమైన విషయాలు తెలుస్తూ ఉంటాయి.

అవి వేరే బుక్‌లో వ్రాసుకోవాలి, అది మీ పురోగతికి చాలా చాలా ఉపయోగ పడతాయి. గొప్పవాళ్ళ యొక్క సందేశాలు సామాన్యమైనవి కావు. అవి అనుభవ పూర్వకంగా చెప్పినటువంటి సందేశాలు.

శంకరాచార్యులవారి తల్లి కొడుకుని ఎందుకురా సన్యాసిలా తిరుగుతావు! పెళ్లి చేసుకుని, పిల్లల్ని కని సుఖపడు నాయనా అని బ్రతిమాలింది. తల్లి దేహ స్థితిలో ఉంది, శంకరాచార్యుల వారు ఆత్మ స్థితిలో ఉన్నారు. అందుచేత తల్లి శాశ్వతం కానటువంటి వాటిని పొంది సుఖపడమంది. కానీ శంకరాచార్యుల వారు శాశ్వతమైన ఆత్మ సుఖాన్ని పొందాడు. ఇంక దాని మీద వ్యామోహం ఏముంటుంది? అందుచేత ఆవిడ ఎంత చెప్పినా శంకరాచార్యుల వారు వెళ్ళలేదు.

ఇప్పుడు ఆ అనుభవం ఉంది కాబట్టే ఆ విషయం మనందరికీ ఆయన చెప్పడం జరిగింది. కానీ పత్రి గారు మనకు మధ్యే మార్గం చెప్పారు. ఉంటే అనుభవించండి, లేకపోతే లేదని బాధపడకండి అని చెప్పారు. వాటి కోసం తప్పులు, పాపాలు చేయొద్దు, ఒకళ్ళతో పోటీ పడొద్దు, వేరే వాళ్ళకు ఉన్నాయని బాధ పడొద్దు, నీకున్న దానితో నువ్వు తృప్తి పడు, ఒకళ్ళతో పోల్చుకోవద్దు అన్నారు.

పత్రి గారికి తెలుసు ఒక్కసారే శంకరాచార్యులవారిలా మారి పోవాలంటే సాధ్యం కాదని. అందుకే "సంసారంలో నిర్వాణం" అని చెప్పడం జరిగింది. సంసారం చేసుకుంటూ, సంసార సుఖాలు అనుభవిస్తూ, ఉన్నంతలో తృప్తిగా జీవిస్తూ, పొందగలిగిన సుఖాలు పొందుతూ సాధనలో కొనసాగమన్నారు, తీవ్రంగా కృషి చేయమన్నారు. ముఖ్యంగా ఆహార నియమాలు పాటించకుండా ఎంత తీవ్రాతి తీవ్ర సాధన చేసినా అంతా వృధా అయిపోతుంది, సరైన ఫలితాలు రావు.

ఆహార నియమాలు పాటిస్తూ, తీవ్ర సాధన చేసినప్పుడు మనసు

శుద్ధియై ఖచ్చితంగా మార్పు వస్తుంది. ఖచ్చితంగా మీ ఇంట్లో వాళ్ళు ఏంటి ఇంతలా మారిపోయావు అంటారు. అలాంటి స్థితి పొందినప్పుడు అటువంటి వాడు కుండ యందలి దీపం వలె తనలోనే ప్రకాశిస్తూ ఉంటాడు. మీరు చూడండి కుండలో దీపం పెడితే పైకి కాంతి కనపడదు. కానీ లోపల ప్రకాశిస్తూ ఉంటుంది. అలాగే ఒక రమణ మహర్షిని చూస్తే బికారి వాడిలా ఉంటాడు, కానీ ఆయన గొప్పతనం బయట వాళ్ళకి ఏం తెలుస్తుంది?

మరి రమణ మహర్షికి వేల మంది కాదు, లక్షల మంది దాసోహం అయ్యారు, శిష్యులయ్యారు. స్వామి వివేకానందకి ఇప్పటికీ ఎంతోమంది శిష్యులు ఉన్నారు. ఆయన్ని అనుసరించే వాళ్ళు ఉన్నారు. యువత ఎక్కువ వివేకానందకి ప్రభావితం అవుతున్నారు. మరి పత్రి గారికి మనం ఎంతమంది ప్రభావితమయ్యాం. అందుచేత అలాంటి వాళ్ళ యొక్క గొప్పతనం పైకి కనిపించదు.

ఒకసారి నేను పత్రి గారితో భీమవరంలోనే ఈ ఎలక్షన్ ర్యాలీకి వెళ్ళడం జరిగింది. అప్పుడు ఆయనతో పాటు కొన్ని వీధులు తిరిగాను. తిరుగుతుంటే ఆ వీధుల్లో ఎవరూ ఆయన్ని పట్టించుకోలేదు. చుట్టూ ఉన్నవాళ్ళ ప్రవర్తన మామూలుగానే ఉంది. నాకు అనిపించింది ఏంటి ఇంత దైవ స్వరూపుడు లాంటి ఈయన వస్తూ ఉంటే ఎవరు పట్టించుకోరేంటి! అని ఆశ్చర్యంవేసింది. మనమేమో ఆయన ఎంతో గొప్పవాడు అనుకుంటాం కాని ఊళ్ళో ఎవరూ ఆయన్ని పట్టించుకోవట్లేదు.

కుండలో దీపం అంటే అదే. ఆయన ఎంత గొప్పవారైనా, ఎంత గొప్ప ప్రకాశం ఉన్నవారైనా బయటికి ఏమీ కనిపించరు. అందరిలాగే సామాన్యంగా ఉంటారు. ఆయనలోని అపారమైన జ్ఞాన సంపద ఎవరికీ అర్థం కాదు! మరి శంకరాచార్యులవారు అటువంటి గొప్పవారు కుండ యందలి దీపం వలె తనలోనే ప్రకాశిస్తూ ఉంటారు అని చాలా అద్భుతంగా వివరించారు.

అందుకే మీరు చూడండి ఒక సత్యసాయిబాబా కానీ, షిరిడీ బాబా కానీ సమాజంలో ఏదో ఒక మార్పు తీసుకురావాలి, అందరికి ఒక సందేశం ఇవ్వాలి అనేటటువంటి ప్రణాళికతో వచ్చారు. అందుచేత ఆ సందేశం ఇవ్వాలి అంటే ఆయన దగ్గరికి జనం రావాలి. ఆయన మాట వినాలి అంటే ఆయన మీద విశ్వాసం ఉండాలి. అందుచేత వాళ్ళు ఏం చేశారంటే? తమకున్న కొంత శక్తిని ఖర్చుపెట్టి కొన్ని మాయలు చేసేవారు.

సత్య సాయిబాబా విభూతి సృష్టించడం, నగలు సృష్టించడం, గొలుసులు, చిన్న చిన్న విగ్రహాలు సృష్టించడం చేసేవారు. ఈ జనం వాటికి ఆకర్షితులు అయ్యేవారు. అబ్బో ఈయనకి ఎన్నో శక్తులు ఉన్నాయి, ఈయన సామాన్యుడు కాదు అని అప్పుడు తండోప తండాలుగా వారి దగ్గరికి వచ్చేవారు. మరి షిరిడీ బాబా నీళ్లతో దీపాలు వెలిగించడం, ఉడుకుతున్న అన్నాన్ని చేత్తో కలపడం ఇలాంటి పనులన్నీ చేసేవారు. దాంతో ఈయనకి కూడా చాలా మహిమలున్నాయని ఎంతో మంది ఆయనకి ఆకర్షితులయ్యారు.

అలా వచ్చిన వాళ్ళకి ఆయన సందేశాలు ఇచ్చేవారు. మరి సత్య సాయిబాబా పంచసూత్రాలు బోధించారు, ముఖ్యంగా ప్రేమ, సేవ అనే రెండు పనులు హైలైట్ చేశారు. పత్రిగారు "శ్వాస మీద ధ్యాస" ధ్యానం, సాత్వికమైన శాకాహారం ఈ రెండింటి మీదే ఎక్కువ దృష్టి పెట్టారు. అలా ఎవరైనా సరే ఈ స్థాయికి రావాలి అంటే ముందు సత్య సాయిబాబా చెప్పినట్టు ఆ రెండు ఆచరించగలిగిన వాళ్ళై ఉండాలి. అందుకే సత్య సాయిబాబాని అనుసరించే వాళ్ళు ఈ ధ్యానంలోకి తేలిగ్గా వస్తారు.

అలా మెహర్ బాబా మార్గంలో ఉన్న వాళ్ళు కూడా ధ్యానంలోకి వస్తారు, ఎందుకంటే అల్టిమేట్ ధ్యానమే కాబట్టి. ఎవరైనా డైరెక్ట్‌గా రారు. వాళ్ళు అవన్నీ ప్రదర్శించారు కానీ, పత్రి గారు ఏమంటారంటే? అవేమి కూడా అవసరం లేదు అంటారు. వాటిని చూపించి, వీటిని చూపించి, ఆకర్షించడం

కాదు మీ జ్ఞానంతో ఆకర్షించండి అని చెప్తారు. మీరు వేషాలు కూడా వేసుకోనక్కర్లేదు, జడలు, ముడులు వేసుకోనక్కర్లేదు, కాషాయలు ధరించక్కర్లేదు, రుద్రాక్షలు వేసుకోనక్కర్లేదు, నువ్వు సామాన్యంగా ఎలా ఉంటావో అలాగే ఉండు అంటారు.

మీరు సామాన్యమైన వస్త్ర ధారణతో వెళ్లి క్లాసులు చెప్తే ఎవరికి ఎక్కుతుంది చెప్పండి! అక్కడికి వెళ్ళి మీరు ఏదైనా క్లాస్ చెప్తే వీళ్ళా గురువులు! అని అనుకుంటారు. కానీ వేషాలు వేసుకుని హంగు, ఆర్భాటం చేసే గురువుల కంటే ఈ ఆత్మజ్ఞానం చెప్పే వారు గొప్పవారు. అందుకే పత్రి గారు జ్ఞానంతో ఆకట్టుకోండి అంటారు.

అందుకే పత్రి గారికి నెమ్మది నెమ్మదిగా పబ్లిసిటీ పెరిగింది. అందుచేత ఆ రకంగా జీవించేవాళ్ళు కుండలో దీపంలాగా వాళ్ళ ప్రకాశం వారిలోనే ఉంటుంది కానీ బయటకి వ్యక్తం కాదు. అందుకే పత్రి గారు లక్షల మీద ఆకర్షించగలిగే పండితుల కంటే మీరు చాలా గొప్పవారు అని చెప్తారు. ఎందుకంటే వారు ధ్యాన సాధన చెప్పరు, చేయరు.


**YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు**

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

::6::

**"ఆత్మజ్ఞానం కలిగినవాడు మోహం అనే సముద్రాన్ని దాటి, రాగద్వేషాలు అనే రాక్షసుడిని సంహరించి, ప్రశాంతమైన జీవనంతో ఆత్మానుభూతి పొందినవాడై బ్రహ్మానందంతో ప్రకాశిస్తాడు".**

ఆత్మజ్ఞాని యొక్క ప్రవర్తన ఎలా ఉంటుందో ఈ సందేశం ద్వారా శంకరాచార్యుల వారు మనకు బోధించడం జరిగింది. ఆయన ఏమన్నారంటే ఈ ఆత్మజ్ఞానం కలిగినవాడు మోహం అంటే వ్యామోహం అనే సముద్రాన్ని దాటి అన్నారు. ఇక్కడ మోహాన్ని సముద్రంతో పోల్చారు. ఈ మోహం అన్నది మానవులకి ఉండే అరిషడ్ వర్గాల్లో ఒక లక్షణం. అరిషడ్ వర్గాలు అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాశ్చర్యాలు.

మోహము అంటే అన్నిటి పట్ల వ్యామోహం. సంపదల పట్ల వ్యామోహం, ఆస్తుల పట్ల వ్యామోహం, పదవుల పట్ల వ్యామోహం, పేరు ప్రఖ్యాతుల పట్ల వ్యామోహం, బంగారం పట్ల వ్యామోహం. ఈ వ్యామోహం వల్ల అవి సంపాదించాలనే తాపత్రయంతో అవి పొందడానికి చేయకూడని తప్పులు, పాపాలు చేస్తారు, అధర్మంగా వ్యవహరిస్తారు. జీవితాన్ని దుఃఖమయం చేసుకుంటారు. ఒక రకంగా చెప్పాలంటే ఈ మోహంతో జీవితాన్ని నాశనమే చేసుకుంటారు.

పెళ్లి కాని వాడికి కొంచెం అందమైన అమ్మాయిని చూస్తే వ్యామోహం. అమ్మాయికి అందమైన అబ్బాయిని చూస్తే వ్యామోహం. విపరీతమైన వ్యామోహం ఎవరినైనా పతనం అయ్యేటట్టు చేస్తుంది. ఇది అజ్ఞానుల లక్షణం. అజ్ఞానికి అరిషడ్ వర్గాలు అదుపులో ఉండవు. కానీ, ఎవరైతే జ్ఞానం సంపాదిస్తారో వాళ్ళు ఈ అరిషడ్ వర్గాల్ని తన అదుపులోఉంచుకుంటారు.

ఈ ప్రపంచంలో అశాశ్వతమైనవి ఎన్నో ఉన్నాయి, చాలా ఆకర్షణగా ఉంటాయి. వాటిని వేటిని చూసినా వ్యామోహమే. చాలా మందికి ప్రక్కఇంట్లో

ఏది చూస్తే అది కావాలని ఉంటుంది, ఎదురింట్లో చూస్తే అదీ కావాలని ఉంటుంది. చీర్ల షాప్ కి వెళ్తే పిచ్చెక్కిపోతుంది, అందుచేత ఈ వ్యామోహాన్ని సముద్రంతో పోల్చారు. కానీ ఆత్మజ్ఞానం కలిగినవాడు ఈ మోహం అనే సముద్రాన్ని దాటేస్తాడు అన్నారు.

ఇంకా ఏమని చెప్పారంటే? ఆత్మజ్ఞాని రాగ ద్వేషాలు అనే రాక్షసుడిని సంహరించి అన్నారు. రాగ ద్వేషాలు అంటే తనవారి పట్ల అనురాగము, ఇతరులు పట్ల, పట్ల ద్వేషము రెండూ ఉంటాయి. తనవారు అనుకుంటే ఒక రకంగా ప్రవర్తిస్తాడు, ఇతరులు అనుకుంటే ఇంకొక రకంగా ప్రవర్తిస్తాడు. ఇది అజ్ఞాని యొక్క లక్షణం. కాని అంతా ఒక్కటే, అందరూ ఆత్మలే, అంతా నేనే, నేనే అంతా అనే జ్ఞానం పొందితే ఎవరి పట్ల, దేని పట్ల రాగద్వేషాలు ఉండవు.

ఈ సత్యాన్ని తెలుసుకున్నవాడే జ్ఞాని. అందుచేత ఆత్మ జ్ఞాని ఈ రాగద్వేషాలు అనే రాక్షసుడిని సంహరిస్తాడు అంటే లేకుండా చేసుకుంటాడు. ఇక్కడ శంకరాచార్యుల వారు ఆత్మజ్ఞానం పొందితే ఎన్ని రకాల లాభాలు పొందవచ్చో బోధించారు. మాస్టర్లు కావలనుకునే వాళ్ళు, క్లాసులు చెప్పేవారు ముఖ్యంగా జ్ఞానం యొక్క గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను బోధించాలి.

జ్ఞానం గురించి మీరు ఎంత బాగా వివరించగలిగితే వాళ్ళు జ్ఞానం మీద అంత ఆసక్తి చూపిస్తారు. జ్ఞానం పొందాలనే ఆసక్తి వాళ్ళలో కలిగితే ధ్యానం చేయడానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. అందుచేత ఎక్కడకి వెళ్ళినా మీరు జ్ఞానం యొక్క విశిష్టత, జ్ఞానం పొందడం వల్ల వచ్చే లాభాలు చెప్పాలి.

పత్రి గారు ఎంతో స్పష్టంగా చెప్పారు. నువ్వు ఎంత జ్ఞానం సంపాదించినా ఇంకా నేర్చుకోవాల్సింది ఉంటూనే ఉంటుంది, అంత గొప్పది ఈ జ్ఞానం అని చెప్పారు. అందుకే శివుడు ఇంకా ధ్యానం చేస్తున్నాడు అని మనకి పత్రి గారు చెప్పడం జరిగింది. అలాగే ఎవరైతే క్లాసులకి వెళ్ళినప్పుడు

మిగతా లాభాల గురించి కాకుండా జ్ఞానం గురించి ఎక్కువ చెప్తూ ఉంటారో వాళ్ళు చాలా గొప్పవాళ్ళు అవుతారు. వాళ్ళకు మించిన వాళ్ళు ఎవరు లేరు. అలాంటి వాళ్ళకి ప్రకృతి యొక్క సహకారం కూడా బాగా లభిస్తుంది.

ఆత్మజ్ఞానమే అసలైన జ్ఞానం, ఆత్మజ్ఞానమే సత్యజ్ఞానం, దాన్ని మించింది లేదు. అందుకే పత్రిగారు విగ్రహారాధన వద్దు ఆత్మ సత్యారాధన చేయండి అని చెప్పారు. ఆయన ఎందుకు ఆత్మను ఆశ్రయించమన్నారు? ఎందుకంటే ఆత్మను ఆశ్రయించిన వారికే అంటే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేసిన వారికే ఈ జ్ఞానం అబ్బుతుంది, వాళ్ళు చాలా గొప్పవాళ్ళు అవుతారు.

అసలు శంకరాచార్యుల వారు ఇన్ని విషయాలు వివరిస్తారని మనకు తెలుసా? ఆయన చెప్పింది ప్రతీది సత్యమే, ఎంతో అద్భుతమైనటువంటి సందేశం ఇచ్చారు. ఈ ఆత్మజ్ఞానం సంపాదించుకున్నవాడు మోహం అనే సముద్రాన్ని దాటి, రాగద్వేషాలు అనే రాక్షసుడిని సంహరించాలి అన్నారు. అంటే జ్ఞానం పొందడం వల్ల మానవుడికి ఏది అవసరం లేదో, ఏది నష్టం కలిగిస్తుందో వాటిని వదిలేస్తాడు.

ఇంకా ఏం చెప్పారంటే? ప్రశాంతమైన జీవితాన్ని జీవిస్తూ ఉంటాడు అన్నారు. అలాగే ఆత్మానుభూతి పొందినవాడై అన్నారు. అంటే ఆత్మను దర్శించడం కాదు, ఆ ఆత్మను అనుభూతి పొందుతాడు, ఆత్మానుభూతి పొందడం అంటే సమస్తము పొందినట్టే. ఆ ఆత్మానుభూతి పొందినవాడు బ్రహ్మానందంతో ప్రకాశిస్తాడు అని చెప్పడం జరిగింది.

మీరు జ్ఞానాన్ని సంపాదించుకున్నప్పుడు ఎక్కడికి వెళ్ళినా, అనర్గళంగా ఎన్నాళ్ళైనా క్లాస్ చెప్పగలుగుతారు, అందరినీ ఆకట్టుకుంటారు. మీరు ధ్యానాన్ని ఇతరులకి చెప్తే మాస్టర్ అయినట్టు కాదు, ఇతరులకి జ్ఞానాన్ని బోధించగలిగితే అప్పుడు మీరు మాస్టర్ అయినట్టు. మీరు ఎంత జ్ఞానం పెంచుకుంటే అంత పెద్ద మాస్టర్ అయినట్టు లెక్క. శాలువాలు కప్పించుకున్నవారు సీనియర్ మాస్టర్స్

కాదు జ్ఞానాన్ని బోధించగలిగిన వారే సీనియర్ మాస్టర్స్.

మీరు జ్ఞానాన్ని బోధించేటప్పుడు జ్ఞానకాంక్ష ఉన్నవారు మీకు ఆకర్షితులు అవుతారు, ఈ జ్ఞానకాంక్ష చాలా కొద్దిమందికే ఉంటుంది, అందుకే ఈ క్లాసులకి విరగబడి రారు. కాబట్టే మీరు స్త్రీ అవ్వండి, పురుషుడు అవ్వండి, ధనం ఉండనివ్వండి, లేకపోనివ్వండి, జ్ఞానకాంక్ష ఉంటేనే మీ దగ్గరికి వస్తారు. లేకపోతే రారు.

మన దగ్గరికి వచ్చే వాళ్ళందరూ జ్ఞానకాంక్ష ఉన్నవాళ్లే. అందుకే ఆ జ్ఞానపరమైన విషయాలు మేము చెప్తుంటే ఎంతో ఆసక్తితో వింటున్నారు. అందుకే నేను అంటాను మీకు ధ్యానాసక్తి ఉంది అంటే 300 జన్మలు దాటిన వాళ్ళు, జ్ఞానాసక్తి ఉంది అంటే 350–360 జన్మలు దాటినవాళ్ళు అని.

ఆత్మజ్ఞానం పొందినవారు సమస్తాన్నీ అధిగమిస్తారు. అన్నిటిని అదుపులో ఉంచుకుంటారు. మాగ్నెట్ కి ఇనుము ఆకర్షితమైనట్టు ఈ జ్ఞాన బోధ చేసే వాళ్ళకి ఆ జ్ఞానాసక్తి ఉన్నవాళ్ళంతా ఆకర్షితులు అవుతారు. అందుకే పత్రి గారు అలాంటి వాళ్ళ కోసమే తిరిగేవారు. ఆయన ఎక్కడైనా క్లాస్ పెట్టమన్నప్పుడు అక్కడ మాస్టర్స్ ఆ ఊరు, ఆ చుట్టుపక్కల ఊళ్ళు కూడా తిరిగి చాలా ప్రయత్నం చేసి ఎంతో మందిని పోగేసేవారు. 1000 నుంచి 1500 మందిని పోగేసి పత్రిగారు ఎంతో సంతోషిస్తారు అని వాళ్ళు ఎంతో సంబరపడేవారు.

కానీ, అక్కడకి ఎంతమంది వచ్చినా పత్రిగారు పెద్ద పట్టించుకోరు, ఆయనకు కావలసింది జ్ఞానాసక్తి ఉన్నవాళ్లే. ఎందుచేతంటే లోకానికి మేలు చేయాలి, లోకానికి లాభం కలిగించాలి అనేటువంటి ఆసక్తి జ్ఞానికే ఉంటుంది కానీ అజ్ఞానికి ఉండదు, ఆ జ్ఞానాశక్తి లేని వాళ్ళకి ఉండదు. అందుచేత వాళ్ళు ఇందులోకి వచ్చినా ఉపయోగపడే పనులేమి చేయరు, అలాంటి వాళ్ళు ఎప్పుడూ వాళ్ల లాభమే చూసుకుంటారు. కానీ ఈ జ్ఞానాశక్తి ఉన్నవాళ్ళు

ఇందులోకి వచ్చినట్లయితే త్యాగ బుద్ధితో జీవిస్తారు, లోకానికి ఎంతో మేలు చేస్తారు, అందుకే పత్రి గారు అలాంటి వాళ్ళ కోసం చూసేవారు.

ఆయన తనకున్న శక్తితో వాళ్ళ ఆరా చూసి తెలుసుకుంటారు. నేను గమనించేవాడిని, ఆయన కొంతమందిని ప్రత్యేకించి పిలిచి కూర్చో పెట్టుకునేవారు, కొంతమంది దగ్గరికి వచ్చినా కూడా తిట్టి అవతలకి పంపేవారు. తర్వాత నాకు అర్థమయ్యేది ఓహో.. వీడేదో బాగా ఎదిగినటువంటి ఆత్మ, వీడి వల్ల లోకానికి ఏదో మేలు జరగవలసింది ఉంది. అందుచేతే అంత ఆసక్తిగా ఆయన్ని పిలిచి దగ్గర కూర్చోపెట్టుకున్నారు. అలాగే వాడి లాభం కోసం వచ్చినవాడు ఎవరికీ ఉపయోగపడడు అందుకని వాడిని బయటకి పంపేసేవారు.

మరి ఒక్కసారే అందరిలోనూ మార్పు రాదు, అది మెల్లి మెల్లిగా వస్తుంది. మీరు చేయగా చేయగా  మీ లోపాలన్నీ తొలగించుకుంటారు, మీ అవలక్షణాలన్నీ తొలగించుకుంటారు, పరిపూర్ణులు అవుతారు. మీ స్వార్థం వదిలిపెట్టి లోక కళ్యాణానికి ఎంతో పాటుపడతారు, మీరు చేసే పనులకి ప్రకృతి ఎంతో సంతోషిస్తుంది, అంతే కాదు మీకు అన్ని విషయాల్లో సహకారం అందిస్తుంది కూడా. అది మీరు చేసే దాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. ఆధ్యాత్మికంగానే కాదు ప్రాపంచికంలో కూడా మీరు తలపెట్టిన పనుల్లో మీకు మేలు జరుగుతుంది.

ఈ మార్గంలో మీరు జ్ఞానం పొందే కొద్ది ఇతరులకి మంచి చేయాలనేటువంటి ఉద్దేశ్యం మీలో ఆటోమేటిక్‌గా  పెరుగుతుంది. మీ నిష్క్రమణ కూడా అంటే శరీరాన్ని వదలడం కూడా మంచం మీద పడి తీసుకుని తీసుకుని వెళ్ళడం అన్నట్టుగా ఉండదు. మీ పనులు మీరు చూసుకుంటూ మీరు నిష్క్రమిస్తారు. జ్ఞానం సంపాదించుకున్నారు కాబట్టి సహాయకులు కూడా మీరు వెంటనే వెళ్ళిపోతారు, అక్కడ గొప్ప లోకాలకు తీసుకెళ్ళబడతారు, గొప్ప వాళ్ళతో

సాంగత్యం ఏర్పడుతుంది, వచ్చే జన్మ కూడా మీకు అనుకూలించే విధంగా లభిస్తుంది.

ఇప్పుడు మీరు చేసింది, కష్టపడింది వృధా కాదు. ఈ మార్గంలో మీరు చేసే కృషి మీ భవిష్యత్తుని ఎంతో గొప్పగా తీర్చిదిద్దుతుంది. పత్రి గారు చెప్తారు కదా 'చేసుకున్న వాడికి చేసుకున్నంత మహదేవ' అని. కానీ ఈ జ్ఞానం అందరికీ ఎక్కదు.

అందుచేత ఆత్మజ్ఞానం కలిగినవాడు మోహం అనే సముద్రాన్ని దాటుతాడు, రాగద్వేషాలు అనే రాక్షసుడిని సంహరిస్తాడు, ప్రశాంతమైన జీవితం జీవిస్తాడు, ఆత్మానుభూతిని పొంది బ్రహ్మానందంతో ప్రకాశిస్తాడు.

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

## ::7::

శంకరాచార్యులు వారు, పత్రిగారు, వశిష్టుల వారు, శ్రీకృష్ణులవారు, మేడం బ్లావట్స్కి, ముమ్మిడివరం బాలయోగి ఇలా ఎంతోమంది గొప్పవాళ్లు, యోగులు, యోగీశ్వరులు, ఆత్మ జ్ఞాని యొక్క గొప్పతనం గురించి వివరించారు. లోకంలో అందరికంటే ఆత్మ జ్ఞాని గొప్పవాడని, కనుక ప్రతి ఒక్కరిని ఆత్మ జ్ఞానులు కమ్మని బోధించడం జరిగింది.

ఆత్మ జ్ఞానం గురించి చెప్పుకోవడం అంటే ఆత్మ గురించి చెప్పుకోవడం, ఆత్మ యొక్క గొప్పతనం గురించి వివరించుకోవడం. మీరు గమనించినట్లయితే మన జూమ్ లోకి వచ్చేవాళ్లు, భీమవరం వచ్చేవాళ్ళు, కొన్నాళ్లు కంటిన్యూ అవ్వగలుగుతారు. తర్వాత కొనసాగించలేకపోతారు.

దానికి ముఖ్య కారణం ఎన్నాళ్ళు విన్నా అదే కదా, ఇంకేదైనా కొత్తవి వింటే, కొత్తవి తెలుసుకుంటే బాగుంటుంది అనే భావం వారిలో ఉంటుంది.. కానీ ఆత్మకంటే, ఆత్మజ్ఞానం కంటే గొప్పది లేదు అన్న విషయం తెలుసుకో గలిగితే అస్తమాను అదేనా అన్న మాట రాదు. అసలు ఆత్మ జ్ఞానం గురించి వినాలన్నా, తెలుసుకోవాలన్నా మన జూమ్లోకి రావాలి. ఎన్నో కోణాల్లోంచి, ఎన్నో రకాలుగా ఎన్నో విషయాలు బోధిస్తున్నాం.

ఇంతకన్నా గొప్ప మార్గం లేదు అని తెలుసుకున్న వాళ్ళకి కూడా కంటిన్యూ ఇదే చెప్తే బోర్ కొడుతుంది, చాలా విచిత్రమిది. ఇది ఎంత గొప్ప మార్గమో సామాన్య దృష్టితో చూస్తే అర్థం కాదు, ఎందుచేతనంటే లోకంలో రెండు రకాల మార్గాలు ఉన్నాయి

1) కర్మ మార్గము 2) జ్ఞానమార్గం

**1) కర్మ మార్గం:-** కర్మ మార్గం చీమ లాంటిది, కర్మ మార్గాన్ని ప్రాపంచికమార్గం అంటారు, కర్మమార్గం దేహానికి సంబంధించినది. ఈ కర్మ మార్గాన్ని చీమ లాంటిది అని ఎందుకన్నారంటే? చీమ భూమి మీదే తిరగగలదు, తన చుట్టూ

ఉన్నవే తెలుసుకోగలదు, అంతకుమించి తెలుసుకోలేదు, గ్రహించలేదు.

**2) జ్ఞానమార్గం:–** జ్ఞానమార్గం పక్షి లాంటిది, జ్ఞానమార్గాన్ని ఆధ్యాత్మిక మార్గం అంటారు, జ్ఞానమార్గం ఆత్మకు సంబంధించినది. పక్షి భూమి మీదే కాదు ఆకాశంలో కూడా సంచరించగలదు, అంటే ఆకాశంలోనివి కూడా తెలుసుకో గలదు.

కర్మలు చేసేవారు అనుసరించేది కర్మమార్గం. వీరు కర్మలు చేస్తూ ఉంటారు, కర్మలు పెంచుకుంటూ ఉంటారు, ఆ కర్మలు పెరగడం వల్ల కష్టాలు కూడా పెరుగుతూ ఉంటాయి. ఈ కర్మ మార్గంలో జీవించే వారికి కొన్ని జన్మలు అయ్యేసరికి కష్టాలు పెరగడం వల్ల అయోమయంలో పడిపోతారు. జీవితం ఇలా అయిపోయిందేమిటి? అని బాధపడతారు, ఎలా బయటపడాలో తెలియదు. ఏ దిక్కు లేని వాడికి దేవుడే దిక్కనుకుంటూ తమకు నచ్చిన దేవుళ్లను ఆశ్రయిస్తారు, వీళ్ళకు దేవుడంటే తెలియదు, దేవుడు ఎవరో కూడా తెలియదు.

కాని పక్షి భూమి మీదే కాకుండా ఎలా ఆకాశంలో కూడా సంచరించ గలదో! ఆకాశంలోనివి కూడా తెలుసుకోగలదో అలా ఈ జ్ఞానమార్గంలో ఉన్నవాళ్లు, జ్ఞానాన్ని సంపాదించుకున్న వాళ్లు భూమి మీద ఉన్నవే కాకుండా కంటికి కనబడని సృష్టిలో ఉన్న ఎన్నో లోకాల్లో ఉన్న వాటిని కూడా తెలుసు కోగలరు. ఎన్ని రకాల లోకాలు ఉన్నాయి? ఆ లోకాల్లో ఎవరెవరున్నారు? అన్నీ తెలుసుకుంటారు.

ఆత్మలైన ప్రతివాళ్లు భూమి మీద జీవించి కొన్నాళ్ళకి శరీరాన్ని వదిలేసి ఆ కనపడని లోకాలకు చేరుకుంటారు, అక్కడ ఇంకా ఎన్నో విషయాలు తెలుసుకుంటారు. ఆ లోకవాసులు, ఆ లోకాల్లో జరిగేవే కాదు భూమిమీద చేసిన కర్మలు కూడా చూసుకోగలుగుతారు. అక్కడ జీవితం భూమి మీద ఉన్న జీవితానికి చాలా భిన్నంగా కనిపిస్తూ ఉంటుంది, ఆశ్చర్యం గొలుపుతూ ఉంటుంది. భూమి మీద ఉన్నప్పుడు అదే జీవితం అనుకుంటారు. చని

పోయినప్పుడు తెలుస్తుంది. అమ్మో భూమి మీద ఉన్నదే జీవితం కాదు, ఇంకా ఎన్నో తెలుసుకోవాలి అని.

కానీ ఈ జ్ఞానమార్గాన్ని అనుసరించిన వారు భూమి మీద ఉండగానే ఇవన్నీ తెలుసుకుంటారు, అర్థం చేసుకుంటారు, ఆశ్చర్యపోతారు. ఎప్పుడైతే తెలుసుకుంటారో ఇవన్నీ ఉన్నాయని నేను అనుకోలేదు! భూమిమీద ఉన్నదే జీవితం అనుకుంటూ ఎన్నో తప్పులు చేస్తున్నాను అని జీవితాన్ని ఎంతో మార్చుకుంటారు.

కర్మ మార్గంలో ఉన్న వారి జీవితం ఈ జ్ఞానమార్గంలోకి వచ్చాక పూర్తిగా భిన్నంగా మారిపోతుంది. మరణానంతర జీవితం గురించి తెలుసుకున్న వారి ప్రవర్తన, వాళ్ళు చేసే పనులు భిన్నంగా ఉంటాయి. మీ అందరి జీవితం కూడా అలాగే ఉంటుంది. ప్రస్తుతం ఈ మార్గంలో ఉన్న మీ జీవితాన్ని, మీ కుటుంబం, మీ తల్లిదండ్రులు, బంధువుల జీవితాన్ని మీరు చూసుకుంటే ఆశ్చర్యం గొల్పుతూ ఉంటుంది.

మా విషయంలోనూ అదే జరిగింది. మా వాళ్ళకి అన్నీ తెలియవు. మేము చెబుదామని ప్రయత్నించినా వాళ్లకు అర్థం కావట్లేదు! వాళ్లకి ఇప్పుడు మేము చెప్పేది అర్థం కావాలి అంటే! వాళ్లు ఇంకా 50, 100, జన్మలు తీసుకోవాలి అని మేము అర్థం చేసుకున్నాం.

దేహపరంగా చూస్తే అంతా ఒకలాగే అనిపిస్తారు, కానీ ఆత్మ విషయంలోనే తేడాలుంటాయి. ఎన్నో జన్మలు తీసుకుని, ఇవన్నీ నేర్చుకుని ఉన్న వాళ్ళమే మనమంతా! అందుకే వాళ్ళ జీవితం, మన జీవితం పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎందుచేతనంటే జ్ఞానం అనంతం, ఎంత నేర్చుకున్నా ఇంకా నేర్చుకోవాల్సింది ఉంటూనే ఉంటుంది. ఈ అనంతమైన జ్ఞానాన్ని ఒక్కొక్క యోగీశ్వరుడు వారి వారి పంథాలో వివరించడం జరుగుతుంది.

అందుకే అంతటి గొప్ప వాళ్ళు చెప్పినటువంటి సందేశాలు

తెలుసుకుంటూ మన జ్ఞానాన్ని ఇంకా పెంచుకోవాలి, మీ ప్రవర్తనలో లోపాలు సరిచేసుకోవాలి, నష్టపోకుండా జాగ్రత్త పడాలిఇ. ప్రాపంచికంలో మీరు ఎన్ని తెలుసుకున్నా, ఎన్ని సాధించినా, ఎన్ని సంపా దించినా అన్నీ వృధాయే. ఎన్ని సాధించినా నాది అనుకునేది ఏదీ ఉండదు, నా అనుకునే వాళ్ళు ఎవరూ ఉండరు. మరి ఉండే దానికి ప్రాముఖ్యం ఇవ్వాలి కానీ ఉండని దానికి అంత ప్రాముఖ్యం ఎందుకు?

ఉండేదానికి ప్రాముఖ్యం ఇచ్చేవాళ్ళు అదృష్టవంతులు, గొప్పవాళ్లు. ఇప్పుడు మీరు చేసే పని అదే. మీరు శరీరం వదిలాక పైలోకాలకు వెళ్ళినప్పుడు బాగా అర్థమవుతుంది. మీరు ఎంతో గొప్ప లోకాలకు చేరుకుంటారు, అక్కడ ఇంకా ఎన్నో గొప్ప విషయాలు తెలుసుకుంటారు. ఇక్కడ ఈ జ్ఞానం సంపాదించుకోవడం వల్ల అక్కడ ఎంత గొప్ప స్థితి పొందుతారో అవన్నీ మీకు అర్థమవుతాయి.

ఇక్కడ ఈ జన్మ ఎంత గొప్పదైనా మరుజన్మ అనుభవాల కోసం, పాఠాలు నేర్చుకోవడం కోసం, మళ్ళీ సామాన్యమైన జన్మ తీసుకోవాల్సి వస్తుంది. అందుచేత ఇప్పుడున్న జీవితం శాశ్వతం కాదు అని తెలుసుకోవాలి.

అందుచేత జ్ఞానమార్గంలో ఇహం గురించి, పరం గురించి ఎన్నో తెలుసుకుంటారు, నేర్చుకుంటారు. కర్మ మార్గంలో కర్మలు చేస్తూ ఉంటారు కనుక కొద్దిగానే తెలుసుకోగలుగుతారు.

::8::

మనం ఆత్మజ్ఞానం పొందిన వారి ప్రవర్తన ఎలా ఉంటుంది అన్నది తెలుసుకుంటున్నాం. మరి మీరంతా ప్రతిరోజు ధ్యానం చేస్తూ, పుస్తకాలు చదువుతూ, ఆత్మజ్ఞానుల సందేశాలు వింటూ జ్ఞానం పొందే ప్రయత్నం చేస్తున్నారు. అలా పొందిన జ్ఞానాన్ని అందరికీ పంచే ప్రయత్నం కూడా చేస్తు న్నారు, దానికి ఎంతో కష్టపడుతున్నారు, భీమవరం మానకుండా వస్తున్నారు.

ఇన్ని రకాలుగా మీరు ప్రయత్నం చేసేటప్పుడు మీకు తెలియకుండానే మీ జ్ఞానం పెరుగుతూ ఉంటుంది. అది మీరు గుర్తించలేరు కానీ, పెరగడం అన్నది ఖచ్చితంగా ఉంటుంది, చేసింది వృధా కాదు. అది పెరిగి పెరిగి పరాకాష్టకు వెళ్తే ఏం జరుగుతుందో ఆదిశంకరాచార్యులు వారు బోధిస్తున్నారు. అందుచేత ఈ విషయాలన్నీ మనం అన్వయించుకుంటే మీరు ఏ స్థితిలో ఉన్నారు అన్నది మీకే అర్ధమవుతుంది.

చాలా మందికి నేను ధ్యానం చేస్తున్నాను కానీ అసలు నాలో మార్పు వచ్చిందా? లేదా? నేను ఏ స్థాయికి ఎదిగాను? అనేటటువంటి సందేహం ఖచ్చితంగా ఉంటుంది. కానీ పూర్తిగా మారకపోవచ్చు కానీ ఖచ్చితంగా మార్పు ఉంటుంది. అందుకే గురువు అవసరం ఎంతైనా ఉంటుంది, గురువు సహకారం లేకుండా ఎదగడం చాలా కష్టం.

మెహర్ బాబా వారు కూడా సద్గురువు సహాయం చాలా చాలా అవసరమని స్పష్టంగా చెప్పారు. సద్గురువు అంటే అనుభవ జ్ఞానం ఉన్నవారు. మీ స్వయం సాధన వల్ల ఏదో కొంత వరకు ఎదిగి ఆగిపోవచ్చు కానీ సద్గురువు సహాయం వల్ల అలా కొనసాగుతూనే ఉంటారు. మీరు బాగా శ్రద్ధ పెడితే ఈ జన్మలోనే పరాకాష్టకి చేరుకుంటారు అందులో సందేహం లేదు.

మీరు సంసారంలో ఉండండి, సమస్యల్లో ఉండండి, ఎన్నో బాధ్యతలు మీకు ఉండనివ్వండి, మీ ప్రయత్నం కొనసాగిస్తూ ఉంటే మీరు ఎదుగుతూనే ఉంటారు. కానీ ఎప్పుడూ నిరుత్సాహ పడకూడదు, ఎందుచేతనంటే "యద్భావం తద్భవతి" అన్న శ్రీకృష్ణుల వారి సందేశం ప్రకారం మీ భావం ఎప్పుడూ

ఉన్నతంగా, ఉదాత్తంగా ఉండాలి.

పత్రిగారు పరిచయం అయిన తర్వాత నేను కూడా అలాంటి ఉన్నత భావాలతోటే ఉండేవాడిని. వాళ్ళకంటే నేను ఎందుకు ఎక్కువ కాదు? వాళ్ళు సీనియర్ మాస్టర్లేంటి? వాళ్ళకంటే నేను సీనియర్ మాస్టర్ అవుతాను అనే భావంలో ఉండేవాడిని. ఎక్కడా నిరుత్సాహ పడలేదు, ఎక్కడా ఆగిపోలేదు. మరి నేను ఖచ్చితంగా అందరినీ మించిన స్థాయికి ఎదగగలిగాను. మీరు కూడా నిరుత్సాహ పడకండి, వెనకడుగు వేయకండి, ఆగిపోకండి, కొన సాగించండి, ఎందుకు కారండి!

పత్రి గారు కూడా ఎన్నో సందర్భాలలో నన్ను మందలించడం జరిగేది. కానీ నేను నిరుత్సాహ పడలేదు. నా లోపాన్ని సరిచేశారు, ఇంక దీన్ని నేను రిపీట్ చేయకూడదు అని నిర్ణయించుకొని సరిచేసుకునేవాడిని, అలా ఎన్నో సందర్భాల్లో జరిగింది. నాకు తెలుసు పత్రిగారు అపార జ్ఞాన సంపన్నుడు, అంతు లేని జ్ఞానం కలిగినవారు. నేను ఎంతో మంది గురువులని చూశాను, ఎంతో మంది సందేశాలు విన్నాను, ఎంతో మంది గురువుల పుస్తకాలు కూడా చదివాను కానీ, ఇంత జ్ఞానం ఎవ్వరూ బోధించలేదు.

అందరూ జ్ఞానమే చెప్తారు, వాళ్ళ దగ్గర ఉన్నది కూడా ఇదే కదా అనుకుంటారు. కానీ ఆ విన్న జ్ఞానం అనుభవంలోకి తెచ్చుకోవడానికి కావలసిన సరైన సాధన పత్రి గారు మాత్రమే మనకి ఇవ్వడం జరిగింది. అందుకే ఆయన అంటే నాకు అంత గౌరవం.

విచిత్రం ఏమిటంటే? పత్రి గారి మార్గంలోకి వచ్చి కూడా ఆయన చెప్పిన ఈ “శ్వాస మీద ధ్యాస” వదిలేసి అందరూ ఆయన చేయించినటువంటి మ్యూజిక్ మీద ధ్యాస పట్టుకున్నారు. అంటే గురువు లభించినా వాళ్ళు ఆ గురువు చెప్పిన సాధన అర్థం చేసుకోలేకపోయారు. ఇలా ఎందుకు చేయించారు అన్న ప్రశ్న నేను చాలాసార్లు వేసుకున్నాను. అప్పుడు నాకు ఇది పత్రి గారు మనందరికీ పెట్టిన పరీక్ష అని అర్థమైంది. ఆ పరీక్షలో మనమంతా ఉత్తీర్ణులయ్యాం. అందుచేత మనమంతా చాలా అదృష్టవంతులం.

::9::

**"భ్రమరం వల్ల కీటకం భ్రమరంగా మారినట్లు, జీవన్ముక్తుడైతే ఆత్మజ్ఞానం కలిగి పూర్వ శరీరానికి అలవాటు ఉన్న గుణాలను వదిలిపెట్టి సచ్చిదానంద రూపం అవటం చేత, నిరంతరం బ్రహ్మ చింతన చేత బ్రహ్మంగా మారుతున్నాడు".**

అంటే భగవంతుడిగా మారుతున్నాడు, కో-క్రియేటర్ అవుతున్నాడు. మనందరికీ భ్రమర కీటకన్యాయం తెలుసు. కీటకాన్ని తీసుకొచ్చి భ్రమరం గూట్లో పెట్టి ఆ గూడు తిన్నగా ఝూంకారం చేస్తూ ఉంటుంది. ఆ కీటకానికి ఆ భ్రమరం యొక్క ఝూంకారం తప్ప ఇంకేమీ వినదు. అలా విని విని విని అది కూడా భ్రమరంగా మారి గూటి నుంచి ఎగిరిపోతుంది.

అలాగే ఎవరైతే ఈ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం తీవ్రంగా చేసి ఆత్మజ్ఞానం పొందుతారో, వారు చివరకు జీవన్ముక్తులు అవుతారు. జీవన్ముక్తుడు అయితే ఇంక ఉండడేమో అనుకుంటారు, జీవన్ముక్తి అంటే చనిపోయాక వచ్చేది అనుకుంటారు. కానీ జీవన్ముక్తుడు అంటే జీవించి ఉండగానే ఆ ముక్త స్థితి పొందుతారు. మీరు సంసారంలో ఉంటారు, అన్ని పనులు చేస్తూ ఉంటారు కానీ జ్ఞానం కలగడం వల్ల ఆ ముక్త స్థితి పొందుతారు.

అటువంటి ఆత్మజ్ఞానం కలిగిన వారు అంతకుముందు ఆ శరీరానికి ఉండే గుణాలన్నీ వదిలేస్తారు. సాధన తీవ్రంగా చేస్తే ఆ గుణాలు ఖచ్చితంగా వదిలేస్తారు. తమోగుణం, రజోగుణం, ఆఖరికి సాత్విక గుణం కూడా వదిలి పెట్టడం వల్ల సచ్చిదానందస్వరూపుల్లా, నిత్యం ఆనంద స్థితిలో ఉంటారు.

ఎప్పుడైతే ఆ ఆనంద స్థితి పొందుతారో అప్పుడు జీవితంలో ఎటువంటి సంఘటన జరిగినా దుఃఖపడరు, ఆనందంగా ఉండగలుగుతారు, ఆ స్థితి మీరు సాధిస్తే మీరు గుణాలను అధిగమించిన వారే అవుతారు. సంసారంలో అన్నీ చూసుకుంటారు కానీ దేనికి మీరు స్పందించరు, రాగద్వేషాలు

ఉండవు, అహంకార మమకారాలు ఉండవు, నిత్యం ఆనంద స్థితిని అనుభవిస్తూ ఉంటారు.

ఆ స్థితిలో నిరంతరము బ్రహ్మ చింతనే ఉంటుంది అంటే భగవంతుని మీదే దృష్టి ఉంటుంది. ఇంక అదే ప్రపంచం అన్నట్టుగా జీవితం సాగుతూ ఉంటుంది, ఎందులోకి వెళ్ళినా మళ్ళీ ఇందులోకే వస్తూ ఉంటారు, ఏ పని చేసినా మళ్ళీ ఇదే. చివరికి కీటకం భ్రమరంగా మారినట్లు మీరు కూడా బ్రహ్మంగా మారిపోతారు.

ఎవరైనా ధ్యానంలో పరాకాష్టకి చేరుకున్నాడు అనడానికి సంకేతం ఏమిటంటే? ఖాళీ దొరికితే చాలు కళ్ళు మూసుకోవాలనిపిస్తుంది. వారు పనులేం మానరు, పని చేసుకుంటారు కానీ, కాస్త ఖాళీ దొరికినా అంటే 10 నిమిషాలు దొరికినా, అరగంట దొరికినా ఆ కళ్ళు మూసుకుంటారు. ఇలా కళ్ళు మూసుకోగానే నిమిషాల్లోనే ఆ బ్రహ్మ స్థితిలో ఉండిపోతారు, ఆనంద స్థితిలో ఉండిపోతారు. ధ్యానంలో పట్టురావడం అంటే అదే, ఇదే మీకు సంకేతం. అందుచేత ఖాళీ దొరికితే బాహ్య విషయాల మీద దృష్టి పెట్టడం కాదు, బ్రహ్మం మీద దృష్టి పెట్టండి. ఎన్ని జన్మలు ఎత్తినా, ఎన్ని సంసారాలు చేసినా, ఎన్ని జన్మల్లో ఎంత బాధ్యత నిర్వర్తించుకున్నా, ప్రతి ఒక్కరు చివరికి బ్రహ్మంగా మారవలసిందే.

బాహ్యంలో భగవంతుని యొక్క సృష్టి ఉంది, అంతరంలో భగవంతుడే ఉన్నాడు. బాహ్య దృష్టి పెరిగితే దుఃఖం పెరుగుతుంది, అంతర్ దృష్టి పెరిగితే ఆనందం పెరుగుతుంది. దానికి దైవానుగ్రహం ఉండాలి, ఆ దైవానుగ్రహం ఉంటేనే గురువు మీకు లభిస్తాడు, ఆ గురువు ద్వారానే ఆ స్థితి మీరు సాధిస్తారు. దైవానుగ్రహం అన్నది దైవం మీద మీకు ఆసక్తి ఉన్నప్పుడే ఉంటుంది.

మీ అభిప్రాయానికి విరుద్ధంగా దైవం ఏ నిర్ణయాలు తీసుకోడు.

మీరు బాహ్య దృష్టిలో ఉన్నప్పుడు, బాహ్య విషయాల మీద అంటే సంసారం మీదా, పిల్లల మీదా ఆసక్తి చూపిస్తున్నప్పుడు మీ ఆసక్తికి విరుద్ధంగా ఆయన ఏ నిర్ణయము తీసుకోడు. మీ సరదా తీర్చుకోమంటాడు, మీ కోరికలు నెరవేర్చుకో అంటాడు.

ఎన్ని జన్మలు తీసుకుంటారో తీసుకుని అన్నీ అయ్యాక ఎప్పుడైతే ఆయన మీద దృష్టి పెట్టడం మొదలు పెడతారో ఆయన అనుగ్రహం మీకు కలుగుతుంది. అప్పుడు ఆయన అనుగ్రహం వల్ల మీ సమస్యలు అధిగమించి అనుకూలమైన వాతావరణం మీకు ఏర్పడుతుంది, ఆయన సహకారం అంటే అదే. ఆ తపన మీకు లేకుండా అన్నీ అనుకూలించేటట్టు ఆయన ఎలా చేస్తాడు? మీకు తపన ఉంటేనే, మీరు ప్రయత్నం చేస్తేనే భగవంతుడి కృప కానీ, గురు కృప కానీ కలుగుతుంది. ఎవరికైనా జీవితంలో సమస్యలు ఉంటాయి, బాధ్యతలు ఉంటాయి లేకుండా ఉండవు. వాటిని లెక్క చేయకుండా ప్రయత్నం చేస్తే ఖచ్చితంగా ఎన్నో జన్మలు అక్కర్లేదు.


## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

## ::10::

**"కుండలు మొదలైనవి మట్టి నుండి వచ్చినవే అని ఏ విధంగా తెలుస్తుందో, ఆ విధంగానే ఆత్మజ్ఞానం కలిగిన వారికి ఈ సమస్తమైన ప్రపంచం ఆత్మయే అయి ఉంది, అంతకంటే వేరుగా ఇంకొకటి ఏది లేదు అని తెలుస్తుంది. అంతేకాదు చూడబడుతున్న సమస్త ప్రపంచం తన ఆత్మయే అని తెలిసి జీవిస్తాడు".**

కుండలు, కళాయిలు, దాకలు, కూజాలు, ఇలా ఎన్నో రకాలు ఉన్నాయి. అవన్నీ మట్టి నుంచి చేస్తారని మన అందరికీ తెలుసు. మరి మానవులు తెలుసుకోవలసింది ఏమిటంటే? కుండలన్నీ మట్టి నుంచి ఎలా వచ్చాయో, ఈ ప్రపంచంలో కనిపించే సమస్తము ఆత్మ నుంచే వచ్చాయి.

ఇది ఆత్మజ్ఞానం పొందిన వారికి అంటే ఆత్మ గురించి బాగా తెలిసున్న వారికి తెలుస్తుంది. ఆత్మ గురించి తెలియకపోతే అన్నీ వేరు వేరు, అంతా వేరు వేరు అనుకుంటారు. జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు, జలచరాలు, అన్నీ వేరు వేరు అనుకుంటారు. కానీ కుండలు ఎన్ని రకాలు ఉన్నా ఒకే మట్టి నుంచి ఎలా వచ్చాయో, సృష్టిలో 84 లక్షల రకాల జీవరాశులు, ఈ లోకాలు అంటే చరాలు, అచరాలు అన్నీ కూడా ఆత్మ నుంచే వచ్చాయి అని ఆత్మజ్ఞాని తెలుసుకుంటాడు అని శంకరాచార్యుల వారు చెప్పడం జరిగింది.

ఇప్పుడు మనం ఇంకా వేరు వేరు అనే భావంలో ఉన్నట్లయితే మనకి ఇంకా ఆత్మజ్ఞానం కలగలేదు అని అర్థం. చాలామంది ఏదో కొన్నాళ్ళు ధ్యానం చేసి నాకు జ్ఞానం వచ్చేసింది అంటారు. అసలు వారికి జ్ఞానం వచ్చిందా? లేదా? ఏ స్థితిలో ఉన్నారు? అన్నది ఎలా తెలుస్తుంది? అంటే ఎవరైతే శంకరాచార్యుల వారు చెప్పినట్టు ఆ సందేశాలు వింటూ, ఆ రకమైన ప్రవర్తనతో ఉంటారో వారు చేస్తున్న సాధన మంచి ఫలితాలను వచ్చినట్టేలెక్క.

అంతేకానీ ఎంత సాధన చేస్తున్నా ఆయన చెప్పినట్టుగా మీ ప్రవర్తన లేకపోతే మీకు ఇంకా జ్ఞానం అబ్బలేదని అర్థం చేసుకోవాలి. మరి మానవుల్లోనే

ఎన్నో బేధాలు చూస్తున్నాం, వాడిది వేరే కులం, వీడిది వేరే కుటుంబం, వాడిది వేరే మతం, వాడిది వేరే ప్రాంతం, వాడు పురుషుడు, ఈవిడ స్త్రీ అనే భావంలో ఉన్నారు. అలా ఉన్నంతకాలం మీరు ఇంకా అజ్ఞానంలో ఉన్నట్టే, ఆత్మజ్ఞానం కలగనట్టే.

ఎందుచేతనంటే సమస్త జీవరాశి ఆత్మ నుంచే ఉద్భవించడమే కాదు, ఆ అనంతమైన ఆత్మ శక్తే సమస్త జీవరాశుల్లో కూడా ఉండి నడిపిస్తుంది. అందుకే శరీరంలో నుంచి ఆత్మ తప్పుకుంటే ఆ శరీరం శవమైపోతుంది, ఆత్మ ఉంటేనే ఆ శరీరం జీవించి ఉంటుంది.

మీరు భగవద్గీతలో చూడండి...

**శ్లో॥ అహ మాత్మ గుడాకేశా సర్వభూతాశయస్థితః ।**
**అహమాదిశ్చ మధ్యంచ భూతానా మన్త ఏవ చ॥ (భ.గీ.10-20)**

తా: ఓ అర్జునా! సర్వ ప్రాణులలో స్థితమై వున్న ఆత్మను నేనే అయి వున్నాను. మరియు ప్రాణులయొక్క అది మధ్యాంతములు నేనే అయి వున్నాను.

అంటే ఈ సృష్టి ఏర్పడకముందు ఉన్నది ఒక్కటే, అదే అనంత శక్తివంతమైన ఆత్మ. ఆత్మ తప్ప ఇంకేమీ లేదు. ఆ ఆత్మ నుంచే పంచభూతాలు ఏర్పడ్డాయి. ఆ పంచభూతాల నుంచే ఈ లోకాలు, 84 లక్షల జీవరాశులు ఏర్పడ్డాయి.

ఇవన్నీ ఇంకొక చోట తయారుచేసి తీసుకురాలేదు, అన్నీ ఆత్మ నుంచే వచ్చాయి. ఆత్మ ఈ జీవరాసుల శరీరాలు తయారు చేయడమే కాదు, ఈ శరీరాలు పని చేయడానికి ఆత్మే తన శక్తిని ఈ జీవుల్లో ప్రవేశపెట్టింది. ఆ శక్తి వల్లే ఈ జీవులు మనుగడ సాగిస్తున్నాయి. అంటే మన అందరి శరీరాల్లో ఆత్మ ఉండబట్టే ఇప్పుడు మనం మాట్లాడుతున్నాం, తింటున్నాం, చూస్తున్నాం, ఎన్నో పనులు చేస్తున్నాం.

అంటే ఈ శరీరంలోనుంచి ఆత్మ తప్పుకుంటే ఈ శరీరం శవం అయిపోతుంది, కళ్ళు చూడలేవు, చెవులు వినలేవు, నోరు మాట్లాడలేదు,

చేతులు కాళ్ళు పనిచేయవు, శవాన్ని తీసుకెళ్ళి దహనం చేస్తారు. అంటే ఆత్మ ఉంటేనే ఏ జీవికైనా మనుగడ, ఆత్మ లేకపోతే ఏదైనా అదృశ్యం అయిపోతుంది.

అందుచేత ఆకారాన్ని చూసి వేరు, వేరు అని భావించడం అజ్ఞానం. ఈ అజ్ఞానం ఉన్నంతకాలం ఈ ద్వేషాలు, అసూయలు, ఒకరినొకరు చంపుకోవడం, తగువులు, కొట్లాటలు, కక్షలు, కార్పణ్యాలు యుద్ధాలు ఇవన్నీ ఉంటాయి. జంతువులు, పక్షులు, క్రిములు, కీటకాలు, సముద్ర జంతువులను కూడా వేరు అనే ఉద్దేశ్యంతో చంపుతున్నారు, భక్షిస్తున్నారు. కాని అన్నీ ఆత్మ నుంచే వచ్చాయి.

ఎంతకాలం అన్నీ వేరు వేరు అనే భావంలో ఉంటారో! అంతకాలం మీరు అజ్ఞానంలో ఉన్నట్టే. చాలామంది నాకు ఆత్మజ్ఞానం వచ్చేసిందండి అంటారు. వాడు వచ్చింది అని చెప్పుకోవడం కాదు వాడి ప్రవర్తన చెప్తుంది. మరి సొసైటీలో చూస్తూ ఉంటే ఒకళ్ళంటే ఒకళ్ళకి పడదు, ఒకళ్ళంటే ఒకళ్ళు సహించలేరు, ఎవరికి వాళ్ళే నేను గొప్ప అనే భావంలో ఉన్నారు. నేనే బాగా ఉన్నతంగా ఉండాలి అనేటువంటి ఉద్దేశ్యంతో ఉన్నారు.

పత్రిగారు ఏమంటారంటే ఒక క్లాసులో పిల్లలు పరీక్ష రాస్తూ అందరికంటే నాకే ఫస్ట్ రావాలి అనుకుంటారు. కానీ నాకే ఫస్ట్ రావాలి అనుకోవడం కాదు. నాకూ.. ఫస్ట్ రావాలి, ఫస్ట్ వచ్చిన వాళ్ళలో నేనూ ఒకడిగా ఉండాలి అనుకోవాలి అంటారు. నేను ఆత్మ అన్న స్థాయిలో ఉన్నవాడు ఆ రకంగా భావిస్తాడు.

అంతా వేరు వేరు అనే భావంలో ఉంటే అందరికంటే నేను టాప్‌లో ఉండాలి, గొప్పగా ఉండాలి అనే భావంలో ఉంటారు.

మీరు గమనిస్తే ఈ మార్గంలోకి వచ్చిన వాళ్ళు కూడా ఇంకా వేరు అనే భావంతోటే ప్రవర్తిస్తున్నారు. పత్రిగారు చెప్పిన సేవలు చేస్తున్నారు, పుస్తకాలు చదువుతున్నారు, ధ్యానం చేస్తున్నారు, అన్నీ చేస్తున్నారు కానీ, వారి ప్రవర్తనలో మార్పు రావట్లేదు, ఆ మార్పు వస్తేనే వాళ్ళు ఎదిగినట్లు.

ఇతరులు ఏమనుకున్నా మనకు అనవసరం. మనం ఇంత సాధన చేస్తూ ఎదుగుతున్నాం కాబట్టి ఖచ్చితంగా ఆ రకమైన ప్రవర్తనతో మనం జీవించాలి. అంతా వేరు వేరు అనే ప్రవర్తన మనసు యొక్క ప్రభావం ఉన్నంత కాలం ఉంటుంది. కానీ ఎప్పుడైతే మీరు మనసు యొక్క ప్రభావం తగ్గించి ఆత్మ ప్రభావం పెంచుకుంటారో, ఆత్మ స్థితిలో జీవిస్తూ ఉంటారో, అప్పుడు మొత్తం మారిపోతారు, అందరూ ఒకటే అన్నట్టుగా జీవిస్తారు.

అలా అయితే ఎలాగండి? నా భార్యతో నేను కాపురం చేయొచ్చా? నా పనివాడితో నేను పని చేయించవచ్చా? అని అడుగుతారు కొంతమంది. అందుకే వశిష్టుల వారు ఏం చెప్పారంటే? "బాహ్యంలో ద్వైతం, అంతరంలో అద్వైతం అన్నారు". ఆ స్థాయికి ఎదిగిన వాళ్ళు, అంతా ఒకటే అని అర్థం చేసుకున్న వాళ్ళు బాహ్యంలో నా భార్య వేరు, నేను వేరు అన్నట్టుగా జీవిస్తారు. కానీ, వాళ్ళ అంతరంలో మాత్రం ఇద్దరు ఒక్కటే అనే భావంతో ఉంటారు.

అసలైన ఆత్మజ్ఞాని యొక్క ప్రవర్తన ఈ రకంగా ఉండాలి. అందుచేత శంకరాచార్యుల వారు ఏమన్నారంటే? ఆత్మజ్ఞానం కలిగిన వారికి ఈ సమస్తమైన ప్రపంచం ఆత్మయే అయి ఉంది, అంతా ఆత్మే కాని విడిగా కనిపిస్తుంది, కాని ఏది విడిగా ఉన్నట్టు కాదు. ఏదో కాసేపు హడావిడి చేస్తారు మళ్లీ కనపడరు. చూసుకోండి  ఎవరున్నారు? మీ తండ్రులు ఉన్నారా? తాతలు ఉన్నారా? ముత్తాతలు ఉన్నారా? మీరు ఉంటారా?ఎవరున్నారు?

కానీ ఉంటామన్నట్టుగా మీరు ప్రవర్తిస్తున్నారు, అందుకే ఇవన్నీ తెలుసుకోవాలి. ఈ సొసైటీలోకి వచ్చి ధ్యానం చేస్తున్నా కూడా మీ దగ్గరికి రానివాళ్ళు ఈ సందేశాలు విననివాళ్ళు ఎంతసేపు లాభాలు ఆశిస్తారు, నాకు ఆ శక్తులు వచ్చాయి, ఆ అనుభవాలు వచ్చాయి అని గొప్పగా చెప్పుకుంటారు, ధ్యానం చేస్తే వచ్చేది అదే అనుకుంటారు. కాని ధ్యానంలో మీరు పరాకాష్టకు వెళ్తే నేనే అంతా, అంతా నేనే అనే స్థాయికి ఎదుగుతారు.

అందుచేత ఎవరూ వేరు వేరు కాదు. వాడు తెలియక అలా

ప్రవర్తించాడు, ఇంకో 50 జన్మలకో, 100 జన్మలకో తెలుసుకుంటాడు, నువ్వు తెలుసుకున్నావు కాబట్టి వాడు ఎలా ప్రవర్తించినా, నువ్వు అలా ప్రవర్తించకు, భార్య భర్తల్లో కూడా నా భర్త వినటం లేదు, నా భార్య వినటం లేదు అంటారు. ఎలా వింటారండి? మీరు 350 జన్మలు దాటి ఉన్నారు వాళ్ళు ఇంకా150, 200 జన్మల్లో ఉన్నారు. మీ ప్రవర్తనలా వాళ్ళ ప్రవర్తన ఎక్కడ ఉంటుంది?

వాళ్ళకి అవగాహన లేక అలా ప్రవర్తిస్తున్నారు. మీరు గొడవలు పడడం, తగువులు పడడం కాదు. జ్ఞానం పొందుతున్నారు కాబట్టి, ఇది అర్థం చేసుకోవాలి, ఖచ్చితంగా ఈ జన్మలోనే ప్రతి ఒక్కరు ఆ స్థాయికి రావాలి. ఎప్పుడైతే మీరు సాధన తీవ్రతరం చేస్తారో, ఆహార నియమాలు పాటిస్తారో మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గుతూ ఉంటుంది. మనసు ప్రాముఖ్యం ఎంత తగ్గుతూ ఉంటుందో ఆత్మ ప్రాముఖ్యం అంత పెరుగుతూ ఉంటుంది, ఆత్మ ప్రాముఖ్యం పెరిగే కొద్దీ ఆ భావంలోకి వస్తారు.

ఇలాంటి సందేశాలు మనల్ని ఎంతో ఆలోచింపచేస్తాయి, మన సాధన ఏ స్టేజ్ లో ఉందో మనకు తెలియపరుస్తాయి. ఎవరు చెప్పినా అదే చెప్తున్నారు. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క కోణంలో వివరిస్తారు. ఉదాహరణలు వేరైనా అందరూ చెప్పే సత్యం ఒక్కటే. అందుకే "ఏకం సత్ విప్రాః బహుధా వదంతి" అని అంటారు. అంటే సత్యం ఒకటే, ఎవరు చెప్పినా అదే చెప్పాలి. ఎవరి స్థాయిలో వాళ్ళు వివరిస్తూ ఉంటారు.

శంకరాచార్యుల వారు అద్వైతాన్ని బోధించారు. రెండు అని ఎక్కడా చెప్పలేదు. అన్నీ ఒకటే అన్నారు. కుండలన్నీ మట్టిలో నుంచే ఎలా వవచ్చాయో, ప్రపంచంలో ఉన్న సమస్తమూ ఆత్మ నుంచే వచ్చాయి అని అన్నారు. ఆత్మ కంటే వేరుగా ఇంకొకటి ఏమీ లేదు అని చెప్పారు. ఇంకా ఏం చెప్పారంటే? చూడబడుతున్న సమస్త ప్రపంచము తన ఆత్మయే అని తెలిసి ఆత్మజ్ఞాని జీవిస్తాడు అని చెప్పారు. అంతేకాని ద్వైతం ఎక్కడా చెప్పలేదు, ఆయన అద్వైతమే బోధించారు.

## ::11::

ఆదిశంకరాచార్యుల వారు అపార జ్ఞాన సంపన్నుడు. ఎంత గొప్పవాడంటే తన జ్ఞానంతో, జ్ఞాన పటిమతో భారతదేశాన్నే హిందూ మతంలోకి మార్చగలిగాడు. అటువంటి వారి సందేశాలు ఎవరైతే అక్షరాలా పాటిస్తారో వారి భవిష్యత్తు ఎంతో గొప్పగా మారిపోతుంది. వారి జీవితంలో ఊహించని లాభాలు పొంద గలుగుతారు. ఆయన ప్రతి మాటా కూడా అక్షర సత్యమే, సత్యము అంటే తిరుగు లేనిది అని అర్థం. ఆయన ఇచ్చిన ఇంకొక సందేశం తెలుసుకుందాం.

**"పరిపూర్ణమైన ఆత్మజ్ఞానం పొందిన జ్ఞాని అయిన యోగి, కంటి చేత సమస్తమైన విశ్వాన్ని తన ఆత్మ యందే చూస్తాడు. మరియు సమస్తమైన ప్రపంచమంతా కూడా ఒకే చైతన్యం అయిన తన ఆత్మగా దర్శిస్తాడు".**

శంకరాచార్యుల వారు ఏమన్నారంటే?

పరిపూర్ణమైన ఆత్మజ్ఞానం పొందిన అంటే ఇంక పొందవలసిన జ్ఞానం అంటూ ఏమీ ఉండదు. ఇటువంటి పూర్ణజ్ఞానం యోగాన్ని అభ్యసించిన వారే పొందగలరు.

యోగత్వము అంటే చిత్తవృత్తులు నిరోధించిడం అని పతంజలి మహర్షి చెప్పారు. అంటే ఎవరైతే చిత్తవృత్తులు నిరోధిస్తారో వారు యోగత్వాన్ని సాధిస్తారు, వారినే యోగి అంటారు అన్నారు. చిత్తవృతులు నిరోధించినవారు అంటే ఆలోచనలు లేని స్థితి పొందినవారు, అంటే మనసు పని చేయని స్థితి సంపాదించుకున్నవారు. ఈ యోగ స్థితి ఎలా వస్తుంది అంటే? పత్రి గారు స్పష్టంగా చెప్పారు "శ్వాస మీద ధ్యాస" ధ్యానం వల్ల మాత్రమే వస్తుంది తప్ప ఇంక దేని వల్ల రాదు అని.

గైడింగ్‌ల వల్ల కానీ, మ్యూజిక్ వల్ల కానీ, గుడాకేశలు, కర్మ విపాకలు, ఇలాంటివి ఎన్ని రకాలు చేసినా వారు యోగత్వాన్ని సాధించలేరు, చిత్తవృత్తుల్ని నిరోధించలేరు. మనసు పని చేయకుండా చేసుకోలేరు. అందుకే ఆయన

స్పష్టంగా చెప్పారు, జ్ఞాని అయిన యోగికే అది సాధ్యం అని. చిత్తవృత్తులు నిరోధించిన వాడికే, ఆలోచన లేని స్థితికి చేరుకున్న వాడికే అది సాధ్యం. అటువంటి జ్ఞానం పొందినవాడు మెల్లి మెల్లిగా, మెల్లి మెల్లిగా పరిపూర్ణమైన ఆత్మజ్ఞానం పొందుతాడు.

ఇప్పుడు మీరంతా ఆ పనే చేస్తున్నారు. మీరు మ్యూజిక్లు పెట్టు కోవట్లేదు, ఏ మాటలు వినట్లేదు. ఉదయాన్నే లేచి, స్నానాలు చేసి "శ్వాస మీద ధ్యాస" ఉంచి యోగాన్ని అభ్యసిస్తున్నారు, యోగి కావడానికి ప్రయ త్నిస్తున్నారు. అందుచేత కచ్చితంగా మీరు జ్ఞానం సంపాదించుకోవడమే కాదు, మెల్లి మెల్లిగా పెంచుకొని పరిపూర్ణమైన ఆ జ్ఞానాన్ని పొందగలుగుతారు.

ఇలా మీరు కొనసాగిస్తూ ఉంటే, జ్ఞానాన్ని అలా పెంచుకుంటూ ఉంటే, మీకు జ్ఞాన నేత్రం లభిస్తుంది. అలా జ్ఞాన నేత్రం సంపాదించుకుని దానితో పరిపూర్ణమైన ఆత్మజ్ఞానం పొందగలుగుతారు.

ఈ కళ్ళు తెరిస్తే బయట ఉన్నవే చూస్తారు. కానీ జ్ఞాన నేత్రం సంపాదించుకున్న వాళ్ళు సమస్తమైన విశ్వాన్ని అంటే 14 భువన భాండాలు, ఈ అనంతమైన సృష్టిలో ఎన్ని లోకాలు ఉన్నాయో, ఆ లోకాల్లో ఏమేమి ఉన్నాయో, సమస్తాన్ని కూడా కళ్ళు మూసుకుని ఆ జ్ఞాన నేత్రంతో సమస్త విశ్వాన్ని దర్శిస్తారు.

ఈ లోకాలన్నీ చూడాలంటే రాకెట్లు వేసుకొని వెళ్ళాలనుకుంటారు. కానీ సమస్త విశ్వము చూడడానికి రాకెట్లు వేసుకుని వెళ్ళక్కర్లేదు, కృష్ణుని బాల్యంలో మట్టి తిన్నాడని కృష్ణుని తల్లి యశోద నోరు తెరవమంటే ఆయన నోరు తెరిచాడు. నోరు తెరవగానే సమస్త భువన భాండాలు, అనంతమైన లోకాలు అన్ని ఆయనలోనే కనిపించాయి.

నీలోనే సమస్త లోకాలు ఉన్నాయి అని ఆ సంఘటన ద్వారా అందరికీ తెలియజేయడానికే వ్యాసుల వారు ఆ సంఘటన మనకి ఉదాహరించారు.

మరి ఈ శరీరంలో అన్ని లోకాలు ఉన్నాయి అంటే అది ఎలా సాధ్యం? ఎవరికి సాధ్యం? అంటే ఎవరికైతే జ్ఞాన నేత్రం ఉంటుందో వారు అన్నీ చూడగలుగుతారు. ఎక్కడికి వెళ్ళక్కర్లేదు! కూర్చున్న చోటే కూర్చుని సమస్తాన్ని వీక్షించగలుగుతారు.

జ్ఞానం ఎందుకు సంపాదించుకోవాలి? అనే ప్రశ్న వేసేవాళ్ళు కూడా మన సొసైటీలో ఉన్నారు. జ్ఞానం అంటే సామాన్యమైనది కాదు. అందుకే జ్ఞానం సంపాదించుకున్నవారి కంటే గొప్పవారు ఎవరూ లేరు అంటారు. జ్ఞానం సంపాదించుకునే కొద్దీ, జ్ఞానం పెరిగి కొద్దీ మూడో కన్నే కాదు దానికంటే గొప్పదైనటువంటి జ్ఞాన నేత్రాన్ని కూడా సంపాదించుకుంటారు, సమస్త విశ్వాన్ని దర్శిస్తారు. సృష్టిలో ఉన్నవన్నీ తెలుసుకుంటారు. సృష్టిలో వారు పొందలేని జ్ఞానం అంటూ ఏమీ ఉండదు. పరిపూర్ణమైన ఆత్మజ్ఞానం సంపాదించుకోవడం అంటే! అదే.

అందుకే ప్రతి ఒక్కళ్ళు జ్ఞానం సంపాదించుకోవాలి, జ్ఞానవంతులు అవ్వాలి. అటువంటి పరిపూర్ణమైన జ్ఞానం పొందిన యోగి జ్ఞానం అనే కంటితో సమస్తమైన విశ్వాన్ని తన ఆత్మ యందే చూస్తాడు. ఇంక వాడికి తెలియనిదంటూ ఏముంది? అందుకే పెద్దలు అంటారు సృష్టిలో నువ్వు ఉన్నావు, నీలో సృష్టి ఉంది అని. మనలో సృష్టి అంతా ఉండడం ఏమిటి! ఇదే అందరికీ ఆశ్చర్యం వేస్తుంది. నీలో ఆత్మ ఉంటే సృష్టి అంతా ఉన్నట్టే!

శంకరాచార్యుల వారు ఇంకా ఏమన్నారంటే? మరి అటువంటి జ్ఞాని సమస్తమైన ప్రపంచం అంతా కూడా ఒకే చైతన్యం అయిన తన ఆత్మగా దర్శిస్తాడు అన్నారు. ఈ ప్రపంచంలో 84 లక్షల జీవరాశులు ఉంటే, ఒక్కొక్క రకంలో కోటాను కోట్లు ఉంటాయి, మరి మొత్తం చూస్తే ఎన్ని ఉంటాయి ఆలోచించండి. ఒక చీమను తీసుకుంటే ఎన్నో కోట్లు ఉంటాయి, ఒక దోమను చూసుకుంటే ఎన్నో కోట్లు ఉంటాయి, అలా 84 లక్షలు రకాలలో చూస్తే

కోటాను కోట్లు ఉంటాయి! మరి అవన్నీ కూడా ఒకే చైతన్యమైన తన ఆత్మగా దర్శిస్తాడు జ్ఞాని.

అంటే ఏ ఆత్మ అయితే తనలో ఉందో, ఏ చైతన్యమైతే తనలో ఉందో అదే చైతన్యం అన్నిటిలోనూ ఉంది, సమస్త జీవరాశిలోనూ ఉంది, అని దర్శిస్తాడు. అలా దర్శించి "అంతా నేనే, నేనే అంతా" అన్నది అర్థం చేసుకుంటాడు.

'నేనే అంతా, అంతా నేనే' అని అర్థమైన రోజున ఏ జీవిని హింసించడు, ఏ జీవిని భక్షించడు, ఎవరిని అవమానించడు, ఎవరినీ ద్వేషించడు, ఎవరి మీద కక్షలు పెంచుకోడు, వాళ్ళ స్థితికి అంతే అని జాలి పడతాడు. పూర్ణ జ్ఞానం పొందినప్పుడు ఎవరి ప్రవర్తన అయినా ఆ రకంగానే మారిపోతుంది. ఇంకా వేరు వేరుగా చూస్తున్నారు అంటే వారి జ్ఞానం చాలా క్రింది స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు.


## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ధ్యాన యజ్ఞంలో రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

::12::

**"వెళ్ళవలసింది ఏ వైపుకో తెలియక తిరుగుతున్న మానవుడు సూర్యోదయం కాగానే తూర్పు పడమరలు తెలిసి, వెళ్ళవలసిన దిక్కు ఏ వైపో తెలుసుకుని, తప్పు దారిని వదిలివేసినట్లుగా, ఆత్మజ్ఞానం నేను, నాది అనే భ్రాంతిని అంతమొందిస్తుంది".**

మీరు చీకట్లో ప్రయాణిస్తున్నప్పుడు ఏదో ఒక జంక్షన్ వస్తే, అక్కడ ఎవరూ లేకపోతే, మీకు ఏ వైపుకి వెళ్ళాలో తెలియక ఆగిపోతారు. లేదా ఏదో అంచనా వేసుకుని ఆ చీకట్లో ఏదొ ఒక ప్రక్కకు ప్రయాణం చేస్తారు.

ఒక్కొక్కసారి లొకేషన్ పెట్టుకున్నా అర్థం కాక గందరగోళ పడుతూ ఉంటారు. మీరు ఉత్తరం వైపుకి వెళ్ళాలి కానీ చీకట్లో తూర్పు వైపుగా ప్రయాణించొచ్చు. ఆ కూడలి అలా ఉంటుంది. కొంత దూరం వెళ్ళాక సూర్యోదయం అయ్యి వెలుతురు వస్తే అర్థమవుతుంది నేను వెళ్ళవలసింది తూర్పుకి కాదు ఉత్తరానికి అని. మరి అలా ఎప్పుడైతే తప్పు దారిన వెళ్తున్నట్టు మీకు అర్థమవుతుందో అప్పుడు ఆగిపోయి సరైన దారిలో పయనించి మీ గమ్యం చేరుకుంటారు.

తప్పు దారిన పయనిస్తే గమ్యం చేరుకోలేరు, ప్రయాణం ఆలస్యం అయిపోతుంది, మీ శ్రమ వృధా అవుతుంది, పెట్రోలుకి ఎంతో ఖర్చు అవుతుంది, ఎంతో సమయం వృధా అవుతుంది.

ఆ ప్రయాణంలో చికాకు కూడా వస్తుంది. మళ్లీ అంత దూరం వెనక్కి రావాలంటే ఎలా ఉంటుందో! ఎన్ని ఇబ్బందులు పడాలో ఒక్కసారి ఆలోచించండి.

అలాగే అజ్ఞానంలో ఉన్నవాళ్ళు నేను, నాది, మాది అనే భ్రాంతిలో జీవిస్తూ ఉంటారు. అంటే నేను పురుషుడిని, నేను స్త్రీని, నేను ఈ కులస్తుడిని, ఈ మతస్తుడిని, ఈ ప్రాంతవాసిని అనే భావాలతోటే ఉంటారు. మరి ఈ

భావాలతో ఉన్నంత కాలం వారి జీవిత ప్రయాణంలో వారి గమ్యాన్ని చేరుకోలేరు, వారి లక్ష్యాన్ని సాధించలేరు.

చీకట్లో దారి తప్పినోళ్ళలాగా వెలుతురులో కూడా వీరు దారి తప్పారు. ఎందుకు? అజ్ఞానంలో ఉండడం వల్ల. అజ్ఞానం వల్ల నాది, మాది అంటారు. నాది అంటే నేను సంపాదించుకున్న డబ్బు, నా ఆస్తులు నా బంగారం, నాషేర్లు నా బిల్డింగలు, నాఇల్లు అంటారు. మరి ఈ శరీరమే నువ్వు కానప్పుడు నీది అన్నది ఏముంటుంది? మీది అన్నది ఏముంటుంది?

పత్రి గారు అందరికీ ఇంత జ్ఞానాన్ని అందిస్తే అది అర్థం చేసుకోకుండా నాది, మాది అనుకుంటూ.. వాటి కోసం సంకల్పాలు పెడుతూ.. ఎంతో జీవితాన్ని వృథా చేసుకుంటూ.. చీకట్లో దారి తప్పిన వాళ్ళలాగా జీవిస్తున్నారు. వెళ్ళవలసింది ఏ దారో కూడా అర్థం కావట్లేదు వాళ్ళకి. అందుకే పత్రిగారు నామాలు వద్దన్నారు. నామాలు వద్దంటారేమిటి పత్రిగారు! బొట్లు ఎందుకు తీసేయమంటారు? అని చాలామందికి అర్థం కాలేదు.

ఆయన నామాలు తీసేయమంటే బొట్లు తీసేయమని కాదు. నాది, మాది అనే భ్రాంతి తొలగించుకోమన్నారు. ఆ భ్రాంతి పోతే కానీ ఈ జీవిత ప్రయాణంలో సరైన దారిలో పయనించలేరు.

మానవులు దాన్ని వదలట్లేదు సరికదా! వాటి కోసమే ఈ సంకల్పాలు పెడుతున్నారు. నా భార్య, నా భర్త, నా పిల్లలు ఎంత బలంగా ఉన్నాయో చూడండి. ఈ దేహం నేను, ఈ దేహం ద్వారా సంపాదించుకున్నవన్నీ నావి అంటారు. అసలు నువ్వే లేకపోతే, నీవనేవి ఎక్కడ ఉంటాయి? ఈ తప్పు దారిలో నువ్వు పయనిస్తున్నావు. ఇది తప్పు దారని ఎప్పుడు తెలుస్తుంది? ఈ నాది, మాది పోయినప్పుడు? ఎప్పుడు పోతాయి? నువ్వు ఆత్మజ్ఞానం సంపాదించుకున్నప్పుడు.

మీరు ఈ భూమి మీదకి వచ్చింది, ఈ మార్గంలోకి వచ్చింది జ్ఞానం

సంపాదించుకోవడానికే, అంతకంటే ఏమీ కాదు. అందుకే పత్రి గారు శంకరాచార్యుల వారు చెప్పిన ఒక శ్లోకం చెప్పారు.

**"భగవద్గీతా కించిదధీతా**
**గంగాజలలవకణికాపీతా**
**సకృదపి యేన మురారి సమర్చా**
**క్రియతే తస్య యమేన న చర్చా?"**

తా:- భగవద్గీతను కొంచెమైనా అధ్యయనం చేయాలి అంటే స్వాధ్యాయం చేయాలి. గంగా నది జలములోని ఒక బిందువైనా పానం చేయాలి అంటే ధ్యానం చేయాలి. ధ్యానం చేస్తే ఆ కాస్మిక్ ఎనర్జీ తీసుకుంటారు. అది కొంతైనా తీసుకోవాలి అంటే సాధన కూడా చేయాలి.

అలాగే సకృదపి యేన మురారి సమర్చ అంటే ఆత్మజ్ఞానులతో కనీసం ఒక్కసారైనా చర్చించాలి అంటే సాంగత్యం చేయాలి. దాన్నే సజ్జన సాంగత్యం అంటారు. అంటే శంకరాచార్యుల వారు సాధన, స్వాధ్యాయం, సాంగత్యం ఈ మూడు చేయాలని ఈ శ్లోకం ద్వారా వివరించారు. అదే పత్రి గారు మనకి వివరించడం జరిగింది.

ఈ మూడు మీరు చేసినట్లయితే అలాంటి వారి గురించి యముడు పట్టించుకోడు అన్నారు. యముడు పట్టించుకోడు అంటే దానికి కూడా అంతరార్థం ఉంది. ప్రతి ఒక్కరూ శరీరం వదిలిన తర్వాత పైలోకాలకి వెళ్తారు, వెళ్ళినప్పుడు అక్కడ మాస్టర్లు కౌన్సిలింగ్లు చేస్తారు.

ఆ మాస్టర్లు మిమ్మల్ని ప్రశ్నిస్తారు. నువ్వు భూమి మీదకి ఏమి చేయడానికి వెళ్ళావు? ఏమి చేసి వచ్చావు? నువ్వు వెళ్ళిందేమో జ్ఞానం పొందడానికి, మరి జ్ఞానం పొందే ప్రయత్నం చెయ్యకుండా నాది, మాది అంటూ వాటి వెనకాల పడ్డావు, వాటి కోసమే అన్నీ చేశావు. నీ జన్మ వృధా చేసుకున్నావు అని గట్టిగా అడుగుతారు.

ఈ మూడు నువ్వు ఆచరించినప్పుడు యముడు అంటే పైలోకంలో ఉన్నవాళ్ళు ఎవ్వరు నిన్ను నిలదీయరు, గద్దించరు అని శంకరాచార్యుల వారు చెప్పింది మనకు పత్రి గారు వివరించారు. ఎందుకు నిలదీయరంటే? ఈ మూడు చేస్తే వాళ్ళకి అన్ని తెలుస్తాయి. ఇక్కడ నాది అన్నది ఏదీ లేదు, నేను అన్నది కూడా లేదు, ఈ శరీరం నేను కాదు, ఈ శరీరంతో పాటు వచ్చేవన్నీ నావి కావు, నేను ఆత్మను. నేను పరబ్రహ్మను. సమస్తమూ నేనే, సమస్తమూ నావే అని తెలుసుకుంటారు.

మీరు అజ్ఞానంలో ఉండడం వల్ల దారి తప్పిన వాళ్ళలా ఈ పనులన్నీ చేస్తున్నారు కానీ ఈ మూడు చేసి, తప్పు దారి వదిలేసి, జ్ఞానం సంపాదించుకుంటే నేను, నాది, మాది అనే భ్రాంతిని వదిలేస్తారు, సరైన దారిలో పయనిస్తారు, లక్ష్యాన్ని సాధిస్తారు. అదే ఇక్కడ శంకరాచార్యుల వారు ఈ సందేశం ద్వారా మీకు చెప్పడం జరిగింది.

మీరు అజ్ఞానంలో ఉన్నంతసేపు ఈ నేను, నాది అనే భ్రాంతిలోనే ఉంటారు. చేయవలసినవి కాకుండా చేయకూడనివే చేస్తూ ఉంటారు. వాటికే ప్రాముఖ్యం ఇస్తారు. మీ సమయాన్ని, శక్తిని, వాక్కుని అన్నీ కూడా దానికే కేటాయిస్తారు, జీవితాన్ని ఎంతో నష్టపరుచుకుంటారు. అందుచేత జ్ఞానం పొందడం చాలా ముఖ్యం. మీరు జ్ఞాని అయితే మీ జీవితానికి పరిష్కారం లభించినట్టే.

::13::

**"అడవిలో చెట్టు మోడును దూరం నుంచి చూసినప్పుడు పురుషుని వలె కనిపించినట్లుగానే, మాయ చేత బ్రహ్మం అయిన ఆత్మలో జీవుడు అనేది కల్పించబడింది. జీవుని యొక్క నిజ స్వరూపం ఆత్మ అని తెలుసుకున్నప్పుడు, మానవుడు జీవుడు కాదు అనేది అర్థమై జీవత్వ భ్రాంతి తొలగింపబడుతుంది".**

ఎవరైనా అడవిలో చీకట్లో ప్రయాణం చేస్తున్నప్పుడు కొంచెం దూరం నుంచి చూస్తే, ఒక చెట్టు మోడు పురుషుని వలె అంటే అక్కడ ఒక మనిషి నిలచున్నట్టుగా కనిపిస్తుంది.

మరి నిజంగా అది మానవుడా? అంటే కాదు. ఎవరు? అంటే ఒక చెట్టు మోడు. అది ఎండిపోయి మోడుగా తయారయ్యి ఉండవచ్చు, లేదా ఎవరైనా నరికేసి ఆ మోడు వదిలేసి ఉండొచ్చు. మరి దాన్ని దూరం నుంచి ఆ చీకట్లో చూసినప్పుడు మానవుడుగా అనిపించి భ్రాంతి చెందుతారు. కానీ కొంచెం దగ్గరికి వెళ్ళినప్పుడు అర్థమవుతుంది అది మానవుడు కాదు చెట్టు మోడు అని. వారు ఆశ్చర్యపోతారు అరే నేను నిజంగా ఎవరో మనిషి అనుకున్నాను, కానీ కాదన్నమాట అని అర్థం చేసుకుంటారు.

అలాగే మాయా ప్రభావంలో ఉన్న మానవులు బ్రహ్మం అయిన ఆత్మను జీవుడిగా భావిస్తున్నారు. ఆత్మే పరబ్రహ్మ అని మనకు పత్రిగారు చెప్పారు. ప్రతి ఒక్కరి శరీరంలో ఉన్నటువంటి ఆత్మ సామాన్యమైనది కాదు. అది ఈ సృష్టిని సృష్టి చేసినటువంటి, సృష్టిని నడిపిస్తున్నటువంటి, ఈ సృష్టికి ఆధారమైనటువంటి పరబ్రహ్మ. అది తెలుసుకోలేక ఆత్మ శరీరంలో ఉండడం వల్ల జీవుడిగా భావిస్తున్నారు. ఈ ఆత్మ జీవుడు అనేది కల్పించబడింది. అంటే కల్పితం. అది జీవుడు కాదు, అది బ్రహ్మం, సృష్టిలో మొత్తం అన్నిటికంటే గొప్పవాడైనటువంటి ఆ పర బ్రహ్మే ఈ ఆత్మ. మాయా ప్రభావం వల్ల అది జీవుడు, మానవుడు అనుకుంటున్నారు.

ఆ చెట్టు మోడును చీకట్లో మానవుడు అనుకున్నట్టుగానే, ఈ ఆత్మను జీవుడు అనుకుంటున్నారు. ఇది మాయా కల్పితం. మాయ వల్ల అలా అనిపిస్తుంది, కానీ ఎవరైతే పత్రి గారు మనకు అందించినటువంటి ఈ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం తీవ్రంగా చేస్తారో! వారు ఈ మాయా ప్రభావానికి కారణమైనటువంటి మనసు యొక్క ప్రాముఖ్యం పూర్తిగా తొలగించుకుని అది జీవుడు కాదు ఆత్మ అని తెలుసుకుంటారు. ఎప్పుడైతే తెలుసుకుంటారో! వారిలో ఆ జీవత్వ భ్రాంతి అంటే నేను మానవుడిని అన్న భావం పోతుంది.

ఎప్పుడైతే జీవత్వ భ్రాంతి పోతుందో అంటే మానవుడు అన్న భావం పోతుందో నేనే ఆ దైవాన్ని, నేనే ఆ పరబ్రహ్మను అన్నది అర్థమవుతుంది. అప్పటిదాకా మానవుడిగా జీవించాడు, దేవుడు వేరే ఉన్నాడు అనుకున్నాడు, కానీ ఆ మానవుడు అన్న భ్రాంతి పోయేసరికి నేను మానవుడిని కాదు నేను ఆత్మను, నేను పరబ్రహ్మాన్ని అని అర్థం చేసుకున్నప్పుడు ఆశ్చర్యపోతాడు.

దేవుడు వేరే ఉంటాడు అనుకుంటూ, నేను మానవుడిని అనుకుంటూ, కష్టాలు ఎందుకు వస్తున్నాయో తెలియక, వచ్చిన కష్టాలు తొలగించుకోవడానికి రకరకాల పాట్లు పడి చివరకు ఏ దిక్కు లేని వాడికి దేవుడే దిక్కు అనుకుంటూ ఎవరికి నచ్చిన దేవుడిని వాళ్ళు ఆశ్రయించి రకరకాల ఆరాధనలు చేస్తున్నారు. అయినా కష్టాలు తొలగకపోతే ఆ దేవుడిని, మతాలను కూడా మార్చి నానా తిప్పలు పడుతున్నారు.

కానీ ఈ స్థితికి వచ్చిన వారు అర్థం చేసుకుంటారు. నేను మానవుడిని కాదు, నేను ఏ దైవాన్నైతే ఇప్పటిదాకా ప్రార్థించానో, ఆరాధించానో, కొలిచానో, కోరికలు కోరానో ఆయనే నేను అని తెలుసుకుంటాడు.

దేవుడు, మానవుడు వేరే అయితే ఆ దేవుడిని ప్రార్థించొచ్చు. అప్పుడు ఆ దేవుడు వచ్చి ఈ మానవుడిని ఆదుకుంటాడు, కాపాడతాడు, రక్షిస్తాడు, ఆశీర్వదిస్తాడు. కానీ, ఎవరినైతే వీడు ప్రార్థిస్తున్నాడో ఆయనే తాను. "అహం

బ్రహ్మాస్మి" అని వేదాల్లో చెప్పారు కదా? తానే ఆ దేవుడైనప్పుడు, తానే ఆ బ్రహ్మము అయినప్పుడు ఇంక ఎవరిని ప్రార్థిస్తాడు?

ఇప్పుడు ప్రపంచంలో  అందరూ దేవుళ్లే! వేరే దేవుళ్ళు ఎక్కడా లేరు. పత్రిగారు అంటారు కదా? పూజ చేసే పూజారే దేవుడు, పూజింపబడేది విగ్రహము,  భ్రాంతితో అదే దేవుడు అనుకుంటున్నారు. నేను జీవుడిని అనే భ్రాంతితో అంటే మానవుడిని అనే భ్రాంతితో, ఈ పనులన్నీ చేస్తున్నారు.

అందుకే వేమన అన్నాడు పూజ చేయగా చేయగా పూజారి అవుతావు. ఈ సృష్టిలో పూజించ తగ్గ వస్తువు నువ్వే. ఎక్కడ పూజ చేస్తావు? ఎవరిని పూజ చేస్తావు? నిన్ను నువ్వే పూజ చేసుకోవాలి అని ఎంతో స్పష్టంగా చెప్పారు.

మరి ప్రపంచంలో ఇన్ని కోట్ల మంది జనం ఉన్నా అందరూ అజ్ఞానంలోనే ఉన్నారు. మరి నువ్వే దేవుడివి అని మీరు చెప్తే చాలామంది నేనే దేవుడినైతే నాకు కష్టాలు ఎందుకు వస్తాయి? అంటారు.

నేను మానవుడిని అనుకుంటూ,  అందరూ వేరు వేరు అనుకుంటూ, నేను పురుషుడు అనుకుంటూ, వాళ్ళు స్త్రీలు అనుకుంటూ, నేను ఈ కులం అనుకుంటూ, వాళ్ళది వేరే కులం అనుకుంటూ, నాది ఈ మతం అనుకుంటూ, వాళ్ళది వేరే మతం అనుకుంటూ, వాళ్ళని ద్వేషిస్తూ, అసూయ పడుతూ, వాళ్ళ మీద కక్ష తీర్చుకోవాలని చేయకూడని పనులు చేస్తూ, తప్పులు చేస్తూ, పాపాలు చేస్తూ, వాటి ఫలితంగా కష్టాలు తెచ్చుకుని నానా బాధలు అనుభవిస్తున్నారు.

అలా భాధలు పడుతూ,  బయట పడడం నావల్ల కాదు,  దేవుడి వల్లే అవుతుంది అంటూ నచ్చిన దేవుడిని ఆరాధన చేస్తున్నారు.

శంకరాచార్యుల వారు ఏమన్నారంటే దూరం నుంచి చెట్టు మోడుని చూసి మానవుడు మనిషి అనుకుంటాడు. నిజంగా అక్కడ ఉన్నది మానవుడు కాదు. కానీ దూరం నుంచి చూడడం వల్ల అలా భ్రాంతి చెందాడు. దగ్గరికి

వెళ్లి చూస్తే అర్థమైంది అది మానవుడు కాదు మోడు అని.

అలాగే చీకట్లో తాడును చూసి కొంతమంది పాము అనుకుంటారు. ఇంటి ముందు ఏదైనా తాడు కొంచెం మెలికలు తిరిగి ఉంటే కంగారులో భయపడి పాము పాము అని అరుస్తారు. వీడి అరుపులకి ఎవరైనా బ్యాటరీ లైట్ పట్టుకొని వచ్చి చూస్తే అది పాము కాదు తాడు, అదంతా భ్రాంతి అన్నది అర్థమవుతుంది.

అలాగే అజ్ఞానం అనే చీకట్లో ఈ మానవుడు దేవుడు వేరే అనుకుంటున్నాడు, తాను మానవుడినే అనుకుంటున్నాడు. కానీ ఎవరైతే పత్రి గారు చెప్పినటువంటి  ధ్యాన సాధన తీవ్రంగా చేస్తారో వారికి మెల్లి మెల్లిగా ఈ మాయ అనే ప్రభావంతో ఉన్నటువంటి మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గుతూ ఉంటుంది. అలా తగ్గి  కొన్నాళ్ళకి ఆ మనసు శూన్యం అవుతుంది. మెల్లిగా ఆ మాయ నుంచి బయట పడతారు.

మరి ఆ మాయనే క్రిస్టియన్లు సైతాన్ అంటారు. ముస్లింలు నఫ్సల్ అమ్మారా అంటారు. హిందువులు మాయ అంటారు. మరి ఆ మాయ తొలగగానే, అజ్ఞానం పోగానే ఆ దైవం నేనే అని అర్థమవుతుంది. తన తెలివి తక్కువ తనానికి ఆశ్చర్యపోతాడు.

మరి ఆ మాయ తొలగాలంటే మీ సాధన తీవ్రతను ఇంకా పెంచాలి, మనసు నిశ్చలం అవ్వాలి, తర్వాత నిర్మలం అవ్వాలి, తర్వాత పరి నిర్మలం అవ్వాలి, మహా పరినిర్మలం అవ్వాలి, మెల్లిగా శూన్యం అవ్వాలి, పరిశూన్యం అవ్వాలి, మహా పరిశూన్యం అవ్వాలి అప్పుడు తెలుస్తుంది నేను జీవుడ్ని కాదు నేనే ఆ దేవుడిని అని.

అలాంటి స్థితికి చేరుకున్న వాళ్ళు నేనే దేవుడిని అని చెప్తారు. ఒక షిరిడీ బాబా కానీ, సత్యసాయి బాబా కానీ అలా తెలుసుకున్నవారే. వాళ్ళు ఇది చెప్తే చాలా మంది ఆక్షేపించేవారు. వారు దేవుడినని చెప్పుకుంటున్నాడు,

ఎలా దేవుడైపోతాడు అంటారు. కానీ చెప్పుకునే వాడూ దేవుడే, ఆ విమర్శించేవాడు కూడా దేవుడే. పిచ్చోళ్ళు తెలియక అలా విమర్శిస్తారు. దీన్నే మాయలో పడడం అంటారు.

నువ్వు జీవుడు అనుకున్నంత కాలం నువ్వు మాయలో ఉన్నట్టే. ఎప్పుడైతే నేను జీవుడిని కాదు నేనే ఆ దైవాన్ని, 'అహం బ్రహ్మోస్మి' అన్న అవగాహన కలుగుతుందో అప్పుడు నువ్వు మాయ నుంచి బయట పడినట్టు. ఈ మాయలో ఉన్నంత కాలం నువ్వు దుఃఖ పడతావు. ఈ మాయ నుంచి నువ్వు బయట పడినప్పుడు నీకు దుఃఖమే ఉండదు.

మాయ తొలగినప్పుడు నేనే కాదు అందరూ దేవుళ్లే, అంతా నేనే అని తెలుస్తుంది. ఇది అర్థమైనప్పుడు ఎవరిని ద్వేషిస్తావు? ఎవరి మీద అసూయ పడతావు? ఎవరి మీద కక్ష కడతావు? ఎవరి కంటే గొప్పగా ఉండాలని చూస్తావు? అంతా ఒకటే అయినప్పుడు ప్రవర్తన ఎంతో మారిపోతుంది.

ఒకసారి కాశీలో శంకరాచార్యులవారు గంగా నదిలో స్నానం చేసి వస్తుంటే దారిలో ఛండాలుడు ఎదురయ్యాడు. శిష్యులంతా వాడిని తప్పుకో తప్పుకో అన్నారు. ఛండాలుడిని ముట్టుకుంటే వీళ్ళు అపవిత్రం అయిపోతారని ముట్టుకోరు. దూరం నుంచే చేతులతోటి తప్పుకో తప్పుకో అన్నారు. వాడు తప్పుకోడు, ఆఖరికి శంకరాచార్యులవారు కూడా ఛండాలుడిని తప్పుకో అన్నారు.

అప్పుడు ఆ ఛండాలుడు అన్నాడు. దేన్ని తప్పుకోమంటున్నావు? ఏ పంచభూతాలతో నీ శరీరం తయారు చేయబడిందో అదే పంచభూతాలతో నా శరీరం కూడా తయారు చేయబడింది. ఏ జీవుడు అయితే నీ శరీరంలో ఉన్నాడో అదే జీవుడు నా శరీరంలో కూడా ఉన్నాడు. నీకూ నాకూ తేడా ఏమిటి? ఏమిటి నీలో ఉన్న గొప్ప? నన్ను ఎందుకు తప్పుకోమంటున్నావు? అని అడిగే సరికి శంకరాచార్యుల వారికి అర్థమైంది.

వెంటనే ఆ ఛండాలుడి కాళ్ళ మీద పడ్డాడు. ఆయన సాక్షాత్తు శివ

స్వరూపము, నా కళ్ళు తెరిపించడానికే ఆయన ఇలా ఈ వేషంలో నాకు కనిపించారు అని అర్థం చేసుకొని ఆయన పూర్తిగా మాయలోనుంచి బయట పడ్డాడు.

ఆయన జీవితంలో ఇలాంటి సంఘటనలు జరిగాక ఆయన ఇలాంటి సందేశాలన్నీ ఇవ్వడం జరిగింది. ఒక్కొక్క అనుభవంతో ఆయన ఒక్కొక్క గ్రంథం వ్రా సేవారు. వాటినే ఇప్పుడు మనం తెలుసుకుంటున్నాం. నేనే దేవుడిని అనే ఈ సత్యం తెలుసుకునేదాకా జన్మలు తీసుకుంటూనే ఉండాలి. లేకపోతే ఎన్ని చేసినా జన్మలు తప్పవు, దుఃఖం తప్పదు, రోగాలు తప్పవు, కష్టాలు తప్పవు, బాధలు తప్పవు.

దీన్ని బట్టి మాయలోనుంచి బయట పడడానికి మీ సాధన ఎంత తీవ్రంగా చేయాలి అన్నది అర్థం చేసుకోండి. అనవసరమైన వాటికి సమయాన్ని వృధా చేయకుండా, ఆ సమయాన్ని సత్యాన్ని తెలుసుకోవడానికి వినియోగించు కోండి.

మార్నింగ్ జూమ్ లో పాల్గొన్న వారికి జ్ఞానంలో పట్టు వస్తుంది, భీమవరం 3 రోజుల ధ్యాన యజ్ఞంలో పాల్గొన్న వారికి ధ్యానంలో పట్టు వస్తుంది. ధ్యానంలో పట్టు అంటే తెలుసుకున్న వాటిని అనుభవంలోకి తెచ్చుకుంటారు. ఈ రెండిటి వల్ల జీవిత లక్ష్యాన్ని సాధిస్తారు.

## ::14::

**"ఆత్మ నిజానికి ఎల్లప్పుడూ లోపల ప్రాప్తించే ఉన్నప్పటికీ అజ్ఞానం చేత పొందబడటం లేదు. ఆ అజ్ఞానం నశించగానే కంఠమునందలి ఆభరణం పోయిందని తెలివి తక్కువతనం చేత ఇల్లంతా వెతికి ఆఖరికి మెడలోనే ఉందని తెలుసుకున్నట్లుగా, ఆత్మ లోపలే ప్రాప్తించిందిగా ప్రత్యక్షం అవుతుంది".**

ఇక్కడ అజ్ఞానంలో ఉంటే మానవుడి ప్రవర్తన ఎలా ఉంటుంది? అలాగే జ్ఞానం సంపాదించుకుంటే వారి ప్రవర్తన ఎలా ఉంటుంది? అన్నది శంకరాచార్యుల వారు వివరించారు. ఈ శరీరంలో ఉన్నటువంటి ఆత్మ నిజానికి ఎల్లప్పుడూ లోపలే ఉంది, ఎక్కడో లేదు. పుణ్యక్షేత్రాల్లో కానీ, గుళ్ళల్లో కానీ, కాశీలో కానీ, మక్కాలో కానీ, జెరూసలేంలో కానీ లేదు. ఆత్మ అంటే భగవంతుడు. అందరూ ఈ భగవంతుడిని అన్ని చోట్ల వెతుకుతున్నారు. కానీ, ఆ భగవంతుడు ప్రతి ఒక్కరి శరీరంలో ఉన్నాడు.

మరి ఉన్నా అజ్ఞానం చేత ఆయన్ని పొందలేకపోతున్నారు, తెలుసు కోలేక పోతున్నారు. ఆ ఆత్మ కోసం ఎక్కడెక్కడో తిరుగుతున్నారు, ఎక్కడెక్కడో వెతుకుతున్నారు. శంకరాచార్యుల వారు దీనికి ఉదాహరణ కూడా చెప్పారు. ఒక ఆవిడ మెడలో హారం వేసుకుని, వేసుకున్న సంగతి మర్చిపోయింది. ఎక్కడ పెట్టాను అని బీరువాలు, సొరుగులు వెతికింది, మంచం మీద దుప్పట్లు తీసి చూసింది, ఇల్లంతా వెతికింది కానీ దొరకలేదు. చివరికి ఆవిడ చెయ్యి మెడ మీద పడడం కానీ, అద్దం దగ్గరి వెళ్ళి అందులో చూసుకోవడం గాని జరిగింది. చూసుకుని అరే ఇంతసేపు నా మెడలోనే పెట్టుకుని ఇల్లంతా వెతికానే అని ఆశ్చర్యపోయింది.

నార్త్ ఇండియాలో చార్‌ధామ్ అనే ప్రాంతానికి చాలామంది కాలినడకన, గుర్రబండ్ల మీద ప్రయాణించి వెళ్తారు. అక్కడికి కార్లు, బస్సులు వెళ్ళవు. దారిలో ఆహారం కూడా దొరకదు. అయినా సరే భగవంతుని

పొందాలని కష్టపడి వెళ్తూ ఉంటారు. కానీ ఎన్ని కష్టాలు పడినా పొందలేరు. ఎందుచేతనంటే ఆ భగవంతుడు వారి శరీరంలోనే ఉన్నాడు. మరి శరీరంలో ఉన్న భగవంతుడిని వేరే ప్రదేశాలలో, పుణ్యక్షేత్రాలలో తిరిగి వెతికితే ఎలా దొరుకుతాడు?

ఆవిడ మెడలో ఉన్న హారము ఇల్లంతా కాదు, ఊరంతా తిరిగి వెతికినా దొరకదు. మొత్తం మీద ఎవరో చెప్పడం వల్లో, ఏ అద్దంలో చూసుకోవడం వల్లో, లేదా మెడ తడుముకోవడం వల్లో తెలుస్తుంది. అప్పుడు అయ్యయ్యో ఎంత శ్రమ పడ్డాను అని అనుకుంటుంది.

అలాగే మానవుడు అజ్ఞానం చేతే తన శరీరంలో ఉన్నటువంటి ఆ భగవంతుడిని తెలుసుకోలేక పోతున్నాడు. ఆ అజ్ఞానం నశిస్తే ఆ భగవంతుడు ఎక్కడో లేడు నా శరీరంలోనే ఉన్నాడు అన్న విషయం తెలుసుకుని ఆశ్చర్యపోతాడు.

కనిపించక ఇల్లంతా ఏదో ఒక గంట తిరిగినట్టు అని ఉదాహరణకు చెప్పుకున్నాం కానీ, ఆ భగవంతుడిని పొందడానికి 350 నుంచి 400 జన్మలు వెతుకుతున్నారు మానవులు. అజ్ఞానం తొలగించుకోకపోతే, జ్ఞానం సంపాదించు కోకపోతే ఇంకో 500 జన్మలు ఎత్తినా వారికి భగవంతుడు దొరకడు. అందుకే ప్రతీ ఒక్కరికి అజ్ఞానం తొలగించుకోండి, జ్ఞానం సంపాదించండి అని చెబుతున్నాం. జ్ఞానం సంపాదించుకుంటే ఆ భగవంతుడిని మీ శరీరంలోనే మీరు దర్శిస్తారు. మీ శరీరంలోనే ఆయన్ని మీరు పొందుతారు. ఆయన్ని మీరు పొందితే ఇంక మీకు జన్మలే అవసరం లేదు. దుఃఖమే ఉండదు.

అందుచేత జ్ఞానం సంపాదించుకుంటే, ఆ జ్ఞాన నేత్రంతో ఆయన మీ శరీరంలోనే ఉన్నాడు అన్నది మీకు తెలుస్తుంది. ఆయన్ని అనుభూతి చెందుతారు. అక్కడి నుంచి మీ ప్రవర్తన, మీ పనులు, మీ మాటలు అన్నీ పూర్తిగా మారిపోతాయి. ఇంక అంతకన్నా కావాల్సింది ఏమీ లేదు. ఇన్ని

జన్మలు కష్టపడ్డారు, అలిసిపోయారు కూడా. మీరు ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు, మీరు ఉన్న చోటనే ఉండి హాయిగా ఈ నాలుగు పనులు చేయండి.

1) శ్వాస మీద ధ్యాస ఉంచి తీవ్ర ధ్యాన సాధన చేయండి

2) ఆత్మజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు చదవండి

3) అలాగే ఆత్మజ్ఞానం బోధించగలిగే వారి సందేశాలు వింటూ ఉండండి. అవి మీకు భీమవరంలో, అలాగే మన జూమ్లో బాగా దొరుకుతాయి.

4) ఈ మార్గంలో కొంత సేవ చేయాలి. మీరు ఎంత చేయగలిగితే అంత చేయండి. అన్నిటికంటే గొప్పది సరైన ధ్యానం చెప్పడం, అజ్ఞానాన్ని తొలగించడానికి జ్ఞానాన్ని బోధించడం. మరి దాని వల్ల కర్మలు రహితం చేసుకుంటారు, మోక్షాన్ని సంపాదిస్తారు.

ఆఖరికి చేరుకోవాల్సిన లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు. అందుచేత ఈ నాలుగు పనులు చేయండి. ఈ జన్మలోనే మీరు ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకోండి. ఒకవేళ మీరు ఇంకా ఏమైనా కొద్దిగా వెనకబడితే తర్వాత మీకు అనుకూలమైన జన్మ లభిస్తుంది. ఆ జన్మే మీరు ఆఖరి జన్మగా చేసుకోగలుగుతారు. ఈ బురదలోంచి, ఈ లంపటంలో నుంచి శాశ్వతంగా బయటపడతారు.

చావు పుట్టుకలు లేని స్థితికి మీరు చేరుకుంటారు, అదే మీ లక్ష్యం. శంకరాచార్యుల వారు అదే చెప్తున్నారు. తెలివి తొక్కువతనంతో అన్ని చోట్ల వెతుకుతున్నారు. కానీ ఆ ఆత్మ అంటే భగవంతుడు నీలోనే ఉన్నాడు. నీ అజ్ఞానాన్ని తొలగించుకో, అజ్ఞానం వల్లే నువ్వు ఆ భగవంతుడిని పొందలేక పోతున్నావు అన్నారు. అది తొలగించుకోమని ఎంతో స్పష్టంగా చెప్పారు.

గుర్తుపెట్టుకోండి మీరు ఎన్ని పనులు చేసినా, మీ సమస్యలు తీరాలన్నా, మీ కర్మలు పోవాలన్నా, మీరు అనుకున్నవి సాధించాలన్నా, జ్ఞానం సంపాదించాలి. జ్ఞానం పొందితేనే మీరు అన్నీ పొందుతారు. జ్ఞానం పొందకపోతే ఏదీ పొందలేరు.

::15::

# శంకరాచార్యులవారు భూమ్మీదకి రావడానికి కారణం ఏమిటి?

ఆది శంకరాచార్యుల వారు ఎంత గొప్ప స్థితికి ఎదిగారో, ఎంత మందిని ప్రభావితం చేయగలిగారో మన అందరికీ తెలుసు. భారతదేశంలో హిందూ మతం పోయి బౌద్ధం ప్రభలంగా ఉన్న రోజులలో భారతదేశంలో ఆయన జన్మించి హిందూ మతం యొక్క ప్రాముఖ్యతను, అద్వైత సిద్ధాంతాన్ని ఎంతో విపులంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా మూడుసార్లు కాలినడకన ప్రయాణించి ఇంచుమించు అందరినీ తన శిష్యులుగా చేసుకున్నారు. తన ఆశయాలు సుస్థిరంగా భారతదేశంలో ఉండాలనే ఉద్దేశంతో నాలుగు చోట్ల పీఠాలు కూడా స్థాపించారు.

శంకరాచార్యుల వారు భూమి మీదకి రావడం, భారతదేశంలో బౌద్ధం లేకుండా చేసి హిందూ మతాన్ని స్థాపించడం అన్నది ప్రకృతి యొక్క నిర్ణయం కిందే మనం చెప్పుకోవచ్చు. ఎందుచేతనంటే ఈ సృష్టిలో ఏది జరిగిన ప్రకృతి నిర్ణయం ప్రకారమే జరుగుతూ ఉంటుంది. లోకంలో హిందూ మతం అంతరించిపోయింది. అందుచేత హిందూ మత ప్రాశస్త్యాన్ని, అద్వైత సిద్ధాంతం యొక్క గొప్పతనాన్ని మళ్ళీ ప్రవేశపెట్టడానికి ప్రకృతే శంకరాచార్యుల వారిని భూమి మీదకి పంపించింది అని అర్థం చేసుకోవాలి.

అంత గొప్పవాడు అయినటువంటి శంకరాచార్యుల వారి యొక్క సందేశాలు ఎంత గొప్పగా ఉంటాయో మనం తెలుసుకోవచ్చు. మనకి పత్రి గారు ఏమని చెప్పారంటే? ఒక మానవ జన్మలోకి ప్రవేశించిన తర్వాత జన్మలేని స్థితికి చేరుకోవాలి అంటే సుమారు నాలుగు, ఐదు వందల జన్మలు పడుతుంది. అంటే ఒక మానవుడు పూర్ణత్వం పొందాలన్నా, పూర్ణజ్ఞానాన్ని పొందాలన్నా, అన్ని రకాల అనుభవాలు సంపాదించుకోవాలన్నా అన్ని జన్మలు అవసరం.

అంతేకాదు ఇన్ని ప్రాంతాలు ఉండాలి, ఇన్ని మతాలు ఉండాలి, ఇన్ని కులాలు ఉండాలి, ఇన్ని రకాలైనటువంటి జీవితాలు ఉండాలి. అంతేకాదు ముఖ్యంగా పరిపూర్ణ జ్ఞానం పొందాలి అంటే స్త్రీజన్మ అవసరమే, పురుషజన్మ అవసరమే. మరి స్త్రీ జన్మ తీసుకుని ఎన్నో నేర్చుకుంటారు, పురుష జన్మ తీసుకుని ఎన్నో నేర్చుకుంటారు. అందుచేత స్త్రీ ఎప్పుడూ స్త్రీ కాదు, పురుషుడు ఎప్పుడూ పురుషుడు కాదు.

అందుకే శంకరాచార్యుల వారు భూమి మీదకి వచ్చి అంతరించి పోయిన హిందూ మతాన్ని మళ్ళీ స్థాపించడం జరిగింది. హిందూమతంలో ఉన్నటువంటి ఈ ఆధ్యాత్మిక గ్రంథాలు, ఉపనిషత్తులు, వేదాలు, భగవద్గీత, పురాణాలు ఏ మతంలోనూ లేవు. వీటిని అర్థం చేసుకున్నా అవగాహన చేసుకున్నా, సమస్తమూ తెలుసుకున్న వారు అవుతారు. ఇది అవగాహన లేనివారు ఈ మతం అంతరించిపోతుంది, ఆ మతం పెరిగిపోతుంది, లేకపోతే ఇంకో మతం పెరుగుతుంది అంటారు.

కానీ భూమి మీద ఏ మతము అంతరించదు. అన్ని రకాల మతాలు ఉంటాయి. అందరూ ఉంటారు. ప్రతి ఒక్కరూ అన్ని మతాలలోనూ జన్మిస్తారు, ఏ మతం ద్వారా ఏమి నేర్చుకోవాలో అది నేర్చుకుంటారు.

పత్రి గారినే తీసుకోండి ఆయన ఏమన్నారంటే నేను 2500 సంవత్సరాల క్రితం బుద్ధుడు యొక్క శిష్యుడు ఆనందుడిగా ఉండేవాడిని, అప్పుడు నాది బౌద్ధమతము. తర్వాత అమెరికాలో బెంజిమెన్ ఫ్రాంక్లిన్ క్రిస్టియన్ గా జన్మించాను, ఆ తరువాత ఒరిస్సాలో జన్మించి జన్మజన్మంతా ధ్యానమే చేశాను. ఆ తర్వాత హైదరాబాదులో హజ్రత్ ఇనాయత్ ఖాన్ ముస్లిం సూఫీ మాస్టర్ గా జన్మించాను, ఇప్పుడు సుభాష్ గా బ్రాహ్మణ కులంలో హిందువుగా జన్మించాను. ఇప్పుడు నా కులం ఏది? నా మతం ఏది? చెప్పండి అన్నారు. అందుచేత ప్రతీ ఒక్కరికి అన్ని రకాల జన్మలు ఉంటాయి. అందుచేత ఎవరూ

తక్కువ కాదు, ఎవరూ ఎక్కువ కాదు. అందరూ సమానమే.

ఇవాళ మీరు హిందువు అయినంత మాత్రాన మీరు శాశ్వతంగా హిందువు కాదు. ఇవాళ మీరు పురుషుడైనంత మాత్రాన శాశ్వతంగా పురుషుడు కాదు. ఇవాళ ధనవంతులు అయినంత మాత్రాన శాశ్వతంగా ధనవంతులు కాదు. సేవకుడు అయినంత మాత్రాన శాశ్వతంగా సేవకుడు కాదు. రాజుగా అధికారము, భోగము వెలగబోసిన వాడు కూడా మరల పేదవాడిగా, కూలీగా అనుభవాలు సంపాదించవలసిందే.

అందుచేత పత్రి గారు స్పష్టంగా చెప్పారు మనకి. అందరూ ఒకటే అంతా నేనే, నేనే అంతా అని తెలుసుకునేదాకా జన్మలు తీసుకుంటూనే ఉండాలి. ఇప్పుడు మనమంతా ఆ ప్రయత్నమే చేస్తున్నాం. ఇవన్నీ తెలుసుకోవడానికి ఎంతో ఆసక్తిని చూపిస్తున్నాం. తెల్లవారుజామున మూడు గంటలకే లేచి స్నానాలు చేసి ధ్యానం చేస్తున్నాం. ఈ సందేశాలన్నీ ఆసక్తిగా వింటున్నాం.

ఇవన్నీ మీరు తెలుసుకుంటున్నప్పుడు అర్థం చేసుకోవాలి ఇది ప్రకృతి నాకు కల్పించిన అవకాశం అని శ్రద్ధగా ఈ జ్ఞానం అంతా వింటూ, సేకరించుకుంటూ, అది అనుభవంలోకి తెచ్చుకోవాలి. అప్పుడు మీకు సృష్టిలో కొత్త అనుభవాలు, కొత్త జ్ఞానం సంపాదించుకునే అనుకూలమైన జన్మ లభిస్తుంది. ఒకవేళ మీరు నిర్లక్ష్యం చేసినా, అశ్రద్ధ చేసినా, వినీ విననట్టు ఊరుకున్నా దానిని సంపాదించుకోవడానికి మళ్ళీ మళ్ళీ జన్మలు తీసుకోవాలి. అదే ఇప్పుడు మీరు సంపాదించుకుంటే మీకు ఇంక జన్మలు అవసరం లేదు.

చాలామందికి ఇది తెలియక ఏవేవో పనులు చేస్తూ, దాంతో తృప్తి పడిపోతారు. చెడ్డ పనులు కాదు, చెయ్యకూడని పనులు కాదు, కానీ వాటితో సరిపెట్టుకోకూడదు. మనం చేసే ఈ పనుల వల్ల మన జ్ఞానం ఎంత వరకు పెరుగుతుంది అది కూడా ఆలోచించాలి. ప్రకృతి సృష్టి యొక్క జ్ఞానాన్ని అందించడానికి ఒక్కరినో, ఇద్దరినో పంపించదు. అలా పంపిస్తూనే ఉంటుంది.

ఒకరు నిష్క్రమించినా మరి కొంతమంది భూమి మీద ఉద్భవిస్తూనే ఉంటారు. ఈ జ్ఞానం వాళ్ళ ద్వారా అందుతూనే ఉంటుంది. కొంచెం తెలివైన వాళ్ళు ఈ జ్ఞానం ఎవరి వల్ల మనకు అందుతుంది అన్నది గ్రహించి, వాళ్లను అనుసరించి, వాళ్ల ద్వారా ఎంత జ్ఞానం సంపాదించుకోగలరో అంతా సంపాదించుకుంటారు.

లేకపోతే నష్టమేమీ లేదు జన్మలు పెరుగుతాయి అంతే. అది తెలివి తక్కువతనం. జన్మలు తగ్గించుకునే వాడు తెలివైనవాడు. జన్మలు పెంచుకునే వాడు తెలివి తక్కువ వాడు. ప్రకృతి  వాడికి అన్ని అవకాశాలు కల్పించింది కానీ వాడు ఉపయోగించుకోలేదు. ఈ వంక పెట్టి, ఆ వంక పెట్టి, కుటుంబం అంటూ, నేను ఆ పని చేస్తున్నాను, ఈ పని చేస్తున్నాను అంటూ ఉపయోగించు కోడు. వాడికంటే మూర్ఖుడు ఇంకెవరూ ఉండరు. దాన్ని ఉపయోగించుకున్న వాడికంటే విజ్ఞుడు ఇంకెవరూ ఉండరు.

అందుకే  భీమవరం మూడు రోజుల క్లాసులు ఎప్పుడైనా ఒక్కసారి పాల్గొనండి. తర్వాత ఆంధ్ర, కర్ణాటక ఇండియా మొత్తం అన్ని రాష్ట్రాలు తిరగండి. ఎక్కడైనా మీకు అలాంటి జ్ఞానం పొందే అవకాశం, అలాంటి సాధన చేసుకునే అవకాశం దొరికితే దాన్ని అనుసరించవచ్చు. అందరికీ స్వేచ్ఛ ఉంది. అది ప్రకృతి మనకి కల్పించినటువంటి అద్భుతమైన అవకాశం.

ఈ సందేశాలు అన్నీ కూడా నా దగ్గరికి ఎలా వచ్చాయో నాకు అర్థం కాదు. మరి ఒక్కొక్క సందేశం తీసుకుని అమ్మ కానీ, నేను కానీ అనంతంగా ఎలా వివరిస్తున్నాము! మేము అంతకుముందు చదువుకున్నామా? చేసామా? ఎక్కడి నుంచి వస్తున్నాయి ఇవన్నీ? ఇప్పుడు ఈ జ్ఞానం లోకంలో అందరికీ అవసరం. అందుచేత ఈ రకంగా మా ద్వారా మీ అందరికీ అందుతుంది. పత్రి గారు ఇచ్చినటువంటి ఈ 'శ్వాస మీద ధ్యాస' ధ్యానం తీవ్రంగా చేయడానికి భీమవరం క్లాసులు ఎంతగానో ఉపయోగపడతాయి. అందుచేత ఈ అవకాశాన్ని ఉపయోగించుకోండి.

::16::

# "జ్ఞానం - అజ్ఞానం"

మానవుడి జీవితంలో దుఃఖానికి కారణం జ్ఞానపరమైన విషయాలు తెలుసుకోలేకపోవడం. మరి జ్ఞానం అంటే ఏమిటి? అజ్ఞానం అంటే ఏమిటి? అన్నది మనం తెలుసుకోవాలి. కనిపించని వాటి గురించి తెలుసుకోవడమే జ్ఞానం. ఉన్నది తెలుసుకుంటే వాడు జ్ఞాని. ఉన్నది తెలుసుకోకపోతే వాడు అజ్ఞాని.

అంటే మానవ ఇంద్రియాలతో తెలుసుకోలేనిది తెలుసుకోవడమే జ్ఞానం. అవి ఉంటాయి కానీ వాటిని తెలుసుకునే శక్తి మానవ ఇంద్రియాలకు లేదు. మానవ ఇంద్రియాలతో తెలుసుకోలేకపోయినా, మానవ ఇంద్రియాలు ఉపయోగించకపోయినా కనిపించని వాటిని తెలుసుకోగలిగితే వాడిని జ్ఞాని అంటారు.

ఉదాహరణ 1:- ఒక ఆవిడ మెడలో హారం ఉంది మర్చిపోయి ఇల్లంతా వెతుకుతుంది అక్కడ లేదా అంటే ఉంది కానీ ఇల్లంతా వెతుకుతుంది ఇదే అజ్ఞానం. అలాగే ఆత్మ అంటే భగవంతుడు శరీరంలోనే ఉన్నాడు కానీ ఆయన కోసం తీర్థయాత్రలన్నీ తిరుగుతున్నారు. దీనినే అజ్ఞానం అంటారు.

ఉదాహరణ 2:- మీ ఇంట్లో సడన్గా కరెంటు పోయింది. ఇంట్లో ఎన్నో వస్తువులు ఉంటాయి అవన్నీ చీకట్లో కనిపిస్తాయా? కనిపించవు. వస్తువులు లేవా? అంటే ఉన్నాయి. కానీ కనిపించట్లేదు. ఎందుచేత అంటే చీకటి. అందుకే చీకటిని అజ్ఞానంతో పోలుస్తారు.

మళ్ళీ కరెంటు వచ్చింది. ఇప్పుడు అన్నీ కనిపిస్తాయి. ఏ మూల ఏమున్నాయో అన్నీ కనిపిస్తాయి. అందుకే ఉన్న వస్తువులు కనిపించకపోతే అజ్ఞానం అంటారు. ఉన్న వస్తువులు కనిపిస్తే అది జ్ఞానం అంటారు. అందుకే జ్ఞానాన్ని వెలుగుతో పోలుస్తారు. ఇంకా చెప్పాలంటే ఈ ఇంద్రియాలు ఉన్నా,

పనిచేస్తున్నా మీరు తెలుసుకోలేకపోతే, మీకు కనిపించకపోతే అది అజ్ఞానం. ఇంద్రియాలతో సంబంధం లేకుండా తెలుసుకోగలిగేది, చూడగలిగేది జ్ఞానము.

మీరు చూడండి చనిపోయిన తర్వాత శరీరంలోంచి ఆత్మ బయటికి వస్తుంది. గాలిలో ఎదురుగుండానే తేలుతూ ఉంటుంది. ఎవరైనా చూడగలరా? చూడలేరు. ఎందుకు చూడలేరు? అజ్ఞానం. వాడు మాట్లాడతాడు. మీకు వినిపిస్తాయా? మీ ఇంద్రియాలు ఆ మాటలు గ్రహించగలవా? గ్రహించలేవు. కారణం అజ్ఞానం.

ఈ ఇంద్రియాలని ఉపయోగించి చేసే పనులన్నీ కూడా అజ్ఞానంతో చేసే పనులే. పత్రి గారు ఏమంటారంటే! అజ్ఞానంలో ఉంటేనే మీరు దుఃఖంలో ఉంటారు. జ్ఞానం పొందితే మీకు దుఃఖం ఉండదు అంటారు. అంటే చీకట్లో ఉంటే దుఃఖ పడతారు. వెలుగులోకి వస్తే దుఃఖపడరు. అందుకే జ్ఞానం సంపాదించుకోమంటారు.

ఉదాహరణ: మీరు ఇంట్లో భోజనం చేద్దాం అనుకున్నారు, సడన్గా కరెంటు పోయింది. ఏదైనా కొవ్వొత్తో, దీపమో వెలిగిద్దాం అనుకున్నారు. కానీ దానికి కూడా అవకాశం లేకుండా ఉంది. కరెంట్ రావట్లేదు. సరే అలాగే బోజనం చేద్దాం అనుకున్నారు. ఇప్పుడు చూడండి ఆ చీకట్లో వంటింట్లోకి వెళ్లాలంటే అంతకు ముందులాగా టక టకా నడవలేరు. నడిస్తే ఏ గోడకో గుద్దుకోవడమో, దేనికో తగులుకోవడమో జరుగుతుంది.

వంటింట్లోకి వెళ్ళి సెల్ఫ్ లో ఉన్న ప్లేట్లు తీస్తే పైన ఒకటి లాగితే నాలుగు క్రింద పడతాయి. ఏదో ఒక పళ్లెం కాలి మీద పడుతుంది. ఆ చీకట్లో అన్నం ఎక్కడుందో! కూర ఎక్కడుందో! తెలియదు, ఎక్కడ వడ్డించు కుంటున్నామో! తెలియదు. తడుముకుంటూ పెట్టుకోవాలి. ఆ వేడివేడి గిన్నెలు తీసినప్పుడు చెయ్యి కాలుతుంది. ఏదో చచ్చీ చెడీ అన్నీ పెట్టుకుని కలుపుకుని తింటుంటే ఏ మిరపకాయో నోట్లో పెట్టుకుని నమిలితే మండిపోతుంది. మళ్ళీ మంచినీళ్లు కావాలంటే అవి ఎక్కడున్నాయో కనిపించవు. అలా చీకట్లో ఏ

పని చేయాలన్నా ఎన్నో తిప్పలు పడాలి.

అదే సడన్గా కరెంటు వస్తే అన్నీ టకటకా చేసుకుంటారు. మరి చీకట్లో జీవించడానికి, వెలుగులో జీవించడానికి ఎంత తేడా ఉందో అజ్ఞానంలో జీవించడానికి, జ్ఞానంలో జీవించడానికి అంత తేడా ఉంటుంది. మీరు అజ్ఞానంలో జీవిస్తే అన్నీ కష్టాలే, అంతా దుఃఖమే. అదే జ్ఞానవంతులు అయితే అంతా ఆనందమే, అంతా సుఖమే.

లోకంలో ప్రతి ఒక్కరూ దుఃఖపడుతున్నారు, ఏదో ఒక సమస్య, ఏదో ఒక కష్టం, ఏదో ఒక గొడవ, ఏదో ఒక ఇబ్బంది, ప్రతిదానికి బాధే. ఎందుకు బాధపడుతున్నారు? అజ్ఞానం వల్ల. చాలామందికి ఈ సందేహం ఉంది. మరి అజ్ఞానంలో ఉంటే దుఃఖం ఎందుకు వస్తుంది అని?

ఇప్పుడు మీరు కళ్ళతో చూస్తున్నారు. ఎవరిని చూసినా ఏం కనిపిస్తుంది? దేహం కనిపిస్తుంది. ఆత్మ కనిపిస్తుందా? లేదు. మరి ఆత్మ లేదా అంటే? ఉంది కానీ కనిపించట్లేదు. మీరు ఆత్మను చూడగలిగితే అంతా ఒకటే. అందరిలో ఉన్న ఆత్మలు ఒకే రకంగా ఉంటాయి. కానీ మీరు ఆత్మని చూడలేక పోతున్నారు.

మీరు శరీరాలు చూస్తే అంతా ఒకటిగా కనిపించరు. కొంతమంది స్త్రీలు, కొంతమంది పురుషులు, కొంతమంది నల్లగా, కొంతమంది తెల్లగా, కొంతమంది పొట్టిగా, కొంతమంది పొడుగ్గా, తేడాగా కనిపిస్తారు. అవి కాకుండా మనకు సమాజంలో రకరకాల కులాలు, రకరకాల కుటుంబాలు, రకరకాల మతాలు, రకరకాల ప్రాంతాలు, ఇన్ని తేడాలు కనిపిస్తున్నాయి .

ఈ ఇంద్రియాలతో అంటే కళ్ళతో చూసినప్పుడు అంతా వేరు వేరు అనే భావంలో ఉంటారు. అలా ఉండడం వల్ల వాడు వేరు, నేను వేరు అనే భావంతో వాడి మీద ద్వేషం పెంచుకుంటారు. అలా ద్వేషిస్తూ వాడికంటే నేనే అన్నిట్లోనూ ఎక్కువగా ఉండాలి అనే పోటీ ఏర్పడుతుంది. వాడికంటే గొప్పగా జీవించాలి అనే భావంలో ఉంటారు. వాడికి ఎక్కువ ఉంటే అసూయపడతారు.

నేనే బాగుండాలని వాడిని మోసగిస్తారు, అవమానిస్తారు. వాళ్ళంటే సహించలేరు.

ఇలాంటి అభిప్రాయాలు ఉండడం వల్ల వాళ్లతో వీరు ప్రవర్తించే విధానం, చేసే పనులు అన్నీ సృష్టి విరుద్ధంగా ఉంటాయి. మరి సృష్టిలో ఒక సిద్ధాంతం ఉంది కదా! సృష్టిలో ఏది చేస్తే అదే వస్తుంది. కనుక అలా ప్రవర్తించి మళ్ళీ తిరిగి అదే పొందుతారు. మరి వాళ్లు ఈ పనులన్నీ ఎందుకు చేస్తున్నారు? వేరే అనే భావంతో. వేరే అనే భావం ఎందుకు వచ్చింది? వాడూ, నేను ఒకటే అని తెలుసుకోకపోవడం వల్ల. వాడు ఆత్మే, నేను ఆత్మే అన్నది కనిపించకపోవడం వల్ల.

వాడికి జ్ఞానం ఉంటే, ఆత్మను చూడగలిగితే, తెలుసుకోగలిగితే, వాడూ నేను వేరు కాదు, వాడూ నేను ఒకటే అన్న అభిప్రాయం వస్తుంది. అజ్ఞానంలో ఉంటే వేరుగా కనిపిస్తారు. జ్ఞానం పొందితే అంతా ఒకటి కిందే భావిస్తారు. పనులు ఎంత మారిపోతాయో చూడండి.

విచిత్రం ఏమిటంటే! కళ్ళు పనిచేస్తున్నాయి కానీ ఆత్మను చూడలేవు. అదే జ్ఞాని అయితే ఆత్మను తెలుసుకుంటాడు. ఉన్నది చూడలేకపోతే అది అజ్ఞానం. ఉన్నదాన్ని చూడగలిగితే అది జ్ఞానం. మరి ఉన్నది చూడలేక, అంతా ఒకటని తెలియక, చేయకూడని పనులు చేసి కష్టాలు తెచ్చుకుంటున్నారు. కష్టాలు ఎందుకు వస్తున్నాయి? అజ్ఞానం ఉండబట్టే వస్తున్నాయి.

మరి జంతువుల్లో, పక్షుల్లో, జలచరాలలో, క్రిమి కీటకాలలో కూడా ఆత్మ ఉంది. ఆత్మ లేకపోతే ఏదీ జీవించదు, అన్నీ శవాలయిపోతాయి. ఆత్మ ఉంటేనే ఈ కదలికలు, ఈ పనులు, ఈ ప్రవర్తన అన్నీ ఉంటాయి. అందుచేత ఆత్మ ఉంది. మరి కనిపిస్తుందా? అంటే కనిపించదు. చాలా విచిత్రం. నిజంగా అది కనిపిస్తే ఎవరి ప్రవర్తనా ఇలా ఉండదు.

పక్షుల్ని, జలచరాలను, జంతువుల్ని వేరనుకుంటూ వాటిని శుభ్రంగా చంపి మసాలాలేసి తింటున్నారు. ఎందుకు వేరు అని భావిస్తున్నారు? అజ్ఞానం

లో ఉండడం వల్ల.

అందుచేత ఈ కష్టాలు ఉండకూడదు అంటే అజ్ఞానం తొలగించుకునే ప్రయత్నం చేయాలి. దానికే పత్రి గారు శ్వాస మీద ధ్యాస ధ్యానం తీవ్రంగా చేయాలన్నారు. యోగులు రాసిన పుస్తకాలు చదవాలన్నారు, అలాంటి వారితో సాంగత్యం చేయాలన్నారు. మరి ఎప్పుడైతే ఇవన్నీ చేస్తూ ఉంటారో అప్పుడు మీరు కూడా మెల్లమెల్లగా జ్ఞానం సంపాదిస్తారు, మీ ప్రవర్తన మారిపోతుంది, మీ పనులు మారిపోతాయి, అన్నీ తెలుసుకుంటూ వుంటారు. అంతా ఒకటే! అని తెలుసుకుని ఎవరినీ బాధ పెట్టకుండా జీవించినప్పుడు ఇక మీకు కష్టమూ రాదు, దుఃఖమూ రాదు. మీ పనులు సవ్యంగా ఉంటే దుఃఖమే లేదు.

మరి ధ్యానం చేస్తే జ్ఞానం ఎలా కలుగుతుంది? ధ్యానం చేసేటప్పుడు ముందు కళ్ళు మూసుకుంటారు. కళ్ళు మూస్తే విచిత్రం ఏమిటంటే ఇంకో కళ్ళు తెరుచుకుంటాయి. ఏమిటా కళ్ళు? మనోనేత్రం. మనసు పని చేస్తుంది. మీరు కళ్ళు మూసుకుని కూర్చుంటే ఇంటి దగ్గరవన్నీ కనిపిస్తాయి. మీ ఇంట్లో బీరువా, అందులో సామాను అన్నీ కనిపిస్తాయి కాని ఆత్మ కనిపించదు.

ఈ కన్ను మూస్తే మళ్ళీ ఏమైంది? ఇంకో కన్ను తెరుచుకుంది. పోనీలే అది ఆత్మను చూడగలదా అంటే? చూడలేదు. అందుచేత పత్రి గారు ఏం చెప్పారు? 'శ్వాస మీద ధ్యాస' పెట్టి ఆ మనో చక్షువుని కూడా మూసేయ మన్నారు. అప్పుడు మీకు దివ్య నేత్రము తెరుచుకుంటుంది. దానితో ఆత్మను చూడగలుగుతారు.

అందుకే దివ్య నేత్రము ఉన్న వారికి అందరూ ఆత్మలు లాగా కనిపిస్తారు. ఈ నేత్రాలతో చూసేవాళ్ళకి అందరూ దేహాలుగా కనిపిస్తారు. అందుచేత సాధన, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం ఈ మూడు పనులు బాగా చెయ్యండి. ఖచ్చితంగా మీరు జ్ఞానం సంపాదించుకుంటారు మీ జీవితం మారిపోతుంది.

::17::

# శంకరాచార్యుల వారు అద్వైతం బోధిస్తూ.. ద్వైతాన్ని ఎందుకు ప్రోత్సహించారు?

శంకరాచార్యుల వారు ఏ స్థాయిలో వారో మనకు తెలుసు. ఆయన బౌద్ధంలో ఉన్న భారతదేశం మొత్తాన్ని పూర్తిగా హిందూ మతం గా మార్చేశారు. అప్పుడున్న ఆరామాలన్నీ ఎవరికి వాళ్లు తొలగించేసుకున్నారు మళ్ళీ ఆలయ సాంప్రదాయం అంటే హిందూ సాంప్రదాయం వచ్చింది.

మరి శంకరాచార్యుల వారు గుళ్ళు ఎందుకు కట్టించారు? అని కొంతమంది అడుగుతారు. ఆయన తెలివి తక్కువ వాడేమీ కాదు. చెప్పేది అద్వైత సిద్ధాంతమే. ఈ ఆలయ సాంప్రదాయంలో దేవుడు వేరు, నేను వేరు అంటే ద్వైతం ఉంటుంది. మరి ఎందుకు దానిని ప్రోత్సహించారు? అంటే మనకి పత్రి గారు యోగ పరంపర అనే పుస్తకంలో చెప్పారు. మానవ జన్మలోకి ప్రవేశించిన తర్వాత ఒక్కొక్క జన్మ తీసుకుంటూ.. కొంచెం కొంచెం ఎదుగుతూ... వాళ్ళ ప్రవర్తన మార్చుకుంటూ ఉంటారు.

ప్రారంభ జన్మలలో వాళ్ళు దేవుడు లేడు అంటారు. కొన్ని జన్మలు పోయాక ఈ కష్టాలు వస్తూ ఉంటాయి కాబట్టి ఏం చేయాలో తెలియక ఎవరో ఒకరిని ఆశ్రయిస్తారు. ఆశ్రయించాలి కాబట్టి, భగవంతుడు ఉన్నాడు అంటారు, ఆయన గొప్పవాడు కాబట్టి, ఆయనను ఆశ్రయిస్తే ఈ కష్టాల్లో నుంచి బయట పడొచ్చు అనే ఉద్దేశ్యంతో ఈ ఆరాధనలు చేస్తూ ఉంటారు.

ఎవరికి నచ్చిన రీతిలో వారు పూజలు, ప్రార్థనలు చేస్తారు. మొక్కులు మొక్కుతారు, తీర్థయాత్రలు చేస్తారు. ఇంకా కొన్ని జన్మలైన తర్వాత పూజలలోంచి స్తోత్రాలలోకి వస్తారు. ఇంకా కొన్ని జన్మల అయిన తర్వాత స్తోత్రాల నుంచి జపాలలోకి వస్తారు. ఇంచుమించు 300, 350 జన్మలు తీసుకునేసరికి ధ్యానంలోకి వస్తారు.

అప్పటిదాకా కూడా దేవుడు వేరు, నేను వేరు అనే అభిప్రాయం లో ఉంటారు. ఎవరు ఎంత చెప్పినా వినరు. మరి చాలామంది నా దగ్గరకు వచ్చి మా ఆయన నా మాట వినటం లేదండి, నా భార్య నా మాట వినటం లేదండి, నేను ఎంత చెప్పినా ఎక్కట్లేదండి అని చెప్తూ ఉంటారు. అప్పుడు నేను ఇంకో 100 జన్మలు అయ్యాక ఎక్కుతుందిలే అని చెప్తాను.

మరి శంకరాచార్యుల వారికి అన్నీ తెలుసు. ఈ ప్రారంభ జన్మలలో, మధ్యస్థ జన్మలలో ఉన్నవారిని గాలికి వదిలేయకుండా వారికోసం నిర్మింప చేసినదే ఈ ఆలయ సాంప్రదాయం. వారికి అదే ఎక్కుతుంది కానీ ధ్యానం, జ్ఞానం ఎక్కదు. ఆయనకు అన్ని స్థాయిలలో ఉన్నటువంటి ఆత్మలు ఉంటాయి అని తెలుసు. అందరూ తాము శరీరాలు అనుకుంటున్నారు, మానవుడు అనుకుంటారు, కానీ ఎవరూ మానవులు కాదు ఆత్మలు. అందుచేత ఆ జన్మల్లో మార్పు రావడానికే ఈ ఆలయ సాంప్రదాయం.

పత్రిగారు స్పష్టంగా చెప్పారు. ప్రారంభ జన్మలలో ఒక 100 నుంచి 150 జన్మలలో తమోగుణంలో ఉంటారని. 200 నుంచి 250 దాకా రజోగుణంలో ఉంటారని. 250 నుంచి 300 జన్మల దాకా సాత్విక గుణంలో ఉంటారని. 300, 350 జన్మలు దాటాక ధ్యానంలోకి వచ్చి ఆ సాత్విక గుణంలో నుంచి కూడా బయట పడి నిర్గుణంలోకి వెళ్తూ ఉంటారని  చెప్పారు.

తమోగుణంలో మూర్ఖుల్లా ప్రవర్తిస్తారు, రజోగుణంలో మూఢత్వంలో ఉంటారు, సాత్విక గుణంలో వివేకం పొందుతారు. మెల్లిగా నిర్గుణంలోకి వచ్చేసరికి అజ్ఞానం తొలగుతుంది.

మూర్ఖుల్లా ఉన్నప్పుడు నాకు తెలిసిందే కరెక్ట్ అంటారు. తాను పట్టుకున్న కుందేలుకి మూడే కాళ్లు అన్నట్టుగా ఉంటారు. రజోగుణంలో మూఢత్వంలో వుంటారు. అందరూ చేసేదే కరెక్ట్ అంటారు. సాత్విక గుణంలో వివేకవంతులయ్యాక వారు చేసే దానికి భిన్నంగా ఏదైనా కొత్తగా ఉంటే

ఆలోచిస్తారు. ఎదుటి వారిని తప్పు అనరు, విమర్శించరు.

పుస్తకాలన్నీ చదువుతూ వాటిని చాలా అధ్యయనం చేసి ఏది సరైనదో తెలుసుకుంటారు. అది కూడా దాటిపోయి జ్ఞానవంతులు అయితే మెల్లిగా సమస్తము వారికే తెలుస్తుంది. ఇలా మానవ జన్మలోకి ప్రవేశించిన తర్వాత మానవులు రకరకాల స్థాయిలలో ఉంటారు. అందుకే ఈ యోగీశ్వరులు, మేధావులు ఏ స్థాయికి చెందిన వారికి అనుగుణమైనటువంటి పద్ధతులు వారికి ప్రవేశపెట్టారు.

అందుకే శంకరాచార్యుల వారు ఆ అట్టడుగు వర్గాల కోసం అంటే ప్రారంభ జన్మలలో ఉన్న వారి కోసం ఈ ఆలయాలు ఏర్పాటు చేశారు. వాళ్లు కోటీశ్వరులు అవ్వచ్చు, పూజలు చేస్తారు. చివరి జన్మలలోకి వచ్చిన వాళ్ల కోసం ఈ ధ్యానాన్ని, జ్ఞానాన్ని బోధించారు. అలాగే పత్రి గారు కూడా ఈ ప్రారంభ స్థితిలో ఉన్న  వారికి అనుగుణంగా కొన్ని విషయాలు చెప్తూ ఉంటారు.

సహజంగా ప్రస్తుతం భూమి మీద ఉన్న జనాభాలో 60% తమో గుణంలో ఉంటారు. 30% రజోగుణంలో ఉంటారు. 9% సాత్విక గుణంలో ఉంటారు. 1% అంతకన్నా తక్కువ నిర్గుణ స్థితికి చేరుకుంటున్నవాళ్ళు ఉంటారు. పత్రి గారు  ఏదో ఒక ఆశ్రమం నిర్మించుకుని, అక్కడే స్థిరంగా ఉండిపోయి, జ్ఞానకాంక్షతో ఆయన దగ్గరికి వచ్చిన  వారికి మాత్రమే బోధించలేదు. అలాంటి వాళ్ళకి ఆయన ఎలా బోధించినా, అవి ఎంత కఠినమైన నియమాలైనా వారు ఆచరించ గలుగుతారు. ఆయన ఎంత గొప్ప సందేశం ఇచ్చినా అర్థం చేసుకోగలుగుతారు.

కానీ ఆయన ఊరూరు తిరిగారు. మారుమూల గ్రామాలకు కూడా వెళ్ళారు. వందలు కాదు, వేల మంది ఆ క్లాసులకి వచ్చేవారు. మరి ఆ క్లాసులకి వచ్చిన వాళ్ళలో ఎక్కువ శాతం అంటే 90% తమోగుణము, రజోగుణాలలో ఉన్నవాళ్ళే ఉంటారు.

వాళ్ళని "శ్వాస మీద ధ్యాస" పెట్టమంటే వాళ్ళ వల్ల కాదు, పారిపోతారు. ఏమీ లేకుండా అలా శ్వాసను గమనించడం అంటే కూర్చోలేరు. అందుకే మ్యూజిక్ పెట్టేవారు. అటువంటి వాళ్ళు ఎక్కువ ఉన్నప్పుడు వాళ్లకు సంబంధించి కొన్ని మాటలు కూడా చెప్తూ ఉంటారు. ఆ మాటలు అలాంటి స్థితిలో ఉన్న వాళ్లకే కానీ చివరి చివరి జన్మలలో ఉన్న వాళ్ళకి కాదు. జ్ఞానకాంక్ష ఉన్నవాళ్ళకి కాదు.

ఇది అర్థంకాక ఆయన చెప్పాడు, ఆయన చెప్పాడు అనుకుంటూ అవే ప్రామాణికంగా తీసుకుంటారు కొంతమంది. ఇప్పుడు నేను కూడా ఆ 90% వాళ్ళ కోసం చెప్పట్లేదు. 9% ఉన్న వాళ్ల కోసం మాత్రమే చెప్తున్నాను. కాస్త వివేకం ఉన్న వాళ్ళ కోసం, ఆలోచించగలిగిన వాళ్ళ కోసం చెప్తున్నాను. ఎందుకు వాళ్ళనే ఎంచుకున్నాను అంటే! ఇప్పుడు నేను కూడా ఇది చెప్పకపోతే ఆ 9% ఏమైపోతారు? వీరు జ్ఞానాన్ని పెంచుకోవడానికే భూమి మీదకి వచ్చారు. వారికి కావాల్సిన జ్ఞానం దొరకకపోతే వారికి ఈ జన్మ వృధా కదా! ఒక జన్మే నష్టపోతారు కదా!

ఆ 90% వారికి చెప్పే వాళ్ళు ఎంతోమంది ఉన్నారు. ఈ 9% వీరికి చెప్పే వారు లేరు. అందుకే నేను, మా మేడం దీన్ని ఎంచుకున్నాం. మాకు ఈ కాంబినేషన్ అందుకే కుదిరింది. ఇదే మా ప్రణాళిక. వెస్ట్ బెంగాల్ లో ఉన్న ఆవిడ, వెస్ట్ గోదావరి లో ఉన్న నేను కలవడానికి కారణం ఇదే! నేను నా పెళ్లికి ముందు 100 సంబంధాలు చూశాను. డబ్బున్నవాళ్ళు, అందమైన వాళ్ళు ఎంతోమంది వచ్చారు. కానీ ఏదీ ఎక్కలేదు. ఈవిడని చూడగానే అంగీకరించాను. పత్రి గారు పరిచయం అయ్యేదాకా అర్థం కాలేదు. మేము ఇద్దరమూ కలిసి చేయవలసింది, సాధించవలసింది ఉంది కాబట్టే ఈవిడనే చేసుకున్నాను అని ఇప్పుడు అర్థమవుతుంది.

మరి చాలామందికి శంకరాచార్యుల వారు ఆలయాలు నిర్మింపచేసి

ద్వైతాన్ని చెప్తూ అద్వైతాన్ని బోధించారేమిటి? అలాగే పత్రి గారు 'శ్వాస మీద ధ్యాస' అని చెప్తూ పి.ఎం.సి లో మ్యూజిక్ పెట్టి ఎందుకు చేయించారు? గైడింగ్ ఎందుకు చేయించారు? అని అర్థంకాక ప్రశ్నలు వేస్తారు.

ఒకసారి పత్రి గారిని ఆనంద్ స్పష్టంగా అడిగాడు. ధ్యానం అంటే 'శ్వాస మీద ధ్యాస' కదా? ప్రతి క్షణం సత్య దర్శనం అని మనం చెప్తున్నాం కదా? మళ్ళీ ఇవన్నీ ఎందుకు చేయించాలి? అంటే పత్రిగారిచ్చిన సమాధానం ఏమిటంటే! మన పి.ఎం.సి ఒక సూపర్ బజార్ లాంటిదయ్యా, సూపర్ బజార్లోకి ఎవరికి ఏది కావాలంటే అది కొనడానికి వస్తారు. సబ్బు కావాలనుకున్నవాడు సబ్బు కొంటాడు, బట్టలు కావాలనుకున్నవాడు బట్టలు కొంటాడు, చెప్పులు కావాలనుకున్నవాడు చెప్పులు కొంటాడు. కాస్ట్లీ డ్రస్సులు కావాలంటే అవీ కొంటాడు. ఏది కావాలంటే అది కొంటాడు. ఎవరికి నచ్చింది వాళ్ళు పట్టుకెళ్తారు.

అలాగే ఈ మార్గంలోకి వచ్చిన వారు ఎవరికి నచ్చింది వాళ్లు తీసుకుంటారు అని చెప్పి చెప్పారు. మరి కాస్త బుద్ధీ, జ్ఞానం ఉంటే పత్రి గారు చెప్పింది అర్థమవుతుంది. శంకరాచార్యుల వారు ఎంత గొప్పవారో, పత్రి గారూ అంత గొప్పవారు. ఒకటి చెప్పి ఇంకొకటి ఎలా చేయిస్తారు? శంకరాచార్యుల వారు అద్వైతాన్ని చెప్పి ద్వైతాన్ని ఎందుకు ప్రోత్సహిస్తారు! అలాగే పత్రి గారు "శ్వాస మీద ధ్యాస" చెప్పి, మ్యూజిక్ మీద ధ్యాస ఎందుకు ప్రోత్సహిస్తారు! మనకి జ్ఞానం ఉంటే వాళ్ళు ఎందుకు అలా చేశారో అర్థం అవుతుంది.

మనం ఆ స్థాయికి ఎదిగినటువంటి ఆత్మలం కాబట్టే అర్థం చేసుకోగలిగాం. ఈ విషయాలన్నీ బాగా అర్థం చేసుకుంటే ఇదే చివరి జన్మ కూడా చేసుకుంటాం. మరి ఈ మార్గంలోకి వచ్చి కూడా ఈ జ్ఞానాన్ని పొందకపోతే అందులోనే ఉండిపోతారు జన్మ వృధా చేసుకుంటారు.

మనం ప్రపంచాన్నంతా ధ్యానమయం చేయలేం. అసాధ్యం. రజోగుణంలో ఉన్నవారు, తమోగుణంలో ఉన్నవారు జ్ఞానవంతులు ఎలా అవుతారు?అందరూ చేయలేరు. సాత్విక గుణంలో ఉన్నవారే జ్ఞానవంతులు అవుతారు. వారికే బుద్ధి పెంచుకునే అవకాశం ఉంటుంది. వారే మన దగ్గరికి వస్తున్నారు.

మీరు గమనిస్తే మన భీమవరం క్లాసుకి కానీ, మన జూమ్‌లోకి కానీ వందలకొద్దీ, వేలకొద్దీ రావట్లేదు. బుద్ధి స్థితిలో ఉన్నవాళ్లు, బుద్ధిస్థితి దాటిన వాళ్ళు మాత్రమే రాగలుగుతున్నారు. సృష్టిలో అందరినీ సృష్టి చేసింది ప్రకృతే కాబట్టి అందరికీ అన్ని రకాల ఏర్పాట్లు ఉంటాయి. తమో గుణంలో ఉన్న వాళ్ళకి నేర్పే వాళ్ళు ఉంటారు. రజోగుణంలో ఉన్న వాళ్ళకి నేర్పే వాళ్ళు ఉంటారు. సాత్విక గుణము, నిర్గుణానికి దగ్గరగా వచ్చిన వాళ్ళకి కూడా నేర్పే వాళ్ళు ఉంటారు.

అందుకే మేము ఇంకొక దానికి పెద్ద ప్రాముఖ్యం ఇవ్వము. మరి మేము మిగతా వాళ్ళకి చెప్పలేమా అంటే? చెప్పొచ్చు. కానీ వాళ్ళకి అర్థం కాదు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన వాడు ఏబిసిడిలూ, ఎక్కాలు చెప్పలేడా అంటే? చెప్పగలడు. కానీ వాళ్ళు ఇంకా కొన్ని జన్మలు తీసుకుని ఇప్పుడు మీరు ఉన్న స్థాయికి వచ్చేవరకు అర్థం చేసుకోరు. ఇప్పుడు మీరు 350 నుంచి 360 జన్మలు ఖచ్చితంగా దాటి ఉన్నారు కాబట్టి మీకు అర్థమవుతున్నాయి.

అందుచేత అందరితో మీరు పోల్చుకోకండి. అందరూ మీరు ఒకటి కాదు మీ ఆత్మస్థితి వేరు. మీరు చాలా ఎదిగిన ఆత్మలు. చివరి చివరి జన్మలకు వచ్చినటువంటి ఆత్మలు. అందుకే కొంచెం శ్రద్ధ పెట్టండి. ఎంత జ్ఞానాన్ని పెంచుకుంటే మీ జన్మలు అంత తగ్గిపోతూ ఉంటాయి. ఎవరైనా సరే జన్మలు తగ్గించుకోవడానికి చూడాలి. అప్పుడే తొందరగా మీ లక్ష్యాన్ని సాధిస్తారు.

## ::18::

**"తొలి ఉషస్సునందలి ఎర్రని కాంతి పుంజాలతో కూడిన సూర్యుని చేత ముందే సమస్తమైన చీకటి నశించిపోగా ఏ విధంగా అయితే సూర్యుడు ఉదయిస్తాడో, ఆ విధంగానే ఆత్మజ్ఞానం చేత అజ్ఞానం నశించి ఆత్మ స్వయంగానే ప్రకాశిస్తుంది".**

తొలి ఉషస్సు అంటే తెల్లవారుఝామున సూర్యుడు ఉదయించే సమయానికి ఎర్రని కాంతి కిరణాలు వస్తూ ఉంటాయి. అవి వస్తూ ఉంటే చీకటి తగ్గిపోతూ ఉంటుంది. ముందు కిరణాలు వస్తూ ఉంటాయి. తర్వాత సూర్యుడు ఉదయిస్తాడు.

ఆయన కనిపించకపోయినా ఆ కిరణాలు ముందు కనిపిస్తాయి, వెలుతురు వస్తూ ఉంటుంది. అలాగే అస్తమించినప్పుడు కూడా మెల్లిగా సూర్యుడు అదృశ్యమైపోతాడు. కానీ ఆయన కిరణాలు, ఆ వెలుతురు ఇంకా కొద్దిగా ఉంటుంది. మెల్లిగా అవి కూడా పూర్తిగా అదృశ్యం అయిపోతాయి.

అలాగే మీరు పత్రి గారు బోధించినటువంటి ఈ నాలుగు పనులు చేస్తున్నప్పుడు అంటే

1) "శ్వాస మీద ధ్యాస" ఉంచి తీవ్ర ధ్యాన సాధన చేస్తున్నప్పుడు, అంటే ఆలోచనలు లేని స్థితిలో గంటలు గంటలు, రోజులు తరబడి, నెలలు తరబడి చేస్తూ ఉన్నప్పుడు మీరు మూడు గంటలు కూర్చున్నా, నాలుగు గంటలు కూర్చున్నా కూర్చున్నట్టే ఉండదు. మూడు, నాలుగు నిమిషాలు కూర్చున్నట్టు ఉంటుంది. అది తీవ్ర సాధన అంటే.

ఆ స్థితికి వచ్చిన వాళ్ళు ఐదు గంటలు కూర్చున్నా, ఆరు గంటలు కూర్చున్నా లెక్క ఉండదు. ఆ స్థితి వచ్చిన వాళ్ళు నిద్రపోయే ముందు కూర్చుంటే తెల్లారిపోయినా కూడా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఆ స్థితి "శ్వాస మీద ధ్యాస" పెట్టే వాళ్ళకే వస్తుంది కానీ మ్యూజిక్ మీద ధ్యాస పెట్టిన వాళ్లకి, గైడింగ్ చేసేవాళ్ళకి

రాదు. ఇంక ఏ రకమైన ధ్యానం చేసేవాళ్ళకైనా రాదు. ఆ శక్తి “శ్వాస మీద ధ్యాస”కే ఉంది.

2) దానితో పాటు ఆత్మజ్ఞానానికి సంబంధించినటువంటి, ఆత్మ జ్ఞానులు వ్రాసిన పుస్తకాలు చదవాలి. పుస్తకాలు చదివే విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. మన సొసైటీయే, మనవాళ్లే అంటూ శరీరానికి సంబంధించిన, మనసుకు సంబంధించిన, ఆ శరీర లాభాలకి, మనో లాభాలకు సంబంధించిన పుస్తకాలు మీరు చదివితే ఆత్మజ్ఞానం రాదు. మీరు ఎదగలేరు, జ్ఞానం పొందలేరు కూడా.

పత్రిగారు వ్రాసిన పుస్తకాలు చాలా ముఖ్యం. భగవద్గీత, ఉపనిషత్తులు, పురాణాలు అలాగే కొంతమంది యోగీశ్వరులు, శంకరాచార్యుల వారు, వశిష్టుల వారు, వేమన, వీరబ్రహ్మేంద్ర స్వామి, కబీరు లాంటి వారి అద్భుతమైన సందేశాలు వున్న పుస్తకాలు చదవాలి.

అంతేకానీ థాట్ పవర్, మైండ్ పవర్, నీ జీవితం నీ చేతుల్లో, ఇలాంటివన్నీ కాదు. ఎందుకంటే యోగ స్థితి పొందిన వాళ్ళు ఎన్నో వందల మంది ఉన్నారు.. అవన్నీ తీసుకోవాలి, సమకూర్చుకోవాలి. ఏవో కొన్ని పుస్తకాలు తీసుకొని తృప్తి పడిపోవడం కాదు. మీరు ఎంతో డబ్బు ఖర్చు చేస్తారు. కొంత డబ్బుని ఆత్మకు లాభం కలిగించే జ్ఞానం సంపాదించడానికి అంటే పుస్తకాలు సేకరించడానికి ఉపయోగించండి.

మీ గదిలోనే మంచానికి దగ్గరగా గా ఉండేటట్టు ఒక సెల్ఫ్ లో సేకరించిన పుస్తకాలన్నీ పెట్టుకోండి. ఇందులో ఇన్వాల్వ్ అయ్యే కొద్ది ఖాళీ దొరికితే మీకు పుస్తకం తీసి చదవాలని ఉంటుంది. ఆ చదవాలనిపించినప్పుడు ఏదొ ఒక పుస్తకం తీయండి. ఖచ్చితంగా అది మీకు లాభం చేకూరుస్తుంది. సీరియల్ గా ఏ పుస్తకం చదవక్కర్లేదు. నచ్చిన టాపిక్ చదవాలి. మీరు ఏమీ అనుసరించకపోతే జ్ఞానం పెరగడం చాలా కష్టం.

ఎన్ని లాభాలు వచ్చినా, ఎన్ని పొందినా జ్ఞానం పొందకపోతే మీరు చేసిన దానికి, కష్టపడేదానికి సరైన ఫలితం దక్కనట్టే. అందుచేత "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ఎంత ముఖ్యమో, జ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు కూడా అంతే ముఖ్యం.

3) అలాగే ఆత్మజ్ఞానం బోధించేవారి సందేశాలు వినాలి. ఎంత విన్నా, ఎన్ని విన్నా మీలో జ్ఞానం ఎంత పెరిగింది అన్నది కూడా మీరు చూసుకుంటూ ఉండాలి. ఆ మార్పులు మీలో రాకపోతే ఇంకా కష్టపడాలన్న సంగతి తెలుసుకోండి. ఎందుకంటే వింటాం, విన్నది ఎక్కడ గుర్తుంటుంది? విన్నవన్నీ ఎక్కడ అర్థం అవుతాయి? అర్థం కాకపోతే ఆచరణ ఎక్కడ ఉంటుంది? ఆచరణ లేకపోతే జ్ఞానం ఎక్కడ వస్తుంది?

అలాగే పొందిన జ్ఞానాన్ని అందరికీ పంచండి. నేను 22 సంవత్సరాల క్రితం పత్రి గారి పరిచయం ఏర్పడిన తర్వాత ఆయన దగ్గర నేర్చుకున్న పాయింట్ "పంచింది పెంచబడుతుంది." ఆ ఒక్క పాయింట్ పట్టుకున్నాను, మొదట్లో అంత ఎదగలేదు. ఎందుకంటే అప్పుడు ఇంకా కొంచెం స్వార్థం ఉండేది. మనం తెలుసుకున్న ఈ జ్ఞానాన్ని చెప్పేస్తే వాళ్ళు ఎదిగిపోయి నాకు పోటి వస్తారేమో అనే భావం ఉండేది. కాని పత్రి గారిని గమనించాక ఈ జ్ఞానం అనంతం, నా దగ్గర ఉన్న జ్ఞానం ఎంత ఇచ్చినా నాకు ఇంకా పైనుంచి అందుతూ ఉంటుంది అని అర్థమైంది.

అందుచేత నిస్సంకోచంగా నాకు తెలిసిన ప్రతీదీ మన వాళ్ళకి పంచాలి, ఏమీ దాచుకోకూడదు అని అప్పటినుంచి ఏమీ దాచుకోలేదు. ఒక సందర్భంగా అమ్మతోటి, నాతోటి పత్రి గారు అన్నారు. అసలు నా దగ్గర ఇంకేముంది? అన్ని మీకు ఇచ్చేసాను కదా? అన్నారు. మరి ఇన్ని పుస్తకాలు రాసి, సమస్త రహస్యాలు ఆయన ఇచ్చారు. కానీ మన మాస్టర్లు చాలామంది దాచుకుంటారు. వాళ్ళ దగ్గర ఉన్నదాన్ని చెపితే వీళ్ళు నన్ను మించిపోతారేమో

అని భయంతో దాచుకుంటారు.

కానీ పత్రిగారి దగ్గర స్పష్టంగా నేర్చుకున్నాను. అందుకే ఇలా వీడియోల ద్వారా చెప్తూ ఉంటాను, పుస్తకాల్లో కూడా రాస్తూ ఉంటాను, మీరు అడిగినా కూడా చెప్తూ ఉంటాను. మీరు ఈ సూత్రం పాటించండి. ఎంత గొప్పగా ఎదుగుతారో చూడండి. మీరు ప్రత్యేకించి వెళ్లి విను విను అని అందరినీ పీడించక్కర్లేదు. ఆసక్తి చూపించిన వాళ్ళకి దాచుకోకుండా మీరు తెలుసుకున్న టెక్నాలజీ, మీ జ్ఞానం, మీ దగ్గర ఉన్నది ఏదైనా సరే చెప్పే ప్రయత్నం చేయండి.

పత్రి గారు చెప్పారు శిష్యుడు ఒక అడుగు ఎదరకి వెళ్తే గురువు 10 అడుగులు ఇంకా ఎదరికి వెళ్తాడట. ఎందుకంటే సృష్టిలో అనంతమైన జ్ఞానం ఉంది. దీనికి అంతం లేదు. మనం అందరికీ పంచుతూ ఉంటే భగవంతుడు ఇంకా సంబరపడతాడు. వీడు వాళ్ళందరికోసం కృషి చేస్తున్నాడు, వీడికి ఇంకా మనం సహాయం చేయాలి అని అన్ని రకాలుగా సహాయం అందిస్తూ ఉంటాడు. ఈ రహస్యం మర్చిపోకండి మీరు.

మీరు ఎదగాలి అంటే ఇది చాలా గొప్ప సూత్రం. మీ జ్ఞానాన్ని కానీ, మీరు తెలుసుకున్న టెక్నాలజీ కానీ, మీకు ఉన్న ఎటువంటి నైపుణ్యాన్ని అయినా అడిగినప్పుడు, వినడానికి ఆసక్తి చూపించినప్పుడు తప్పనిసరిగా ఇవ్వండి, సహాయం చేయండి.

టెక్నాలజీలో మీరు ఇంకా ఎన్నో టెక్నిక్లు తెలుస్తాయి. నేను గమనించాను ఊరికే మనం ఇచ్చేసినంత మాత్రాన ఒక్కసారిగా వాళ్ళు ఎదిగిపోలేరు. అంత తేలికేం కాదు. వాళ్ళు ఎంతో కష్టపడి కృషి చేస్తే ఎదగగలుగుతారు.

అందుచేత ఈ జ్ఞానానికి సంబంధించినటువంటి సందేశాలు మీరు వింటూ ఉండాలి. అంటే భీమవరంలో అలాగే మార్నింగ్ జూమ్లో ఖచ్చితంగా

వినాలి, వ్రాసుకోవాలి, మళ్లీ మళ్లీ మననం చేసుకోవాలి, అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి, అర్థమయితేనే చక్కగా ఆచరిస్తారు, ఆచరిస్తూ ఉంటే మీకు తెలియకుండానే మీలో జ్ఞానం పెరుగుతూ ఉంటుంది.

ఎప్పుడో మూడు నెలలకో, ఆరు నెలలకో ఒకసారి మిమ్మల్ని మీరు పరీక్షించు కోండి, ఎన్ని విషయాలలో మీలో మార్పు వచ్చిందో వ్రాసుకోండి. ఆత్మజ్ఞాని లక్షణాలు, ప్రవర్తన ప్రత్యేకించి ఒక పుస్తకంలో పెట్టుకోండి. ఎన్నో విషయాలు ఉన్నాయి. అందులో ఎన్ని మీరు పాటిస్తున్నారో గమనిస్తే మీరు ఎదిగారో లేదో మీకే అర్థమవుతుంది. ఎవరూ మనకు సర్టిఫికెట్ ఇవ్వక్కర్లేదు.

4) తర్వాత ఈ మార్గంలో మీరు ఎంత వీలయితే అంత సేవ చేయాలి. ముఖ్యంగా సత్యాన్ని బోధించడానికి ప్రాముఖ్యం ఇవ్వాలి. సత్యమే గొప్పది సత్యం అంటే ఆత్మ, ఆత్మ అంటే పరబ్రహ్మ, ఆయన తప్ప ఈ సృష్టిలో ఇంకేమీ లేదు, ఆయనకి మించిన వారు ఎవరూ లేరు. అంతా ఆయనే! అందుకే నువ్వు ఎవ్వరి దగ్గరా దాచుకోనక్కర్లేదు.

ఎవరు పరబ్రహ్మ కాదు? అందరూ ఒకటేగా! నువ్వు ఎక్కడి నుంచి పొందావు? ఆయన దగ్గర నుంచే పొందావు. అదే అందరికీ ఇస్తున్నావు. అందుకే సత్యాన్ని ఆశ్రయించగలిగే ఈ "శ్వాస మీద ధ్యాస" ధ్యానాన్ని తప్పు దారి పట్టిన వాళ్ళందరికీ తెలియ చేయమంటున్నాను. ఇంతకన్నా గొప్ప సేవ ఇంకొకటి లేదు. ఎంతవరకు మనం చేయగలిగితే అంత ఖచ్చితంగా చేయాలి. వాడికి ఇంక తిరుగులేదు.

15 సంవత్సరాల క్రితం మాంసాహారం యొక్క నష్టాలు, శాకాహారం యొక్క ప్రాముఖ్యం, అందరికీ తెలియజేయడం ముఖ్యము అన్నది అర్థమైంది. అప్పుడు పత్రి గారు చెప్పే సందేశాన్ని బట్టి అప్పుడే రెండు పుస్తకాలు రిలీజ్ చేయడం జరిగింది. మొదట్లో రెండున్నర రూపాయలకి తర్వాత మూడు, నాలుగు, ఐదు, ఇప్పుడు రేట్లు పెరిగాక ఆరు రూపాయలకి ఇస్తున్నాం, ఆ

పుస్తకాలు కొన్ని లక్షల మీదే పంచాం, ఆ పుస్తకాలు చదివి ఎంతోమంది శాకాహారులుగా మారారు.

అలాగే ఒకప్పుడు ఈ మ్యూజిక్లు, గైడింగ్లు లేవు, పత్రి గారు చెప్పిన "శ్వాస మీద ధ్యాస" ధ్యానమే చేసేవారు. ఒకవేళ ఎక్కడైనా పత్రిగారు మ్యూజిక్ పెట్టి చేయించినా దాన్ని పెద్దగా పట్టించుకునేవారు కాదు, ఆయన సమక్షంలో చేసేవారు. ఇంటి దగ్గర ఉన్నప్పుడు మాత్రం నిశబ్దంగా "శ్వాస మీద ధ్యాస" చేసేవాళ్ళు. ఇది లాక్ డౌన్ నుంచి మార్పు వచ్చింది.

ఈ మార్పు వల్ల వీళ్ళు సత్యం తప్పారు, నష్టపోతున్నారు అన్న సంగతి వాళ్ళకి తెలియట్లేదు, అదే వాళ్ళు లాభం అనుకుంటున్నారు. ఎందుకంటే మూర్ఖత్వంలో ఉన్నప్పుడు ఎదుటివాళ్ళు చెప్పింది వినరు, నాకు తెలిసిందే కరెక్ట్ అంటారు. నేను పట్టుకున్న కుందేలుకి మూడే కాళ్ళు అనే స్థితిలో ఉంటారు. అలాంటి మూర్ఖుల్ని మనం ప్రక్కన పెట్టి వివేకవంతులకి తెలియజేయాలి. మరి ఆ వచ్చిన వాళ్ళలో వివేకవంతులు ఎవరో మనకు తెలియదు కాబట్టి ఈ పుస్తకాల ద్వారా తెలియజేసే ప్రయత్నం చెయ్యాలి.

పత్రిగారు కానీ, బుద్ధుడు కానీ ఏమంటారంటే మూర్ఖులతో సంవాదం చేయొద్దు అంటే వాదించొద్దు, వాళ్ళని ఒప్పించాలని ప్రయత్నించద్దు అన్నారు. ఊరికే ఒకటి రెండు సార్లు వాడు వాదనలోకి దిగితే వదిలేయడమే. నీదే రైట్ అని ఒప్పుకొని నువ్వు అదే కొనసాగించు నాయనా అని వదిలేయండి. ఈ సృష్టిలో వాడు ఒక్కడు వినకపోయినంత మాత్రాన వచ్చే నష్టం ఏమీ లేదు. వినేవాళ్ళు ఎంతో మంది ఉన్నారు. వాళ్ళని పట్టుకునే ప్రయత్నం చేద్దాం.

పత్రిగారు విగ్రహారాధన వద్దు సత్యారాధన చేయమన్నారు. కారణం అది అసత్యం కాబట్టి. పూజలు వద్దంటారు అని ఎంతో మంది విభేదించారు, క్లాసులకే రావడం మానేశారు. కానీ ఆయన లెక్క చేయలేదు, ఎన్ని చోట్ల ఎన్ని రకాలైనటువంటి అవరోధాలు వచ్చినా గొడవలు పడే స్థితి వచ్చినా

కూడా ఆయన సత్యాన్ని వదలలేదు.

నాయనా విగ్రహం కాదు ఆత్మే సత్యం, ఆత్మే దైవము అని ఆయన చెప్పబట్టే మనం ఈ మార్గంలోకి వచ్చాం. విగ్రహం అసత్యం, మార్పు చెందేది, మార్పు చెందనిది శాశ్వతమైనది ఆత్మ దాన్నే పట్టుకోండి. ఆత్మను పట్టుకునే మార్గమే "శ్వాస మీద ధ్యాస" అని ఆయన చెప్పారు. ఇంకో ముఖ్యమైన పాయింట్ మాంసం వద్దు అన్నారు. హింస అధర్మం, మాంసం అంటే హింస చేస్తే కానీ రాదు, అది అధర్మం అని నిర్మోహమాటంగా నిర్భయంగా చెప్పారు.

ఇప్పుడు ఆ రెండు కాదు ఇంకొక పెద్ద సమస్య వచ్చింది. పత్రి గారు చెప్పినటువంటి సత్యాన్ని ఆశ్రయించే, సత్యాన్ని పట్టుకునే, సత్యానికి దగ్గర చేయగలిగే ఈ "శ్వాస మీద ధ్యాస" వదిలేసి అసత్యమైన మనసును పట్టుకుంటున్నారు. మనసు దగ్గర ఆగిపోతున్నారు. అందుచేత ఇది చెప్పాల్సిన ధర్మం మనకు ఉంది.

విగ్రహారాధన గురించి చెప్తే అప్పుడు ఎలా విభేదించారో ఇప్పుడు "శ్వాస మీద ధ్యాస" చెప్తే పత్రిగారు చెప్పినా కూడా విభేదించే వాళ్ళు పెద్ద పెద్ద మాస్టర్లే ఉన్నారు, అదే ఆశ్చర్యం. అలాంటి వాళ్ళ కళ్ళు తెరిపించడానికే మనం సరైన సాధన గురించి పుస్తకం రిలీజ్ చేసుకుని అది అందరికీ అందజేసే ప్రయత్నం చేస్తున్నాం.

ఎందుచేతనంటే వాళ్ళతోటి వాదించేటప్పుడు, ఏదైనా డిస్కషన్ వచ్చినప్పుడు పుస్తకంలో ఉన్న అన్ని పాయింట్లు మనం ఒక్కసారే ఇవ్వలేం. ఈ పుస్తకం ఇచ్చి మీరు ఇది చదివి నిర్ణయం తీసుకోండి, ఇది చదివినా కూడా మీకు మీరు చేసేదే కరెక్ట్ అని అనిపిస్తే అదే చేయండి అని మనం చెప్పినప్పుడు సత్యాన్ని ఆశ్రయించే అర్హత ఉంటే వాడు వస్తాడు.

సత్యం అంటే భగవంతుడు, పరబ్రహ్మ. పరబ్రహ్మను ఆశ్రయించే అర్హత అందరికీ లేదు. ఆ అర్హత ఉన్నవాళ్ళమే మనమందరము. వాళ్లకి అర్హత

లేదు అందుకే అంగీకరించట్లేదు. భగవద్గీతలోనే ఉంది ఆయన్ని గుర్తించడం అంత తేలిక కాదు. ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో మనకు ఆ అర్హత వచ్చింది. వాళ్ళు ఇంకా చాలా జన్మలు తీసుకుంటారు.

అందుచేత అలాంటి సేవలో పాల్గొంటే మీకు తెలియకుండానే కొన్నాళ్ళకి మీ జ్ఞానం కొంచెం కొంచెం పెరుగుతూ ఉంటుంది. ఏ విధంగా అయితే సూర్యుడు ఉదయిస్తే చీకటి నశిస్తుందో అదే విధంగా ఆత్మజ్ఞానం చేత అజ్ఞానం పోతూ ఆత్మ స్వయంగా ప్రకాశిస్తూ ఉంటుంది. మీ చేత ఆ ఆత్మ ఎన్నో గొప్ప కార్యాలు చేయిస్తుంది. మీలో అజ్ఞానం, ఆత్మను ఆవరించి ఉన్న చీకటి, అంటే ఆ మనసు తొలగిపోగానే లోపల వున్న ఆత్మ ప్రకాశిస్తూ మీకు ఎన్నో రకాల సందేశాలు, సలహాలు, ఎంతో గొప్ప జ్ఞానం లోపల నుంచే అందిస్తూ ఉంటుంది.

సూర్యుడు ఉదయించగానే చీకటి తొలగిపోయి సూర్యుడు ఎలా ప్రకాశిస్తూ ఉంటాడో, జ్ఞానం సంపాదించగానే అజ్ఞానం దానంతట అదే పోయి ఆత్మ ప్రకాశిస్తూ ఉంటుంది.



## ::19::

**"ఆత్మ అనే ఆరణిలో ఎల్లవేళలా ధ్యానం అంటే 'శ్వాస మీద ధ్యాస' అనే మథనం జరిగితే జ్ఞానం అనే అగ్ని పుట్టి సమస్తమైన కర్మలనే కట్టెల్ని దహించి వేస్తుంది".**

ఏ మానవుడికైనా తాను చేసే చెడు కర్మలు, పాప కర్మల వల్లే కష్టాలు, సమస్యలు వస్తూ ఉంటాయి. ఆ కర్మలు ఉన్నంత కాలం జీవితంలో కష్టాలు అనుభవిస్తూనే ఉంటారు. అందుచేత ఈ కష్టాలు పోవాలి అంటే కర్మలను తొలగించుకునే ప్రయత్నం చేయాలి. కానీ వారి సంచితంలో ఉన్నటువంటి సమస్త కర్మలను దగ్ధం చేసుకునేంతవరకు జన్మలు వస్తూనే ఉంటాయి, కష్టాలు అనుభవిస్తూనే ఉంటారు.

అందుచేత అసలు కష్టాలు ఉండకూడదు అంటే జన్మలే ఉండ కూడదు, జన్మలు ఉండకూడదు అంటే కర్మలు ఉండకూడదు. మరి ఈ కర్మలు ఉండకూడదు అంటే వాటిని దగ్ధం చేసుకోవాలి. అవి ఎప్పుడు దగ్ధం అవుతాయి అంటే? జ్ఞానం అగ్నిలా ప్రజ్వరిల్లినప్పుడు ఆ జ్ఞానాగ్నిలో సమస్తమైన కర్మలు దగ్ధమై మోక్షాన్ని పొందుతారు.

ఏ మానవుడైనా, ఎప్పటికైనా, ఎన్ని జన్మలు ఎత్తినా, జ్ఞానాన్ని సంపాదించుకోవాలి. ఏదో వచ్చిన ఒక కష్టం పోతే చాలదు, కష్టాలకు కారణమైన కర్మలన్నీ దగ్ధం చేసుకోవాలి, దానికి జ్ఞానం తప్ప వేరే మార్గం లేదు. ఆ జ్ఞానం అన్నది "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ద్వారానే సంపాదించుకోగలరు. పత్రి గారు చెప్పినా, ఇప్పుడు శంకరాచార్యుల వారు చెప్పినా, శ్రీకృష్ణుల వారు చెప్పినా ఎవరు చెప్పినా అదే చెప్తున్నారు.

అందుకే ఆత్మ ఉన్న ఈ శరీరంతో ధ్యానం చేస్తూ ఉంటే జ్ఞానం అనే అగ్ని పుట్టి నీ సమస్త కర్మల్ని దగ్ధం చేస్తుంది అన్నారు శంకరాచార్యులవారు. దీన్నే భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు 4వ అధ్యాయంలో 37వ శ్లోకం ద్వారా జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం అని చెప్పడం జరిగింది.

**శ్లో॥ యథైధాంసి సమిద్ధోஉగ్ని ర్భస్మసాత్కురుతేஉర్జున ।**
**జ్ఞానాగ్నిః స్సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా ॥ (భ.గీ. 4-37)**

తా: అర్జునా! బాగుగా ప్రజ్వలింప జేయబడిన అగ్ని కట్టెలను ఏప్రకారము బూడిదగాచేయునో ఆ ప్రకారమే జ్ఞానమను అగ్ని సమస్త కర్మలను భస్మం చేయుచున్నది.

చాలామంది ఏమిటంటే రోగాలు వచ్చినా, కష్టాలు వచ్చినా ఏవేవో కారణాలు చెప్పుకుంటూ డాక్టర్ల దగ్గరికి, ఏదో పండితుల దగ్గరికి, పాస్టర్ల దగ్గరికి, ముస్లింలు మౌల్వీల దగ్గరికి వెళ్లి వాళ్ళు చెప్పినట్టు ఏదో చేస్తూ ఉంటారు. కానీ వీళ్ళకు వచ్చిన కష్టాలు కర్మల వల్ల వచ్చినవే అనే దృష్టి ఎవ్వరికీ ఉండదు. ప్రత్యేకించి అడిగితే చెప్తారు. ఈ కర్మల వల్ల వచ్చిన కష్టాలు పోవాలి అంటే రెండే మార్గాలు

1) అనుభవిస్తే పోతాయి, 2) కర్మ పోతే పోతాయి.

కర్మ పోవడాన్నే భస్మం అవ్వడం అంటాం. అనుభవిస్తే పోతాయి అంటే వాడు చేసిన కర్మ ఒక మూడు మాసాలో, ఆరు మాసాలో, మూడు సంవత్సరాలో, ఆరు సంవత్సరాలో అనుభవించాలి.

అప్పటిదాకా ఎంతమంది డాక్టర్ల దగ్గరికి తిరిగినా, ఎన్ని లక్షలు ఖర్చు పెట్టినా ప్రయోజనం ఉండదు. ఎంత మంది స్వామీజీల దగ్గరకి, ఎంతమంది గురువులు దగ్గరకి తిరిగినా కూడా, ఎన్ని మతాలు మార్చినా, ఎన్ని రకాలు చేసినా కూడా అందులోనుంచి బయట పడలేరు.

అప్పుడు నిరుత్సాహానికి లోనై నేను ఇది చేస్తున్నాను, ఈ మతంలో ఉన్నాను, నాకు తగ్గట్లేదు అంటే ఈ మార్గం పని చేయట్లేదు అని చెప్పి ఇంకో గురువు దగ్గరికో, ఇంకో మాస్టర్ దగ్గరికో, ఇంకో మతానికో మారిపోతారు. ఇప్పుడు మన సొసైటీలో మాట ఎలా ఉన్నా ఇప్పుడు మన దగ్గరికి వచ్చేవాళ్ళు కొంతమంది అలాగే ఉన్నారు. నిజంగా వాళ్ళ అదృష్టం కొద్దీ అన్నిటికీ

పరిష్కారమైన  జ్ఞానం పొందే ఈ మార్గంలోకి వచ్చారు. మన దగ్గరికి ఇలా రాగానే వీళ్ళు చేసే కొంత ధ్యానానికి అన్నీ ఎలా పోతాయి?

అందుచేత రకరకాల గురువుల దగ్గరికి వెళ్తున్నారు. ఇప్పుడు చాలా మంది గురువులే వీళ్ళని మాయ చేస్తున్నారు. వాళ్ళు వీళ్ళ చేత కళ్ళు మూయించి పెద్ద పెద్ద శబ్దాలతో ఆ శివుడి యొక్క పాటలు పెడతారు. వీళ్ళు ధ్యానము చేయరు. కళ్ళు మూసుకుంటారంతే. ఆ పాటలు వింటుంటే చాలా ఉద్వేగం కలుగుతూ ఉంటుంది. మనసు ఉప్పొంగిపోయి ఆ శరీరం ఊగిపోతూ ఉంటుంది. అలా ఊగిపోతూ ఉంటే ఆ గురువులు అక్కడ ఏదో ధ్యానం చేస్తున్నట్టు కళ్ళు మూస్కుని కూర్చుంటారు. అప్పుడు కొంతమంది ఆయన వీళ్ళకి శక్తిపాతం చేస్తున్నాడు అందుకే వాళ్ళు అలా ఊగిపోతున్నారు అని చెప్తూ ఉంటారు.

యూట్యూబ్‌లోనో, టీవీలోనో అవి చూసి ఓహో ఆయన దగ్గరికి మనము వెళ్తే మనకి ఆ శక్తిపాతం వస్తుంది అని వెళ్తూ ఉంటారు. ఎవరెవరు ఊగుతున్నారో చూసి అలాంటి వాళ్ళందరినీ స్టేజ్ ఎక్కిస్తారు. అలా ఎక్కిన వాళ్లంతా ఊగేవాళ్లే. ఇలా రికార్డు పెట్టగానే అలా ఊగిపోతూ ఉంటారు. అవి చూసి అబ్బా ఈ గురువు ఎంత గొప్పవాడు అని ఎగబడుతున్నారు. వాడు ఏదో కారణం చెప్తాడు. లక్షలు కాదు, కోట్లు ఇస్తున్నారు. ఇలా క్యాష్ చేసుకుంటారు వీళ్ళు.

ఆ పాటలు పెట్టకుండా కూర్చోబెట్టండి ఏమీ ఉండదు. వాడికి శక్తి వచ్చిందో లేదో తెలీదు, వీడు ఇచ్చాడో లేదో తెలీదు, వాడూ ఊగిపోతాడు, వీళ్ళనీ ఊపేస్తూ ఉంటాడు. అవి చూస్తూ ఉంటే మనకు నవ్వొస్తూ ఉంటుంది. అంత శబ్దంలో మనసు పని చేస్తూ ఉంటే వీళ్ళకి శక్తి ఎక్కడ వస్తుంది? పత్రి గారు స్పష్టంగా ఎవరూ, ఎవరికీ, ఏమి ఇవ్వలేరు అని చెప్పారు. ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి అని కృష్ణుడే చెప్పాడు.

అసలు వీళ్ళు ఎలా ఇస్తారు? వీళ్ళ దగ్గర ఉన్న శక్తి ఎంత? అసలు అలా శక్తిని ఇస్తే ఏమవుతారో విశ్వామిత్రుడిని చూస్తే మనకు అర్థమవుతుంది. కొంతమంది గురువులు సాధన బాగా చేసి శక్తి పెంచుకున్నారు. ప్రజల్లోకి వచ్చినప్పుడు వాళ్ళ కష్టాలు, వాళ్ళ యొక్క కోరిక ప్రకారం వారి శక్తిని కొంత ఖర్చుపెట్టి వాళ్ళ రోగాలు, జబ్బులు తగ్గించేసరికి వీళ్ళ శక్తి మొత్తం కోల్పోయి సామాన్యులు అయిపోయారు.

అవి ఉన్నప్పుడు వాళ్ళ ఆకర్షణ ఎక్కువగా ఉంటుంది. వాళ్ళు ఏం చెప్పినా జరుగుతుంటాయి. అది ఎప్పుడైతే కోల్పోతారో సామాన్యులు అయిపోయి అందరిలాగే ఉంటారు. అందుకని మళ్లీ ధ్యానం చేసి శక్తి సంపాదించుకునే ప్రయత్నం చేస్తూ ఉంటారు.

వనస్థలి పురంలో ఉండే ఒక గురువు మనోయోగ సాధన చెప్తాడు. ఆయన అమెరికా వెళ్లి అక్కడ కొంతమందికి తగ్గించి శక్తి కోల్పోయి ఇక్కడికి వచ్చాక బయటికి రాకుండా మళ్లీ ఆశ్రమంలో కూర్చుని సాధన చేయడం మొదలుపెట్టాడు. ఇంతకుముందు ఎన్నో సంవత్సరాల నుంచి సంపాదించు కున్నది పోయింది. అందుచేత ఎవరైనా ఎవరికైనా శక్తిపాతం చేస్తే జీరో అయిపోతారు వాళ్ళు. ఇంకేమిస్తారు.

అందుచేత పత్రి గారు ఇలాంటి పనులు ఏమీ చేయరు? ఆయన శక్తిని పోగొట్టుకోరు. ఎక్కడో ఒకడు లోక కళ్యాణం కోసం భవిష్యత్తులో ఎంతో కృషి చేస్తాడు అనే నమ్మకం ఏర్పడినప్పుడు అది కూడా చివర్లో నాలుగు రోజుల్లోనో, వారం రోజుల్లోనో తగ్గుతుంది అన్నప్పుడు సరిచేసి వాళ్ళ చేత పని చేయిస్తూ ఉంటారు. ప్రతివారికి ధైర్యాన్ని ఇచ్చే మాటలు చెప్తూ ఉంటారు, వాళ్ళు ఏం చేయాలో చెప్తారు.

మా మేడం విషయంలో అదే జరిగింది. ఫైర్ యక్సిడెంట్ అయినప్పుడు ధైర్యమే చెప్పారాయన. నీకేమి జరగదు, నువ్వు మామూలుగా

తిరుగుతావు అన్నీ చేస్తావు, విదేశాలకు కూడా వెళ్తావు అని చెప్పారు. ఆ ధైర్యంతోటే రికవర్ అయింది. ధైర్యం కోల్పోయినప్పుడల్లా 10 రోజులకో, 15 రోజులకో ఒకసారి హాస్పిటల్ కి వెళ్లి ఆమెని పలకరించి.. ధైర్యం చెప్పి వచ్చేవారు. ఒకసారి నేను ఎంతమందికి చేస్తాను? ఎంతమందికి చేయగలను? అని అన్నారు. నాకు అప్పుడు అర్థమయింది.

అందుకే స్పష్టంగా చెప్తారు నా చెయ్యి పట్టుకుంటే మీకేమీ రాదు, నా కాళ్ళు పట్టుకుంటే మీకేమీ రాదు. మీ నెత్తి మీద నేను చేయి పెడితే మీకేమీ రాదు అని చెప్పారు. సేతు మహాశయుడు చెప్పినా, శ్రీకృష్ణుడు వారు చెప్పినా ఉద్ధరేదాత్మనాత్మానాం అన్నారు. అంటే ఎవ్వరిని వారే ఉద్ధరించుకోవాలి అన్న సందేశం స్పష్టంగా చెప్తారు.

మరి ఇప్పుడు వచ్చే వాళ్ళందరూ నేను చేస్తాను అంటారు. ఏం చేస్తారు వీళ్ళు. కొన్నాళ్ళు ఆగేసరికి కర్మ అయిపోతుంది, బయట పడతారు, వీళ్ళు నేనే చేశాను అంటారు. అది ఇప్పుడు ఉన్న పరిస్థితి, ఆస్ట్రల్ సర్జరీసు అంతే, ఇప్పుడు మనవాళ్ళు చెప్పే సంకల్ప ధ్యానాలు అంతే, ఇవన్నీ పెట్టినందు వల్ల ఏమీ జరగవు. కర్మతీరి చివరికి వచ్చినోళ్ళు మాత్రమే బయట పడతారు.

అందుచేత గుర్తుపెట్టుకోండి కర్మల వల్ల వచ్చిన కష్టాలు అనుభవిస్తే పోతాయి లేదా కర్మలు పోతే పోతాయి.

అందుకే పత్రి గారు ఏమంటారంటే! “గతం అవగతం అయితే విగతం అవుతుంది” అంటారు. ఆ గతాన్ని అవగతం చేసుకోవడమే జ్ఞానం. ఆ జ్ఞానం పొందడమే అవగతం చేసుకోవడం. అంటే గతంలో వీళ్ళు చేసిన పాప కర్మల వల్లే ఇంత కష్టం వచ్చింది అని అవగాహన చేసుకుంటారు. అప్పుడు ఆ కష్టం అనుభవిస్తూ వారిలో అంతర్మథనం జరుగుతుంది. అప్పుడు అలాంటి కర్మ నేను చేయడం వల్లే కదా ఇలాంటి కష్టం ఇప్పుడు అనుభవిస్తున్నాను. ఆ కర్మే చేయకపోతే ఇప్పుడు ఈ కష్టమే లేదు కదా! అని

ఇంక నేను ఎటువంటి పరిస్థితుల్లో అలాంటి కర్మ చేయను. నా ప్రాణం పోయినా సరే అలాంటి కర్మ నేను చేయను అని నిర్ణయించుకుంటాడు. ఎంత స్ట్రాంగ్ గా నిర్ణయించు కుంటాడంటే తాను ఏమైపోయినా  అటువంటి పని చేయడు. ఎప్పుడైతే అలా నిర్ణయించుకుంటాడో ఎవరు ఎంత ప్రలోభ పెట్టినా పొరబాటున కూడా ఆ పని చేయడు. అంటే ఆ జ్ఞానం వాడు పొందాడు, వాడు ఈ జన్మలో కాదు ఇంక ఎన్ని జన్మలు తీసుకున్నా ఆ పని మాత్రం చేయడు.

ఎలా తెలుస్తుందని మీరు అనుకుంటారు. ఎప్పుడో 10 జన్మల క్రిందట వాడు నిర్ణయించుకున్నా,  50 జన్మల క్రిందట నిర్ణయించుకున్నా, వాడు నిర్ణయించుకున్నది ఆత్మలో నిక్షిప్తం అయిపోయి ఉంటుంది. వాడు ఎన్ని జన్మలు తీసుకున్న తర్వాత అయినా సరే ఆ పని చేస్తూ ఉంటే వెంటనే ఆత్మలోనుంచి ఎందుకు ఆ పని చేస్తున్నావు? అని హెచ్చరిక వస్తుంది. వెంటనే ఆ పని చేయడు.

ఎందుచేత అంటే గతంలో చేసిన దాని వల్లే అన్నది అవగతమైంది, అంటే వాడికి అర్థమైంది . ఆరు నూరైనా నూరు ఆరైనా వాడు చేసిన కర్మల్లో ఇప్పుడు ఏవైతే మానేస్తున్నాడో  అటువంటి కర్మలన్నీ విగతమవుతాయి, అంటే దగ్ధమైపోతాయి! కాని అన్నీ పోవు, అటువంటివే పోతాయి. కారణం వాడికి అంతలా ఆ జ్ఞానం అబ్బింది .

ఇప్పుడు చూడండి చాలామంది మాంసాహారం తింటున్నారు. కారణం ఆ కులాచారం అవ్వచ్చు, కుటుంబాచారం అవ్వచ్చు, లేదు ఇప్పటిదాకా అందరూ తింటున్నారని తింటారు. కానీ ఆ కుటుంబంలో కొంతమంది మీలాంటి వాళ్ళు, ఈ జ్ఞానపరమైన క్లాసులు వినడం వల్ల మాంసం తినకూడదు, ఆ జంతువులని హింసించకూడదు, అవీ నాలాంటి ఆత్మలే, అవీ నేను సమానమే! అనే జ్ఞానం పొందితే, ఇది అర్థం చేసుకున్నాక  ఇంక ఎటువంటి పరిస్థితిల్లోనూ మాంసం

తినకూడదని నిర్ణయించుకుంటారు.

మీ కుటుంబంలో వాళ్ళు అంటే పిల్లలు అవ్వచ్చు, భర్త అవ్వచ్చు, తల్లిదండ్రులు అవ్వచ్చు, ఇంక ఎవరైనా అవ్వచ్చు, వాళ్ళు ఇంకా తక్కువ జన్మల్లో ఉన్నారు, వాళ్ళు అలాంటి నిర్ణయం తీసుకోలేదు, ఆచారం ప్రకారం తినేస్తున్నారు. వాళ్ళకి చెప్తే అర్థం కాదు, వాళ్ళు మానరు. ఎన్నో కారణాలు చెప్తారు, నువ్వు మానస్తే మానెయ్యి, నీ వయసు వచ్చాక మేము మానతాము అని ఎన్నో చెప్తారు.

కానీ మీరు ఎటువంటి పరిస్థితిల్లోనూ తీసుకోరు, కుటుంబ సభ్యులు చెప్తారు, నీకు బలమెలా వస్తుంది? నువ్వు పనులు ఎలా చేసుకుంటావు? అని ఎన్ని చెప్పినా మీరు వింటారు కానీ శాకాహారులు బ్రతకట్లేదా? శాకాహారులు ఏ పనీ చేసుకోవట్లేదా? శాకాహారంలో అన్ని రకాల ప్రోటీన్స్ లేవా? అని మీరు చెప్పేది మీరు చెప్తారు.

అలాగే సమాజంలో ఉన్నారు తప్పదు కాబట్టి ఈ ఫంక్షన్లకి, పెళ్లిళ్లకి, పార్టీలకి వెళ్తూ ఉంటారు. అక్కడ కూడా నాన్వెజ్ వంటకాలు ఉంటాయి. ఇక్కడ మీరు నేను మానేసాను, నేను ఎటువంటి పరిస్థితులలోనూ తీసుకోను, ఊరికే చూడడానికి వచ్చాను అంటారు. అప్పుడు వాళ్ళు బ్రతిమాలుతారు!

ఈ ఒక్కసారికే తినవే, ఒక్కసారికే తినరా, మా కోసం తినరా, తినకుండా వెళ్ళిపోతే ఎలారా? అని ఎంతో బ్రతిమాలుతారు, మొహమాట పెడతారు. వాళ్ళెంత మొహమాట పెడుతూ ఉంటే కొంతమందికి లాగుతూ ఉంటుంది. ఒక్కసారి అన్నాడుగా ఏముంది? ఈ ఒక్కసారికీ తినేసి ఇంక మానేద్దాం అని ఏవో రెండు ముక్కలు తింటారు.

కొంతమంది ఈ రుచిని ఆపుకోలేరు. ఆ ముక్కలు చూస్తుంటే లాలాజాలం అలా ఊరిపోతూ ఉంటుంది తినేస్తారు. అంటే ఇక్కడ ఏం జరిగింది? వీడికి గతం అవగతం కాలేదు. అందుచేత వీడి అకౌంట్‌లో ఉన్న

ఎన్నో జన్మల నుంచి ఉన్న ఆ రకమైన కర్మలన్నీ అలాగే ఉంటాయి. ఆ సమయం వచ్చేటప్పటికి వాటి ఫలితం అనుభవిస్తూ ఉంటాడు. ఏమైంది ఒక్కసారి తింటే అనుకుంటారు. ఇక్కడ కాంప్రమైజ్ అయిపోయరు. అందుచేత ఖచ్చితంగా ఆ కర్మలు దగ్ధం కావు, విగతం కావు. గతంలో చేసింది అవగతం అవ్వలేదు.

అలాగే కొంతమంది ఆడవాళ్ళు భర్తల కోసం మాంసం వండుతూ ఉంటారు. వాడికది ఇష్టం, వీళ్ళు కాదనలేరు. నేను తినట్లేదు కదా అని చెప్పి వాళ్ళకి వండుతూ ఉంటారు. చంపినా, ముక్కల కింద కోసినా, దాన్ని వండినా, తినమని ప్రోత్సహించినా, తిన్నా, వడ్డించినా హింస చేస్తున్నట్టే!

కానీ ఎవరైతే  గతాన్ని అవగతం చేసుకుంటారో, ఎప్పుడైతే వాళ్ళ దృష్టికి ఇది వచ్చిందో, మానేయడమే కాదు భర్త ఎంత ఒత్తిడి చేసినా ససేమిరా నేను ముట్టుకోను అంటారు. నీకు కావాలంటే బయటికి పోయి తిను, నన్ను మటుకు ఇబ్బంది పెట్టకు, నా వల్ల కాదు నేను తినలేను. నువ్వు ఏమైనా చేసుకో, ఇంకేమైనా చేయమను చేస్తాను, ఆ ఒక్క పని చేయమని చెప్పకు అని చెప్తారు.

ఒకవేళ భర్త మరీ వేధిస్తూ ఉంటే మనవాళ్ళు కూడా కొంతమంది అన్నారు. నువ్వు నన్ను చంపేయ్యి దానికైనా నేను ఇష్టపడతాను, కానీ వాటిని మాత్రం నేను చంపను అంటారు. భర్త మాత్రం ఏం చేస్తాడు? భార్యని వదులుకోలేక అలా బయటకి వెళ్ళి తినేవాళ్ళు చాలామంది ఉన్నారు. అలాంటి భార్యలకి వాళ్ళు ఎన్నో జన్మల్లో చేసిన ఇలాంటి కర్మలన్నీ దగ్ధమైపోతాయి.

వాళ్ళు ఆ రకమైన కర్మలు అనుభవించే అవకాశం ఉండదు. ఆ కష్టాలు వాళ్ళకి రావు. మీరు కాంప్రమైజ్ అయితే ఆ కర్మలన్నీ మీ ఖాతాలో ఉండిపోతాయి. అదే పత్రి గారు చెప్పింది “గతం అవగతం అయితే విగతం అవుతుంది” అని.

అదే శంకరాచార్యులవారు స్పష్టంగా చెప్పారు జ్ఞానం అనే అగ్నిలోనే

కర్మలు దగ్ధమవుతాయి అని. జ్ఞానం అంటే తాను చేసిన తప్పు తెలుసుకోవడం, అవగతం చేసుకోవడం. సృష్టిలో ఉన్నటువంటి ఆ సిద్ధాంతాల్ని, ఆ నియమాల్ని అర్థం చేసుకోవడం. అలా అన్ని రకాల తప్పులు నువ్వు అవగతం చేసుకుంటే అంటే నువ్వు పూర్ణ జ్ఞానం పొందితే ఆ రకంగా సమస్త కర్మలు దగ్గమైపోతాయి.

ఇంక నీ ఖాతాలో కర్మలే ఉండవు. ఇంక నీకు జన్మ ఎక్కడ ఉంటుంది? నువ్వు ఏది అవగతం చేసుకుంటావో ఆ రకమైన కర్మలు పోతాయి. అలా ఒక్కొక్క తప్పు, చెడు సరిచేసుకోవాలి. అలా మీలో ఎన్నో రకాల చెడులు ఉన్నాయి, కనీసం ఒక జన్మలో కొన్నైనా సరి చేసుకోవాలి.

మీరు భీమవరం మానకుండా వచ్చి ధ్యానం తీవ్రంగా చేస్తే, జూమ్ లోకి కంటిన్యూగా వస్తూ మీ జ్ఞానం పెంచుకుంటూ ఉంటే మీరు ఇంకా ఎన్నో తెలుసుకుంటారు. మీకు మీరు తెలుసుకుంటారు, ఒకళ్ళు చెప్పక్కర్లేదు! మీ బుద్ధి బాగా పెరుగుతుంది అప్పుడు అన్నీ తెలుసుకుంటారు.



## Tatavarthy Raghavarao Sir Books in English

| | | |
|---|---|---|
| 1. | Life Science (Part-I) | Rs.120 |
| 2. | Why is Guiding Not Meditation ? | Rs.100 |
| 3. | Which is the right meditation ? | Rs.100 |
| 4. | Die before death! | Rs.120 |
| 5. | The Law of Karma | Rs.100 |
| 6. | What is Meditation? | Rs.80 |
| 7. | True Path | Rs.80 |
| 8. | Why soul-knowledge | Rs.70 |
| 9. | What comes after death ? | Rs.70 |
| 10. | How to improve Financial Status ? | Rs.60 |
| 11. | Wisdom is attained only through Meditation | Rs.60 |
| 12. | What is Intention? | Rs.50 |
| 13. | Why is this life? | Rs.50 |
| 14. | Vegetarian Food Is Human Food | Rs.50 |
| 15. | Meditation for the Development of Students | Rs.40 |
| 16. | Non violence and vegetarianism | Rs.40 |

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) మరణించకముందే మరణించాలి - రూ.130/-
10) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
12) గీతాసందేశం - రూ.120/-
13) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/-
23) కర్మ సిద్ధాంతం - రూ.80/-
24) ధ్యానమంటే ? - రూ.80/-
25) త్రివిధాలు - రూ.80/-
26) ఉత్తమ పురుషుడు - రూ.80/-
27) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
28) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
29) జ్ఞాన జ్యోతి - రూ.70/-
30) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
31) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
32) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
34) బుద్ధుని సందేశాలు - రూ.70/-
35) భూతదయే దైవత్వం - రూ.70/-
36) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
38) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
39) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
40) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
41) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
42) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
43) అతీంద్రియ శక్తులు - రూ.60/-
44) ఆలోచించండి - రూ.60/-
45) నిర్వాణ మార్గం - రూ.60/-
46) ధ్యానులకు సూచనలు - రూ.60/-
47) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
48) సంకల్పమంటే? - రూ.50/-
49) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
50) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
51) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
52) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
53) బ్రహ్మం అంటే? -రూ.40/-
54) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం-రూ.40/-
55) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
56) మహాత్ముల సందేశాలు - రూ.40/-
57) సత్యం - రూ.40/-
58) చక్రాలు - రూ.40/-
59) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
60) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
61) మౌన ధ్యానం - రూ.40/-
62) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
63) శాకాహారమే మానవాహారం - రూ.15/-
64) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు : తటవర్తి వీర రాఘవరావు, తటవర్తివారి వీధి,
భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



- "ఆత్మజ్ఞాని అయిన ముని మానవ శరీరంతో కూడి ఉన్నప్పటికీ, ఆకాశం లాగా శరీరానికి సహజమైన గుణాలు ఏవీ అంటకుండా జీవిస్తాడు. అతనికి లోక విషయాలన్నీ పరిపూర్ణంగా తెలిసినప్పటికీ, ఏమీ తెలియని వానిలా నిస్సంగుడై సంచరిస్తాడు".
- "బాహ్యమందు శాశ్వతం కానటువంటివి ఏవి భ్రాంతిని కొల్పుతూ ఉంటాయో, వాటి యందు సుఖాన్ని కాంక్షించే గుణాన్ని విడిచిపెట్టి, ఆత్మ సుఖమునందే నిలిచినవాడై తృప్తి పొందుతూ ఉండాలి. అలాంటివాడు కుండ యందలి దీపం వలె తనలోనే ప్రకాశిస్తూ ఉంటాడు".
- "ఆత్మజ్ఞానం కలిగినవాడు మోహం అనే సముద్రాన్ని దాటి, రాగద్వేషాలు అనే రాక్షసుడిని సంహరించి, ప్రశాంతమైన జీవనంతో ఆత్మానుభూతి పొందినవాడై బ్రహ్మానందంతో ప్రకాశిస్తాడు".
- "భ్రమరం వల్ల కీటకం భ్రమరంగా మారినట్లు, జీవన్ముక్తుడైతే ఆత్మజ్ఞానం కలిగి పూర్వ శరీరానికి అలవాటు ఉన్న గుణాలను వదిలిపెట్టి సచ్చిదానంద రూపం అవటం చేత, నిరంతరం బ్రహ్మ చింతన చేత బ్రహ్మంగా మారుతున్నాడు".
- "పరిపూర్ణమైన ఆత్మజ్ఞానం పొందిన జ్ఞాని అయిన యోగి, కంటి చేత సమస్తమైన విశ్వాన్ని తన ఆత్మ యందే చూస్తాడు. మరియు సమస్తమైన ప్రపంచమంతా కూడా ఒకే చైతన్యం అయిన తన ఆత్మగా దర్శిస్తాడు".
- "వెళ్ళవలసింది ఏ వైపుకో తెలియక తిరుగుతున్న మానవుడు సూర్యోదయం కాగానే తూర్పు పడమరలు తెలిసి, వెళ్ళవలసిన దిక్కు ఏ వైపో తెలుసుకుని, తప్పు దారిని వదిలివేసినట్లుగా, ఆత్మజ్ఞానం నేను, నాది అనే భ్రాంతిని అంతమొందిస్తుంది".

రూ.100/-

- బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు